www.manatelangana.news

Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 203 | శుక్రవారం | 12 జనవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: **Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad**

పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00



తెలంగాణను కెసిఆర్ సుసాధ్యం చేశారు : నాయిని

మనతెలంగాణ/హిమాయత్‌నగర్: అసాధ్యమనుకున్న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును కెసిఆర్ సుసాధ్యం చేశారని హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి వ్యాఖ్యానించారు. రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమంలో సబ్బండ వర్గాల ప్రజలు పాల్గొన్నారని అన్నారు. మలిదశ ఉద్యమంలో తెలంగాణకు అడ్డుపడిన తెలుగుదేశం పార్టీకి స్థానం ఉండకూడదనే ఉద్దేశంతోనే ఆ పార్టీకి చెందినవారిని టిఆర్ఎస్‌లో చేర్చుకుంటున్నామని వ్యాఖ్యానించారు. 1969 తెలంగాణ అమరుల సంఘం తరపున రూపొందిన వార్షిక క్యాలెండర్‌ను మంత్రి నాయిని నర్సింహారెడ్డి గురువారం ఆవిష్కరించారు. టిఎస్ఆర్టీసి నష్టాల్లో ఉన్నందున ప్రభుత్వమే స్వయంగా డబ్బులు చెల్లించి అదుకుంటున్నదని, అమరుల కుటుంబాలకు ఉచిత బస్ పాస్‌లనుఇవ్వడం కష్టసాధ్యమని వ్యాఖ్యానించారు. అయినా ఉద్యమకారుల డిమాండ్లను సిఎం కెసిఆర్ దృష్టికి తీసుకువెళ్తానని తెలిపారు. ఈ ఆవిష్కరణ సభలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రహరి రామరాజు, ఉపాధ్యక్షుడు వనం చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి మారం సంతోష్‌రెడ్డి, కోశాధికారి యేళ్ల చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



28పార్టీలతో 'బహుజన లెఫ్ట్ ఫ్రంట్'

అధ్యక్షులుగా నల్లా సూర్యప్రకాశ్, కన్వీనర్‌గా తమ్మినేని



మన తెలంగాణ/హైదరాబాద్ : రాష్ట్రంలో 28 రాజకీయ పార్టీలతో ''బహుజన లెఫ్ట్ ఫ్రంట్'' (బిఎల్ఎఫ్) ఏర్పడింది. ఫ్రంట్ అధ్యక్షులుగా బిఎస్‌పి మాజీ నాయ కులు నల్లా సూర్య ప్రకాష్, కన్వీనర్‌గా సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను ఎన్నుకున్నారు. ఈ నెల 25న హైదరాబాద్‌లోని వనస్థలిపురంలో గల ఎంపి గార్డెన్స్‌లో ఫ్రంట్ ఆవిర్భావ సభ జరుగుతుందని, సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, ప్రకాష్ అంబేద్కర్ పాల్గొంటారని వారు తెలిపారు. ప్రత్యామ్నాయ రాజకీయ పార్టీల ఫ్రంట్ సన్నాహక సమావేశం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో గురువారం జరిగింది. సమావేశంలో తమ్మినేని వీరభద్రంతో పాటు ప్రజా గాయకులు గద్దర్, ప్రముఖ రచయిత ప్రొఫెసర్ కంచ ఐలయ్యతో పాటు పలు రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయం, రాష్ట్రాభివృద్ధి ప్రత్యామ్నాయ నమూనా, పాలనా ప్రణాళిక, పౌర ప్రజాస్వామిక హక్కుల పరిరక్షణ తదితర 53 అంశాలతో ముసాయిదాను ప్రజల్లో చర్చకు విడుదల చేశారు.ఈ సందర్భంగా తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ రాష్ట్రంలో పాలకులు మారినా పాలన మారలేదన్నారు. రాజకీయాల్లో అన్ని కులాల ప్రజలకు రాజకీయ హక్కు కల్పించడమే ఫ్రంట్ లక్ష్యమన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అన్ని నియోజకవర్గాల్లో ఫ్రంట్ పోటీ చేస్తుందని చెప్పారు. సిపిఐ, సిపిఐ ఎంఎల్ నాయకులతో పాటు అన్ని లౌకిక శక్తులు, ప్రజా సంఘాల నాయకులతో చర్చ లు జరుపుతున్నామని, ఫ్రంట్‌లోకి రావాలని కోరుతున్నామని, వారి చేరికతో బిఎల్ఎఫ్ మరింత బలోపేతమవుతుందని భావిస్తున్నామన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న రాజకీయాలకు ప్రత్యామ్నాయ వేదికగానే బిఎల్ఎఫ్ ఏర్పాటైందని, ప్రస్తుతం ఉన్నపార్టీనో, ముఖ్యమంత్రినో అధికారం నుంచి తొలగించి కొత్త పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కాదని స్పష్టం చేశారు. నల్లా సూర్యప్రకాశరావు మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన రాజకీయ నాయకత్వం అధికారంలోకి రావలసి ఉందన్నారు. ఇప్పుడున్న వ్యక్తుల పాలనకంటే తమ ఫ్రంట్ అధికారంలోకి వస్తే మెరుగైన పాలన అందిస్తామన్నారు. సామాజిక న్యాయం కోసం తమ ఫ్రంట్ పని చేస్తుందని తెలిపారు. పూలే, అంబేద్కర్, మార్క్స్ ఆలోచనా ధోరణితో ఫ్రంట్‌ను ఏర్పాటు చేసినట్లు కంచె ఐలయ్య చెప్పారు.

మభ్యపెడుతున్న కెసిఆర్

మన తెలంగాణ/హైదరాబాద్ : ప్రకటనలు, ప్రచారాల ద్వారా ప్రజలను ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు మభ్య పెడుతున్నారని టిడిపి ఎంఎల్ఎ సండ్ర వెంకటవీరయ్య విమర్శించారు. సరైన సమయంలో ప్రజలు టిఆర్ఎస్‌ను గద్దె దింపుతారన్నారు. ఎన్‌టిఆర్ భవన్‌లో మూడో బ్యాచ్ టిడిపి నేతల శిక్షణ కార్యక్రమం ముగింపు సందర్భంగా సండ్ర మాట్లాడారు. నాడు పార్లమెంట్‌లో రెండు స్థానాలకు పడిపోయిన బిజెపి అలాగే ఉండిపోతే అధికారంలోకి వచ్చి ఉండేది కాదని, అదే స్ఫూర్తితో టిడిపి నేతలు పనిచేయాలన్నారు. ఖమ్మం జిల్లాలో జరుగుతున్న ఎంపిటిసి ఎన్నికలలో ఓడిపోతామనే భయంతో టిడిపి అభ్యర్థిని తుమ్మల నాగేశ్వర్‌రావు కిడ్నాప్ చేయించారని ఆరోపించారు. పొలిట్‌బ్యూరో సభ్యులు రావుల చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మూడు వేలకు పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వం 450నే గుర్తించిందని, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, కెజి టూ పిజి విద్య, ఇంటికో ఉద్యోగం లేవన్నారు. జనవరి 18 న ఎన్‌టిఆర్ 22 వర్ధంతి సందర్భంగా ఎన్‌టిఆర్ అభిమానులు దివ్యాంగులకు దుస్తులు పంపిణీ చేయడంతో పాటు, వసతి గృహంలోని విద్యార్థులకు కావాల్సిన సదుపాయాలు కల్పించాలని టిడి పి సాంస్కృతిక విభాగం అధ్యక్షులు పి. సాయి బాబా ఒక ప్రకటనలో తెలిపారు.

'పబ్' నిందితుడి కోసం గాలింపు

మన తెలంగాణ/హైదరాబాద్:దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన ముంబాయి పబ్ అగ్నిప్రమాద నిందితుడి కోసం ముంబాయి పోలీసులు హైదరాబాద్‌లో జల్లెడపడుతున్నారు.గత నెల 29న ఇందులో అగ్నిప్రమాదం చోటు చేసుకుని 14 మంది మృత్యువాత పడ్డ విషయం తెలిసిందే. ఘటన జరిగిన తరువాత యుక్ అలీ అక్కడి నుంచి పరారై హైదరాబాద్‌లో తలదాచుకుంటున్నాడని విశ్వసనీయ సమాచారం అందుకున్న ముంబాయి పోలీసలు ఇక్కడికి వచ్చారు. ముంబాయి నుంచి నేరుగా అదే రోజు యూక్ అలీ బంజారాహిల్స్ రోడ్డు నెంబర్2లో ఉన్న మోక్ష అపార్టమెంట్‌లోని తన స్నేహితుడి వద్దకు వచ్చాడు. ఈ విషయం తెలియగానే ముంబాయి పోలీసులు హైదరాబాద్ పోలీసులను అప్రమత్తం చేశారు. రెండు నగరాల పోలీసులు బుధవారం రాత్రి మోక్ష అపార్ట్‌మెంట్‌పై దాడి చేశారు. అయితే విషయం పసిగట్టిన యుక్ అలీ చాకచక్యంగా తప్పించుకున్నాడు.

BEFORE RECOVERY OFFICER
DEBTS RECOVERY TRIBUNAL-I
AT HYDERABAD.
3rd FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD - 500 001

R.P. No. 655/2017
in
OA No. 1402/2014

Between :
Andhra Bank, Donti Village Branch, Medak District.
... Certificate Holder
And
Sri Syed Hussain & Others

1. **Sri Syed Hussain** S/o. Imam Muslim, Aged Major, Occ; Agriculture, R/o. 11-82, Black Smith and Gold smith Muslim Mohalla Toopran, Medak District, Proprietor Mahin Plastics ... Certificate Debtor No. 1
2. **Sri Pitla Satya Narayana** S/o. Ramulu, Hindu, Aged Major, Occ : Agriuclture, R/o, Donti, Shivampet Mandal, Medak District. ... Certificate Debtor No. 2
3. **Sri Kailas Rama chandram** S/o. Pentaiah, Konthanpally Village, Shivampet Mandal, Medak District. ... Certificate Debtor No. 3

NOTICE OF DEMAND TO DEEENDANTS / CERTIFICATE DEBTORS

Take notice that R.P.No 655/2017 in O.A.No. 1402 of 2014 has. been forwarded by the Honourable Presiding Officer, Debts Recovery Tribunal, Hyderabad for recovery of an amount of **Rs.15,62,123/- ps** (Rupees Fifteen Lakhs Sixty tow Thousand One Hundreed and Twenty Three only) plus interest and costs from you.. You, the Defendants are hereby required to pay the amount of this notice by way of Demand Draft to be drawn in favour of "Debts Recovery Tribunal-2, Hyderabad" within 15 days from the date of publication of this notice. In case of default, steps will be taken under Rule 4 and 5 of the second schedule of Income Tax Act, 1961 and section 25 to 29 of Recovery of Debts Due to Banks & Financial Institutions Act, 1993.

(D. Anand)
Recovery Officer
HYDERABAD
Place: Hyderabad Date : 19-12-2017

IN THE COURT OF THE HON'BLE SENIOR CIVIL JUDGE AT NIRMAL

I.A. No. 335 of 2017
IN
I.A. No. 334 of 2017
IN
I.A. No. 333 of 2017
IN
I.A. No. 765 of 2011
IN
O.S. No. 86 of 2011

Between:
Machineni Venkateshwar Rao ...Petitioner herein in this I.A/ Petitioner/Petitioner/Plaintiff
AND
Machineni Kishan Rao and 8 others ...Respondents/Respondents/ Respondents/Defendants in the above Suit.

To,
Take notice to proposed parties Respondents/Defendants No.10 to 14

1) P. Ravinder Rao S/o late Kishan Rao, aged about 62 Years, R/o Khanapur V/o of Revenue Districtt Nirmal (Real brother's son (Nephew) of the deceased D-7).
2) P. Sunitha W/o Kishav Rao, aged about 62 Years, R/o H.No. 12-7-134/379, Flat No. 301. R.R. Ni vas, Anjaneya Nagar, Moosapet, Hyderabad-500 018 (Real brother's son (Nephew) of the deceased D-7).
3) P. Madhukar Rao S/o late Kishan Rao, aged about 59 Years, R/o Flat No 503, Sri Sai Apart-ment Rukmini Enclave, R/o H.No. 2-2-68/225/226, Machabollaram, Bollaram, Secunderabad-500010. (Real brother's son (Nephew) of the deceased D-7).
4) P. Pranitha W/o late Haricharan Rao, aged about 51 Years, R/o H.No. 16-11-20/9/1, Flat No. 501, Vijetha Aryan Residency, Salem Nagar Colony, Malakpet, Hyderabad- 500036 (Real brother's sons' wife of the deceased D-7).
5) G. Anitha W/o Pratham Rao aged about 54 years, R/o Duplex House No. 9, Aravelli Enclave, Mano Vikas Nagar, Secunderabad - 500009. (Real brother's daughter of the deceased D-7).

Proposed L.Rs. of the deceased Defendant No. 7-Y Ramakka/to be brought tham on record in the above suit I.A as Responents/Defendants No. 10 to 14 in the above case.

That you the proposed parties to the above suit I.A. on account of death of Y. Ramakka Defendant No. 7 in the above suit, the petitioner/plaintiff filed I.A. No. 333 of 2017 U/S 5 of the limitation act, as the petitioner/plaintiff came to know death of Y. Ramakka reliabully on 18-9-2017 on filing the memo by the counsil for the defendants inthe above suit. Wherein it is informed that defendant No. 7 Y. Ramakka expired on 4-6-2015 living behind her you the above said proposed parties respondent No. 10 to 14 as the legalheirs to be brought on record as L.Rs of D-7 in the above suit. As such the I.A. No. 333 of 2017 file U/S 5 of the limitation Act to condon the delay of 749 days I.A. No. 334 of 2017 for setting a side of the abetement order in the above case, and also filed I.A. No. 335 of 2017 U/O 22 Rule 4 (1) of CPC R/W U/R 28 of Civil Rules of Practice to brought you the proposed parties asparties No. 10 to 14 in the above case. The petitioner/plaintiff has filed process to you all the above said proposed respondents/defendants but intentionally avoiding to receive notices summons issued by the Honble Court in the above and I.As. As such the petitioners/plaintiffs filed petitions before the Honble Court with a prayer for order to for subsitutional services of notice-summons upon you the said peti-tions filed by the peitioners/plaintiffs were allowded on 29-12-2017 and ordered for substitutional of notices-summons to you the proposed respondents/ defendants No. 10 to 14 in the above case by way of publishing in the notice in news paper. As such notices ordered by way of subsitutiuonal serivces of notice as ordered by the Hon'ble Court to you the all the above said proposed respondents/defendants No. 10 to 14 please take notice that the above case and I.A. stands posted on 19-1-2018 at 10-30 a.m before the Hon'ble Sr. Civil Judge court at Nirmal for your appearance and counter if any failing which the matter will be heard and decided against you the proposed respondents No. 10 to 14.

Hence take notice

By order of Sr. Civil Judge Court at Niramal

Sd/- Kondal Reddy, Advocate
H.No. 3-1-228, Christian Colony, KARIMNAGAR. Cell: 9550154871

www.manatelangana.news
Mana Telangana

మన తెలంగాణ

హైదరాబాద్ | సంపుటి 6 | సంచిక: 203 | శుక్రవారం | 12 జనవరి, 2018

...అక్షరం సాక్షిగా ఇది ప్రజల పక్షం

Published from: Hyderabad, Karimnagar, Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad
పేజీలు: 12 + టాబ్లాయిడ్ | వెల రూ. 5.00

ట్రంప్ హరితహారం





అమెరికా ఏటా ఇచ్చే గ్రీన్‌కార్డుల సంఖ్యను 45% పెంచాలని సంకల్పం

ప్రతిభ ఆధార వలస బిల్లును ప్రతినిధుల సభలో ప్రతిపాదించిన ట్రంప్ ప్రభుత్వం

వాషింగ్టన్ : వలసలకు ప్రతిభను ప్రాతిపదికను చేసే బిల్లును ప్రజా ప్రతినిధుల సభలో ప్రవేశపెట్టారు. అధ్యక్షుడు ట్రంప్ మద్దతుగల ఈ బిల్లు గ్రీన్‌కార్డుల కేటాయింపును ఏడాదికి 45 శాతం పెంచాలని కూడా సూచిస్తోంది. ఇవన్నీ భారతీయ టెకీలకు లబ్ధి చేకూర్చే నియమాలే. 'అమెరికన్ల భవిష్యత్తుకు భద్రత' అనే పేరుతో ప్రవేశపెట్టిన ఈ బిల్లును కాంగ్రెస్ ఆమోదిస్తే అధ్యక్షుడు ట్రంప్ సంతకంతో చట్టంగా రూపొందుతుంది. దీంతో వీసా కార్యక్రమంలో భిన్నత్వం అంతమై వలసల సంఖ్య ప్రస్తుతం ఉన్న 10.5 నుండి 2.60 లక్షలకు తగ్గుతుంది. గ్రీన్‌కార్డుల సంఖ్యను ప్రస్తుతం గల తరువాయి 6లో



నేడే ఇస్రో మరో చరిత్ర!

- కార్టోశాట్ 2 సహా 31 ఉపగ్రహాలతో నింగికి పిఎస్ఎల్‌వి-సి40

8

హైకోర్టు సిజెగా రాధాకృష్ణన్

8



చిన్న పరిశ్రమలకు అభయం

సూక్ష్మ, చిన్నతరహా యూనిట్ల సమస్యలపై జిల్లాల్లో నెలనెలా టౌన్‌హాల్ సమావేశాలు

బ్యాంకులు, ప్రభుత్వపరంగా అన్నిరకాల సహకారం : మంత్రి కెటిఆర్ హామీ

మన తెలంగాణ / హైదరాబాద్ : సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల సమస్యల పరిష్కారానికి లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో ప్రతి నెల జిల్లా కేంద్రాల్లో టౌన్ హాల్ సమావేశాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ సమావేశాల ద్వారా పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడం, బ్యాంకులపరంగానూ, ప్రభుత్వపరంగానూ అన్ని రకాల సహాయ సహకారాలను అందిస్తామని ఐటి, తరువాయి 6లో

పంచాయతీకి పవర్స్

సర్పంచ్‌లకు అప్పిలేట్ ట్రిబ్యునల్, కలెక్టర్ చర్యలపై అప్పీల్‌కు అవకాశం?

దోషులకు జరిమానా విధించే అధికారం

రోడ్ల ఆక్రమణ, ఇష్టానుసారంగా చెత్త వేయడం, ఇంట్లోని నీరు వీధిలోకి వదిలేయడం వంటి 22 అంశాల్లో ఉల్లంఘనలపై చర్య తీసుకునే పవర్స్

మంత్రివర్గ ఉపసంఘం భేటీలో చర్చ



మన తెలంగాణ / హైదరాబాద్ : సర్పంచ్‌లపై కలెక్టర్ తీసుకునే క్రమ శిక్షణ చర్యలపై అప్పిలేట్ అథారిటీగా ఒక ట్రిబ్యునల్‌ను ఏర్పాటు చేస్తే ఎలా ఉంటుందన్న దానిపై నూతన పంచాయతీ రాజ్ చట్టంపై ఏర్పాటైన మంత్రుల సబ్ కమిటీ చర్చించింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ కార్యాలయంలో నాలుగో రోజూ సమావేశమైంది. ఈ సందర్భంగా చట్టంలో పొందుపర్చాలనుకుంటున్న పలు కీలక అంశాలపై చర్చించారు. కాగా ఇప్పటి వరకూ సర్పంచ్‌లపై తీసుకునే క్రమశిక్షణా చర్యలపై అప్పిలేట్ అథారిటీగా ప్రభుత్వం తరపున పంచాయతీరాజ్ శాఖ మంత్రే వ్యవహరిస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా ట్రిబ్యునల్ లాంటి వ్యవస్థను ఏర్పాటు చేయడం ద్వారా మరింత పారదర్శకంగా వ్యవహరించేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సబ్ కమిటీ చైర్మన్ జూపల్లి కృష్ణారావు సూచించారు. అలాగే ప్రజలు ఎవరైనా కూడా చట్టానికి లోబడి ఉండక పోతే వారికీ జరిమానాను విధించే హక్కును కూడా సర్పంచ్ నేతృత్వంలోని పాలకవర్గానికి కల్పించడంపై ఈ సమావేశంలో చర్చించారు. రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం, రోడ్డుపై ఇష్టారాజ్యంగా చెత్త వేయడం, ఇంట్లోని నీటిని వీధుల్లోకి వదిలేయడం సహా 22 అంశాల్లో నిబంధనలు ఉల్లంఘించే వారికి పంచాయతీ పాలకవర్గమే జరిమానా విధించే విషయంపై చర్చించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు అక్రమ నిర్మాణాలు లాంటివి చేపడితే వాటిని తొలగించేందుకు అయ్యే ఖర్చును కూడా కారకుల నుండే వసూలు చేసే అంశాన్నీ సబ్ కమిటీ పరిశీలిస్తోంది. ఇప్పటి వరకు పంచాయతీల్లో తరువాయి 6లో



సుప్రీం జడ్జిగా మహిళా న్యాయవాది

కొలీజియం సిఫార్సు

కేంద్రం ఆమోదమే తరువాయి

న్యూఢిల్లీ : ఓ మహిళా న్యాయవాది సుప్రీం కోర్టుకు న్యాయమూర్తిగా వచ్చేందుకు రంగం సిద్ధమైంది. సుప్రీంకోర్టులో ఖాళీగా ఉన్న జడ్జిల స్థానాలను భర్తీ చేసేందుకు సుప్రీంకోర్టు కొలీజీయం ఇద్దరు పేర్లను ప్రతిపాదించింది. అందులో ఒకరు ఉత్తరాఖండ్ హైకోర్టు చీఫ్ జస్టిస్ కె.ఎం.జోసెఫ్, మరొకరు మహిళా సీనియర్ న్యాయవాది ఇందు మల్హోత్ర. న్యాయమూర్తులుగా నియమించేందుకు తరువాయి 6లో

సోయిలేని సన్నాసులు

కాంగ్రెస్ నాయకులపై మంత్రి హరీశ్ రావు ఘాటు విమర్శ

దండుగన్న వ్యవసాయాన్ని పండుగలా మారుస్తున్న కెసిఆర్ పాలనను చూడలేక అర్థంలేని విమర్శలు చేస్తున్నారని మండిపాటు



మన తెలంగాణ/ భూపాలపల్లి: తెలంగాణ ప్రాంతంపై, అభివృద్ధిపై సోయిలేని సన్నాసులు కాంగ్రెసోళ్లని రాష్ట్ర నీటిపారుదల శాఖమంత్రి తన్నీరు హరీశ్ రావు ఘాటుగా విమర్శించారు. దండుగన్న వ్యవసాయాన్ని పండుగ చేసే లక్ష్యంతో సిఎం కెసిఆర్ రేయింభవళ్లు పని చేస్తున్నారని, దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వ్యవసాయానికి 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్, పంటలకు పెట్టుబడిగా సంవత్సరానికి ఎకరాకు రూ.8వేలు ఇస్తున్నారని, ఆయనను, ఆయన ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. కాంగ్రెస్ నాయకులు ప్రజల్లోకి వచ్చి పరిస్థితిని చూడాలని సూచించారు. గురువారం జయశంకర్ జిల్లా భూపాలపల్లి నియోజకవర్గంలోని రేగొండ మండలంలో డిబిఎం-38 ఎస్ఆర్ఎస్‌పి కాలువ మరమ్మతు పనులను ప్రారంభించారు. అదే విధంగా ధాన్యం నిల్వల కోసం నిర్మించిన గోదాంను ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి, స్పీకర్ సిరికొండ మధుసూదనాచారితో కలిసి హరీశ్‌రావు ప్రారంభించారు. అంతక ముందు స్పీకర్ చెంచులకోసం మంజూరు చేసిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. అనంతరం రేగొండలో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో హరీశ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోనే భూపాలపల్లి నియోజకవర్గానికి కోట్లాది రూపాయలను తీసుకువచ్చి అభివృద్ధికి కృషి చేస్తూ ముందు వరుసలో స్పీకర్ నిలుపారని పేర్కొన్నారు. దేశంలోనే తరువాయి 6లో



రైతు సమితుల సహకారం

పెట్టుబడి సాయం సవ్యంగా అందేలా ప్రభుత్వానికి, బ్యాంకులకు మధ్య వారధులు

చెక్కుల పంపిణీ నుంచి నగదు చేయించే వరకు అడుగడుగునా అండదండలు

మన తెలంగాణ/ హైదరాబాద్ : వ్యవసాయ పెట్టుబడి మద్దతు పథకానికి రైతు సమన్వయ సమితులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. సమితుల సభ్యులను ఆ దిశగా సన్నద్ధం చేయడానికి సిద్ధమవుతోంది. పెట్టుబడి సొమ్మును చెక్కుల రూపంలో ఇవ్వాలని మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించినందున గ్రామాల్లో సమన్వయంతో పంపిణీ చేసేందుకు రైతు సమితుల సహకారం తీసుకోనుంది. పథకం ఏ మాత్రం బెడిసికొట్టకుండా, ప్రతి పక్షాలు ఆరోపణలు, విమర్శలు చేసేందుకు ఎటువంటి అవకాశం ఇవ్వకుండా అమలులో ఎటువంటి ఆటంకాలు ఏర్పడకుండా ఉండేందుకే సమితుల సభ్యులకు భాగస్వామ్యం కల్పించనున్నట్లు తెలిసింది. ఇటీవల మద్దతు ధర ఇప్పించడంలో సమితుల సభ్యులు పట్టించుకోకపోవడంపై సిఎం కె. చంద్రశేఖర్ రావు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. పెట్టుబడి పథకంలో ఇలా వ్యవహరించకుండా కాస్త కట్టుదిట్టంగా, క్రమశిక్షణతో పనిచేసేలా చూడాలని అధికారులతో వ్యాఖ్యానించినట్లు తెలిసింది. చెక్కులను పంపిణీకి ప్రభుత్వం నిర్దేశించిన విధంగా రైతులు క్రమ పద్ధతిలో తీసుకునేలా చర్యలు తీసుకోనున్నారు. గ్రామంలోని రైతులందరూ ఒకేసారి బ్యాంకుకు వెళితే నగదు కొరత ఏర్పడటం, గందరగోళం చోటు చేసుకుంటుందని ఈ క్రమంలో సభ్యులు ముందుగానే బ్యాంకు అధికారులను సంప్రదించి సమన్వయం చేయనున్నారు. తద్వారా ఏకకాలంలో కాకుండా రైతులను గ్రూప్‌లుగా చేసి, డబ్బులు డ్రా చేసుకునేందుకు సమితుల సభ్యులు సహకరించే విధంగా ప్రభుత్వం విధానాలు రూపొందించనుంది. చెక్కుల ద్వారా నగదు ఎలా తీసుకోవాలో అవగాహన కల్పించడంతో పాటు సూచనలు, సలహాలు ఇవ్వనున్నారు. అవసరమైతే ఈ విషయంలో వ్యవసాయ శాఖ రైతు సమితుల తరువాయి 6లో

సిక్కుల ఊచకోత కేసులపై సిట్

8

- జస్టిస్ ధింగ్రా నేతృత్వంలో ఏర్పాటు

ఎపి, తెలంగాణ మధ్య పరస్పర పోలీసు బదిలీలు

8

మంత్రాల ఆరోపణతో నలుగురిపై దాడి

7

వ్యాట్ ఎగవేతపై నోటీసులు

ఏడువేల మందికి జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

రూ.708 కోట్ల వసూల్‌కు రంగం సిద్ధం



మన తెలంగాణ / హైదరాబాద్: మూడేళ్ళుగా పేరుకుపోయిన మొండి 'వ్యాట్' బకాయిల వసూళ్ళపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. సుమారు ఏడువేల మందికి నోటీసులను జారీ చేసింది. వారం రోజుల్లో చెల్లింపులు జరపాలని, లేదంటే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆ నోటీసుల్లో వాణిజ్యపన్నుల అధికారులు పేర్కొన్నారు. సుమారు రూ.708 కోట్ల మేరకు వసూలు కావాల్సి ఉన్నదని, 'వ్యాట్' రిటర్న్‌లను దాఖలు చేసినా దానికి సంబంధించిన చెల్లింపులు చేయకపోవడం చట్టవిరుద్ధమని అధికారులు వ్యాఖ్యానించారు. హైదరాబాద్ ఐఐటి సాంకేతిక సహకారంతో ప్రత్యేకంగా 'రిటర్న్ బ్యాలెన్స్ మాడ్యూల్' అనే ఒక సాఫ్ట్‌వేర్‌ను తయారు చేశామని, ఇందులో 2014–2017 మధ్యకాలంలో 'వ్యాట్' రిటర్న్‌లను దాఖలు చేసినా అందులో పేర్కొన్న మొత్తాన్ని ఇప్పటివరకూ ప్రభుత్వానికి చెల్లించని వారి వివరాలను క్రోడీకరించి ఆ సాఫ్ట్‌వేర్ ద్వారానే ఆటోమేటిక్‌గా నోటీసులు జారీ చేసినట్లు అధికారులు తెలిపారు. గతంలో ఇలాంటి 1371 మంది పన్ను ఎగవేతదారులకు నోటీసులు తరువాయి 6లో

కుంచెపోటు



కొత్తల్లుడంట.. టిక్కెట్టు దొరక్క..

సంగీతకు ఊరట



అత్తవారింట్లో సురక్షిత చోటు, నెలకు రూ.20 వేలు : మియాపూర్ కోర్టు ఆదేశాలు

నా పోరాటం ఫలించింది, మీడియాకు, మహిళ, ప్రజాసంఘాలకు కృతజ్ఞతలు : సంగీత

మన తెలంగాణ/ హైదరాబాద్/బోడుప్పల్ : అత్తంటి నుండి తనకు, తన కూతురికి న్యాయం జరగాలని కోరుతూ గత 54 రోజులుగా దీక్ష చేస్తున్న సంగీతకు మీయాపూర్ కోర్టు ఊరటనిచ్చింది. గత ఏడాది నవంబర్ 19న భర్త చేతిలో తీవ్ర దాడికి గురైన సంగీత నాటి నుండి బోడుప్పల్ శ్రీనగర్ కాలనీలోని అత్తంటి ముందు న్యాయం కావాలని దీక్ష చేస్తున్న సంగతి తెలిసిందే. తమ బాగోగులపై కోర్టును ఆశ్రయించిన సంగీతకు గురువారం మియపూర్ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు తరువాయి 6లో



ఎస్‌సిల వర్గీకరణ కష్టసాధ్యం

6లో

- కేంద్రమంత్రి రామ్‌దాస్ అథవాలె

ఉత్తమ్, జానా వస్తేనే చర్చ

విశ్వసనీయతలేని రేవంత్‌తో విద్యుత్‌పై చర్చించం : బాల్కసుమన్



మన తెలంగాణ / హైదరాబాద్ : రేవంత్‌రెడ్డితో తాము చర్చించడానికి సిద్ధంగా లేమని, పిసిసి అధ్యక్షులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సిఎల్‌పి నేత జానారెడ్డి వస్తే చర్చిస్తామని టిఆర్ఎస్ ఎంపి బాల్క సుమన్ అన్నారు. టిఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో శాసనమండలి ప్రభుత్వ విప్ డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎంఎల్‌సి టి.భానుప్రసాద్‌లతో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్వసనీయత లేని రేవంత్‌రెడ్డి, తరువాయి 6లో

"జీవితంలో ముందడుగులు వేయాలంటే మనం మార్పుని ఆహ్వానించగలగాలి.
– విన్‌స్టన్ చర్చిల్"



హిందూ ప్రార్థనలు ఎలా సమ్మతం?

సంపాదకీయం

దేశంలోని కేంద్రీయ విద్యాలయాల్లో ఉదయం ప్రార్థనల్లో హిందూ శ్లోకాల పఠింపును తప్పనిసరి చేస్తూ కేంద్రీయ విద్యాలయ సంఘటన్ విద్యా కోడ్‌ను సవరించటాన్ని సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు కేంద్రప్రభుత్వానికి, కెవి సంఘటన్‌కు నోటీసు జారీ చేసింది. ''ఇది తీవ్రమైన రాజ్యాంగ విషయ సమస్య. సంస్కృతం, హిందీలో అటువంటి ప్రార్థనలు రాజ్యాంగ ప్రాథమిక హక్కులను ఉల్లంఘిస్తున్నాయా, లేదా'' పరిశీలించాలని పిటిషనర్ వీనాయక్ షా అనే వ్యక్తి కోర్టును అర్థించారు. ఆయన పిల్లలు కేంద్రీయ విద్యాలయంలో చదువుకున్నారు. హిందూ మత భావాలను అన్యులకు సైతం తలకెక్కించే యత్నంగా కెవి సంఘటన్ సవరించిన కోడ్ విమర్శలకు గురి అవుతున్నది. ఈ కోడ్ హిందూమత సంబంధ ప్రార్థనను విద్యార్థుల మతం, విశ్వాసంతో నిమిత్తం లేకుండా విద్యార్థులందరికీ తప్పనిసరి చేస్తూ టీచర్లకు పర్యవేక్షణాధికారం ఇచ్చింది. విద్యార్థులు కళ్లు మూసుకుని హస్తాలు జోడించి ప్రార్థన పఠించాలి. ఏ విద్యార్థి అయినా నిర్దేశిత పద్ధతిలో ప్రార్థన పఠించకపోతే టీచర్ ఆ విద్యార్థిని స్టేజి పైకి పిలిచి బహిరంగంగా మందలించాలి. ఆ విధి నిర్వహణలో టీచర్లు విఫలమైతే ప్రిన్సిపాల్ వారిని మందలిస్తాడు. మైనారిటీల, నాస్తికుల, హేతువాదుల పిల్లలు సైతం ఉమ్మడి ప్రార్థన పఠించాల్సిందే. భిన్నమతాలు, ఆచారాలు, సంస్కృతులున్న లౌకికదేశంలో దేశమంతటికీ ఉమ్మడి ప్రార్థనను ప్రభుత్వం విధించవచ్చా? ఆర్టికల్ 28 అర్థం పరిధిలో ఇది ఒక మత ప్రచారం కిందకు రాదా అని పిటిషనర్ ప్రశ్నించారు.

కేంద్రీయ విద్యాలయాలు మనదేశంలో కేంద్రప్రభుత్వ పాఠశాలల వ్యవస్థ. కేంద్ర మానవ వనరుల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో అవి ఏర్పాటైనాయి. ప్రస్తుతం ఈ వ్యవస్థ కింద దేశవ్యాప్తంగా 1125 స్కూళ్లు పనిచేస్తున్నాయి. అవి ఉమ్మడి పాఠ్యప్రణాళికను, సిలబస్‌ను అమలు చేస్తున్నాయి. 50 ఏళ్ల క్రితం ప్రారంభమైన ఈ వ్యవస్థ క్రమక్రమంగా విస్తరించింది. నాణ్యమైన విద్యకు పేరుపొందిన ఈ స్కూళ్లలో సీటు దొరకటం కష్టం. అందువల్ల తమ పిల్లల భవిష్యత్ దృష్ట్యా సమాజంలోని అన్ని విభాగాలకు చెందిన తల్లిదండ్రులు సీటు సంపాదించడానికి ఎంతో ప్రయత్నం చేస్తారు. లౌకికతను వ్యాప్తి చేయాల్సిన కేంద్ర విద్యాలయాలు హిందూమత ప్రార్థనను నిర్బంధం చేయటం రాజ్యాంగ ఆదేశానికి విరుద్ధంగా కనిపిస్తున్నది. పూర్తిగా ప్రభుత్వ నిధులతో నడిచే విద్యాసంస్థల్లో మత బోధన చేయకూడదన్నది లౌకిక రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణం. మద్రసాలు, వైదిక పాఠశాలలు మాత్రమే మతవిద్యకు పరిమితం. మిగతా విద్యాలయాలన్నీ విద్యార్థుల మతం, కులం, లింగం, ప్రాంతంతో నిమిత్తం లేకుండా అడ్మిషన్‌లు నిర్వహిస్తాయి.అందువల్ల లౌకిక విలువలను, మత సామరస్యాన్ని అవి ప్రోత్సహించాలి, పెంపొందించాలి. కేంద్రీయ విద్యాలయాలపై విధించిన ఉమ్మడి హిందూ ప్రార్థన అట్టి లక్ష్యానికి విఘాతం, విరుద్ధం కాదా? ఇది లౌకికతత్వాన్ని స్కూలు స్థాయిలో పెంపొందించదని విద్యానిపుణులు భావిస్తున్నారు. ''విద్యాసంస్థల్లో రాజ్యాంగ వ్యతిరేక ఆచరణలను నివారించాలి. కెవిఎస్ ల్లోనే కాదు, అసంఖ్యాకమైన రాష్ట్రప్రభుత్వ స్కూళ్లలో కూడా హిందూమత ప్రార్థనలు చేయిస్తున్నారు. తెలుగు రాష్ట్రాల్లో నవోదయ విద్యాలయాల్లో, ప్రభుత్వ రెసిడెన్షియల్ స్కూళ్లలో, హాస్టళ్లలో భోజనానికి ముందు హిందూమత ప్రార్థన చేయిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రంలో రెసిడెన్షియల్ స్కూళ్లలో వినాయకచవితి, నవరాత్రి ఉత్సవం జరుపుతున్నారు. విద్యాసంస్థల్లో ఒక మత ఆచరణలను అనుమతించరాదు'' అంటున్నారు స్కూలు టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.నారాయణ.

విద్య, సాంస్కృతిక సంస్థల్లో హిందూ మతాధిక్య భావాలను బరితెగించి చొప్పిస్తున్న, పాఠ్యగ్రంథాలను తిరగరాస్తున్న, హిందూత్వ వాదులను ఉన్నత స్థానాల్లో నియమిస్తున్న ప్రస్తుత పాలనలో, కేంద్రీయ విద్యాలయాల్లో హిందూమత ప్రార్థనను నిర్బంధం చేయటం ఆశ్చర్యం కలిగించదు. అయితే సుప్రీంకోర్టు నోటీసుకు కేంద్ర ప్రభుత్వం ఏమి జవాబిస్తుందో ఆసక్తితో వేచిచూడదగిన అంశం.

ఉరితాళ్లయిన విద్యారుణాలు

చూపు


దేశంలో వేలాదిమంది ఇంజనీరింగ్ కాలేజీల విద్యార్థులు తమ చదువుకు చేసిన రుణాలను తిరిగి తీర్చలేని పరిస్థితిలో ఉన్నారు. వారికి ఇంజనీరింగ్ ఉద్యోగాలు రాకపోడంతో వేరే చిన్న చిన్న ఉద్యోగాలలో కుదురుకోవడం వల్ల రుణాలను తీర్చలేని పరిస్థితిలో పడ్డారు. తమిళనాడుకు చెందిన బి. జయరామన్ అనే విద్యార్థి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్‌లో బాచిలర్ టెక్నాలజీ డిగ్రీ పొంది నాలుగు ఏళ్లయినా ఇంతదాకా ఇంజనీరింగ్ ఉద్యోగం రాలేదు. తంజావూర్‌లోని ప్రైవేట్ సంస్థనుంచి 2011లో ఆ పట్టా పొందిన అతడు చివరకు ఏవో చిన్న చిన్న ఉద్యోగాలలో కుదురుకొన్నాడు. బీమా ఏజెంట్‌గా, డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా కూడా ఉద్యోగాలు చేశాడు. ప్రస్తుతం తంజావూరులో చిన్న నిర్మాణ సంస్థలో పనిచేస్తున్నాడు. జీతం చాలక ఇంజనీరింగ్ చదువుకు తీసుకొన్న రుణం తీర్చలేక పోతున్నాడు. దేశంలో వేలాదిమంది ఇంజనీరింగ్ పట్టభద్రులది ఇదే పరిస్థితి.

తమిళ విద్యార్థి జయ చంద్రన్ ఇంజనీరింగ్ రెండో ఏడాదిలో తీసుకొన్న రూ.1.5 లక్షల రుణం ఇప్పుడు రూ.3 లక్షలు అయింది. ఇంజినీరింగ్ చదివి ఓడిపోయానని ఇప్పుడతను అంటున్నాడు. అతని తండ్రి తమిళనాడు ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగి. ఆయన రెండేళ్ల క్రితం తన కుమారుడి రుణ బకాయిలో రూ.45వేలు తీర్చారు. ఆ తర్వాత నెలసరి వాయిదాలు చెల్లించడం ఆయనకు సాధ్యం కావడం లేదు. చాలామంది ఇంజినీరింగ్ ఉద్యోగాలు రాని పట్టభద్రుల పరిస్థితి ఇలాగే ఉంది. ఇంజినీరింగ్ చదువులకు చేసిన రుణాల భారం వారి తల్లిదండ్రులపై పడింది. దేశంలో ఇంజినీరింగ్ విద్యకు ఆర్థిక సహాయాన్ని అందించడం బ్యాంకులు ప్రారంభించాక ఇంజినీరింగ్ కాలేజీల వ్యాప్తి విస్తారంగా జరిగింది.

2001లో చదువులకు రుణాలు ఇచ్చే పథకాన్ని నాటి ప్రభుత్వం ప్రారంభించింది. ఆ పథకాన్ని 2006, తిరిగి 2009లో సవరించారు. వడ్డీ సబ్సిడీకి కేంద్ర పథకాన్ని ప్రవేశపెట్టడంతో చదువుల రుణాలపై వడ్డీ భారం లేకుండా అయింది. ఆ కోర్సు పూర్తికాలం తర్వాత కూడా ఏడాదిపాటు ఆ రుణంపై వడ్డీ లేదు. అయితే ఈ రుణ దరఖాస్తులకు ఒక షరతు విధించారు. ఆ విద్యార్థి కుటుంబ ఆదాయం ఏడాదికి రూ.4.5లక్షలు మించకూడదు.2015లో విద్యారుణాలకు క్రెడిట్ గ్యారంటీ నిధి పథకాన్ని కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనికింద ఎటువంటి కొలేటరల్(హామీ)చూపకుండా రూ.7.5లక్షల గరిష్ఠ రుణం తీసుకోవచ్చు.

అదే కాలంలో సాంకేతిక విద్య అందించే కళాశాలల సంఖ్య దేశంలో విపరీతంగా పెరిగింది. వాటి సంఖ్య 2006–2007లో 1600 కాగా 2016–17లో 3,391కి పెరిగింది. కళాశాలల వ్యాప్తి అంత విపరీతంగా ఉంటే విద్యాప్రమాణాలు పడిపోతాయని సాంకేతిక విద్య భారతీయ మండలి పలు సమావేశాల్లో హెచ్చరించినప్పటీ ఈ పెరుగుదల ఆగలేదు. మొత్తం బ్యాంకుల బకాయిల్లో విద్యార్థుల రుణాలు మొత్తం 2013 మార్చి నుంచి 2016 డిసెంబర్‌కు 142 శాతం పెరిగింది. ఈ మొత్తం రూ.6,336 కోట్లు అయింది.

ఇంజినీరింగ్ కోర్సుల కోసం తీసుకున్న రుణాలే అధికంగా బకాయిపడ్డాయి. అఖిల భారత బ్యాంకు సిబ్బంది సంఘం ప్రధాన కార్యదర్శి సి.హెచ్ వెంకటాచలం ఈ విషయం చెప్పారు. తన వద్దకు వచ్చే కేసులలో 90శాతం ఇంజినీరింగ్ బకాయిల కేసులే అని 2013లో విద్యారుణాల అవగాహన ఉద్యమం నడిపిన మాజీ బ్యాంకర్ రాజ్ కుమార్ చెప్పారు. తమిళనాడుతో సహా చాలా రాష్ట్రాలలో ఇంజనీరింగ్ కాలేజీల సంఖ్య పెరిగినట్లుగా వాటిలో విద్యా ప్రమాణాలు పెరగడం జరగలేదు. ఉదాహరణకు 500దాకా ఇంజినీరింగ్ కాలేజీలు గల తమిళనాడులో మౌలిక సౌకర్యాలు చాలా వాటిలో లేక ప్రమాణాలు పడిపోయాయి.



భారతీయ సాంకేతిక విద్యామండలి అందించిన సమాచారం ఇది. చాలాకాలంగా ఆ విద్యాసంస్థలను క్రమబద్ధీకరించనందువల్ల ఈ సమస్య వచ్చిందని మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వశాఖకు చెందిన అధికారి ఒకరు చెప్పారు. ఆ మంత్రిత్వ శాఖ 'విద్యా లక్ష్మి డాట్ కామ్' అనే వెబ్‌సైట్‌ను ఆయన సారథ్యంలోనే ప్రారంభించింది. ఇంజినీరింగ్ విద్యా రుణాలకు, వడ్డీ సబ్సీడీకి దరఖాస్తు చేసుకునేందుకు ఈ వెబ్‌సైట్‌ను నెలకొల్పారు. చాలా కేసులలో విద్యార్థులు తీర్చలేకపోయిన రుణ బకాయిలను కొంతకాలంపాటు తండ్రి తీర్చడం, తర్వాత చేతులెత్తేయడం జరిగింది. రుణాల మాఫీ కాలం పూర్తి అయ్యాక కూడా బకాయిలు చెల్లించని కొన్ని కేసులలో రుణ గ్రహీతలను పిలిపించి దర్యాప్తు జరుపుతారు. చాలామంది తల్లిదండ్రులు బ్యాంకు రుణభారాన్ని అవమానంగా భావించి తమ పిఎఫ్ సొమ్ము నుంచి తిరిగి చెల్లించడం చేస్తున్నారు.

సరియైన ఉద్యోగం లేక, బ్యాంకుల రుణభారం తీరక చాలా మంది విద్యా జీవితం అక్కడితో ముగిసిపోతోంది. ఈ సమస్య దేశమంతటా ఉన్నప్పటికీ, తమిళనాడు, కేరళలో విద్యా రుణాల ఎగవేత ఎక్కువగా ఉంది. 'విద్యా రుణాల తిరిగి చెల్లింపు సమర్థన పథకం' ను కేరళ గత ఆగస్టులో ప్రారంభించింది. అది రుణం నుంచి ఊరట కల్పించే పథకం కాదని వివరణ ఇచ్చింది. ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం ఇంజినీరింగ్ విద్యార్థి రుణంలో కొంత భాగం చెల్లిస్తుంది. ఏడాదికి రూ.6 లక్షల కంటే తక్కువ ఆదాయం గల కుటుంబాలకు ఈ పథకాన్ని వర్తింప చేసింది.

తమిళనాడులో అటువంటి పథకం ఏదీ లేదు. రుణ భారం భరించలేక ఇటీవల మదురైలో ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. రుణాల వసూలు ఏజెంట్లు వెంటపడి వేధించడం వల్ల 23 ఏళ్ల అతడు ఈ దారుణానికి పాల్పడ్డాడు. అతని రుణ బకాయి మొత్తం రూ.1.9 లక్షలు. చదివే విద్యార్థులు, చదువు చెప్పే కళాశాలలు పెరిగినట్లుగా ఇంజినీరింగ్ రంగంలో ఉద్యోగాలు పెరగకపోవడం ఈ సమస్యకు మూలకారణమని విద్యారుణాల అవగాహన ఉద్యమ నాయకుడు రాజ్ కుమార్ తెలిపారు.

ఇంజినీరింగ్ పట్టభద్రుల్లో కేవలం 40 శాతం మందికే ఉద్యోగాలు వచ్చినట్లు మానవ వనరుల అభివృద్ధి శాఖామంత్రి ప్రకాశ్ జవదేకర్ మార్చిలో తెలిపారు. తమ విద్యా సంస్థలు ఇచ్చిన తప్పుడు హామీలను నమ్మి మోసపోయామని ఆ విద్యార్థులు ఇప్పుడు అంటున్నారు. భారీ జీతాలతో నూటికి నూరుశాతం ఉద్యోగ కల్పన జరుపుతామని ఆ సంస్థలు హామీ ఇచ్చి విఫలం అయ్యా యి. ప్రభుత్వం కల్పించిన రుణ సౌకర్యం విద్యార్థులపాలిట యమపాశంగా మారడం ఇందులోని విషాదం.

* శ్రేయ రాయ్ చౌదరి

'పద్మావత్' చిత్ర 'రాజకీయం'!



వాహెద్
7093788843

రాజస్థాన్ ప్రభుత్వం ఇంతవరకు రెండు సినిమాలను నిషేధించింది. ఇందుకోసం అల్లర్లు చేసింది కర్ణీసేన. రాజపుత్ర సముదాయం ప్రతినిధిగా కర్ణీసేన తన గురించి చెప్పుకుంటుంది. అది నిషేధం కోసం అల్లర్లు చేసిన రెండు సినిమాలూ చారిత్రక చిత్రాలుగా అందరూ భావిస్తున్నప్పటికీ పాత్రలు మాత్రం కల్పితమైనవే అని చాలామంది చరిత్రకారుల అభిప్రాయం.

ఇందులో మొదటి సినిమా జోధా అక్బర్. ఈ సినిమా వచ్చినప్పుడు కూడా కర్ణీ సేన దానిని నిషేధించాలని గలాభా చేసింది. రాజస్థాన్ కాలేజీల్లో ఘర్షణలు జరిగాయి. కర్ణీసేన అభ్యంతరాలేమిటం టే ఒక రాజపుత్ర రాకుమారిని ముస్లిం అయిన అక్బర్ చక్రవర్తి పెళ్ళాడ్డం వాళ్ళు చూడలేకపోవడం. నిజానికి చరిత్రలో అక్బరుకు జోధాబాయి అనే భార్య లేనేలేదని చాలా మంది చరిత్రకారుల అభిప్రాయం. అక్బర్ చక్రవర్తి రాజపుత్ర రాకుమారిని పెళ్ళాడింది నిజమే కాని ఆమె రాజా బిహారీమల్ కూతురు, అమెర్ రాజకుమారి. ఆమె పేరు హీరా కుమారి. ఆమెకు పుట్టినవాడే జహంగీర్. ఆమె పేరు తర్వాత మరియంముజ్జమానీగా మారింది.

జహంగీర్ కూడా రాజపుత్ర రాకుమారిని పెళ్ళాడాడు. జోధపూర్ పాలకుడు రాజా ఉదయ్ సింగ్ కుమార్తె. జోధాబాయి అనే పేరు ఈమెకే ఉండాలి, ఎందుకంటే ఈమె జోధపూర్ పాలకుడి కుమార్తె. చరిత్రలో అక్బర్ చక్రవర్తి ఉన్నాడు కాని, అక్బరు భార్య జోధాబాయి లేదు. ఒక కల్పిత పాత్ర విషయంలో అల్లర్లు సృష్టించింది కర్ణీసేన. పైగా ఆనాటి రాజపుత్ర రాజులు స్వయంగా తమ కుమార్తెలను ముస్లిం చక్రవర్తులకు ఇచ్చి పెళ్ళి చేయడానికి అభ్యంతరాలు లేవు, కాని నేటి రాజపుత్ర ప్రతినిధులుగా చెప్పుకునే కర్ణీసేన వంటి వారికి చాలా అభ్యంతరాలొచ్చేశాయి. రాజస్థాన్‌లో నిషేధం విధించారు. ఆ తర్వాత ఏం జరిగింది? కొంతకాలానికి ఈ సినిమా టివిల్లో, థియేటర్లలో అందరం చూస్తున్నాం. ఆనందిస్తున్నాం. సినిమా పై నిషేధం ఇప్పుడు ఒక జోక్‌లా మారింది.

ఇప్పుడు పద్మావత్‌పై కూడా ఇలాంటి వివాదమే చెలరేగింది. నిజానికి చరిత్రలో పద్మావతి లేదా రాణీ పద్మినీ అనే వ్యక్తి ఎవరూ లేరని చరిత్రకారుల అభిప్రాయం. ముహమ్మద్ జైసీ రాసిన కావ్యంలోని పాత్ర పేరు పద్మావత్. ఈ కల్పితపాత్రపై తీసిన సినిమాపై ఇప్పుడు కర్ణీసేన హూంకరిస్తోంది. ఈ సినిమాను రాజస్థాన్‌లో విడుదల చేస్తే థియేటర్లు తగలబెడతామని అంటోంది.

రాజస్థాన్‌లో బిజెపికి పునాదులు వేసినవాడు, బిజెపిని బలమైనపార్టీగా మార్చిన నాయకుడు భైరాన్ సింగ్ షెకావత్. ఇక్కడ ఆయన గురించి కాస్త చెప్పుకోవాలి. రాజస్థాన్‌లో సతీసహగమనం చేసిన రూప్ కన్వర్ గురించి అప్పట్లో చాలా వార్తలు వచ్చాయి. చాలామంది చదివే ఉంటారు. చాలా సంవత్సరాల క్రితం కొందరు రాజపుత్ర ప్రతినిధులుగా చెప్పుకునే ఇలాంటి గుంపులు భైరాన్ సింగ్ షెకావత్‌ను ఒక రైల్వే స్టేషనులో చుట్టుముట్టి, రూప్ కన్వర్‌ను దేవతగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ''సతీమాత'' గా ప్రకటించాలని తన చుట్టూ చేరి డిమాండ్ చేస్తున్న వారి చేతుల్లో తల్వార్లు, కత్తులు, కఠార్లు చూసి ఎవరైనా ఏం చేస్తారు? పైగా అప్పుడు రాష్ట్రంలో ప్రతిపక్షంలో ఉన్న పార్టీకి నాయకుడాయన. ఈ వివాదాన్ని ఆసరాగా చేసుకుని రాష్ట్రంలో పార్టీకి కొత్త బలం కూడా ఇవ్వవచ్చు. అల్లర్లకు పాల్పడుతున్న వారికి మద్దతు పలికి రాజకీయ ప్రయోజనాలు సాధించుకోవచ్చు. కాని భైరాన్ సింగ్ షెకావత్ అలా చేయలేదు.''నా చిన్నప్పుడే మా నాన్నగారు చనిపోయారు. మా అమ్మ సతీసహగమనం చేసి ఉంటే నేను ఇక్కడ ఉండేవాడినే కాదు. నేను సతీసహగమనాన్ని ఎన్నటికీ సమర్థించేది లేదు'' అని నిర్ద్వంద్వంగా చెప్పాడు. ఆయన్ను లొంగదీయలేని అల్లరి గుంపులు వెనక్కి తగ్గాయి.

ఇప్పుడలాంటి నాయకుడు బిజెపిలో ఎవ్వరూ కనబడడం లేదు. ఇప్పుడు పద్మావత్ సినిమాపై జరుగుతున్న ఈ తంతు యెడల ఆయన ఉన్నట్లయితే ఎలా వ్యవహరించేవాడు. పద్మావత్‌ను అడ్డుకుంటే తీవ్రమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించి ఉండేవాడు. రాజస్థాన్‌లో అలాంటి మరో నాయకుడు రాలేదు. ప్రస్తుతం బిజెపి నాయకులు, రాష్ట్ర ప్రభుత్వం కర్ణీసేనకు వంత పాడడంలో పోటీ పడుతున్నారు. పద్మావత్ సినిమాపై అనేక విమర్శలు, అల్లర్ల తర్వాత ఒక స్పెషల్ ప్యానెల్ ఈ సినిమా చూసి సర్టిఫికేటు ఇచ్చిం ది. సెన్సారు బోర్డు సర్టిఫికేటు తర్వాత ఇక ఎలాంటి సమస్యలు ఉండరాదు. కాని రాజస్థాన్ ప్రభుత్వం మాత్రం సినిమా విడుదలకు అంగీకరించడం లేదు. ముఖ్యమంత్రి వసుంధర రాజె సింధియా మాట్లాడుతూ పద్మిని మాకు చరిత్ర మాత్రమే కాదు అంతకన్నా ఎక్కువ అన్నారు. రాణి పద్మిని బలిదానం మా అందరికీ గర్వకారణం అని కూడా చెప్పారు. కాని సెన్సారు బోర్డు అంగీకరించి, ఆమోదించిన సినిమాను కొన్ని అల్లరి మూకలు నిషేధించమంటే నిషేధించడం రాష్ట్రప్రభుత్వానికి గర్వకారణమా? పరువు నష్టమా?

సెన్సారుబోర్డు అభిప్రాయం కన్నా అల్లరి మూకల అభిప్రాయమే గొప్పదని ప్రభుత్వం అనుకుంటుందా? అలా అనుకోవడం రాష్ట్రానికి గర్వకారణ మా? పరువు నష్టమా? లేకపోతే ఈ అల్లరి గుంపులు హింసాకాండకు పాల్పడతాయని భయపడుతుందా? హింసాకాండకు పాల్పడే అల్లరి గుంపులను అదుపు చేయలేని చేతకానితనాన్ని ఒప్పుకుంటుందా?రాష్ట్ర ముఖ్యమంత్రి వసుంధర రాజె సింధియా దృష్టిలో ఇప్పుడు రాజ్యాంగ బద్ధంగా ఏర్పడిన సెన్సారు బోర్డు కన్నా, చరిత్రకారుల అభిప్రాయా ల కన్నా అల్లరి గుంపులే ఎక్కువ అని తేలిపోయింది. ఇది పరువునష్టమే తప్ప గర్వకారణం కానేకాదు.

రాజస్థాన్‌లో ఈ ఏడాది ఎన్నికలు జరగబోతున్నాయి. రైతుల ఆందోళనలు, ప్రభుత్వాధికారుల అవినీతిపై నిరసనలు పెల్లుబుకుతున్నాయి. ఈ పరిస్థితుల్లో పద్మావత్ సమస్య రాజకీయంగా బాగా పనికి వచ్చేలా దొరికింది. రాజస్థాన్‌లో రాజపుత్రులు పదిశాతం ఉంటారు. వారంతా కర్ణీసేనకు మద్దతుదారులని చెప్పలేం. రాణాప్రతాప్, పృథ్వీరాజ్ చౌహాన్, అమర్ సింగ్ రాథోడ్ వంటి వీరులు జన్మించిన నేలలో గుప్పెడు మంది అల్లరి మూకలకు ప్రభుత్వం లొంగిపోతున్న పరిస్థితి నిజంగానే సిగ్గుచేటు. కాంగ్రెసు కూడా మౌనంగా తమాషా చూస్తుందే కాని గట్టిగా మాట్లాడడం లేదు. అందులో కూడా అశోక్ గెహ్లాట్ వంటి నాయకులు కనుమరుగైపోయారు. ప్రధానిగా పి.వి. నరసింహారావు ఉన్నప్పుడు, ఆయనకు సన్నిహితుడిగా పేరుపడిన చంద్రస్వామిని తీవ్రం గా విమర్శించడానికి కూడా గెహ్లాట్ వెనుకాడలేదు. ఆశారాం బాపు విషయంలో కఠినంగా చర్యలు తీసుకోడానికి సంకోచించలేదు. ఆ గెహ్లాట్ కూడా ఇప్పుడు మౌనంగా చూస్తున్నాడు.

భావ ప్రకటనా స్వేచ్ఛ అన్నది ఇప్పుడు అల్లరి గుంపుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడింది. ప్రతిసారి ఎవరో ఒకరు మనోభావాలు గాయపడ్డాయని హంగామా చేయడం, ఏదో ఒక సినిమా విడుదలపై గలాభా చేయడం మామూలైంది. కొంతకాలం క్రితం ఇలాగే తన సినిమా విడుదల ప్రమాదంలో పడినపుడు చివరకు ప్రభుత్వంపై ఆధారపడడం కన్నా మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన అల్లరిమూకలతో ఒప్పందం చేసుకోవడమే మంచిదని కరణ్ జోహార్ నిర్ణయించుకున్నాడు. ఈ ఒప్పందానికి స్వయంగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవిస్ మధ్యవర్తిత్వం వహించడం మన ప్రజాస్వామ్యం ఎలా ఉందో చెప్పకనే చెబుతున్న చేదువాస్తవం. 'యే దిల్ హై ముష్కిల్'లో పాకిస్థానీ నటుడు ఫవ్వాద్ ఖాన్ ను కరణ్ జోహార్ తీసుకున్నాడు.

ప్రభుత్వం ఇచ్చిన అనుమతి పత్రాలతోనే ఫవ్వాద్ ఖాన్ కాని మరో నటుడు కాని భారతదేశంలో వచ్చి పని చేశాడన్నది గుర్తించాలి. ఇందులో తప్పంటూ ఏదన్నా ఉంటే కరణ్ జోహార్ ది కాదు, ప్రభుత్వానిది. కాని అల్లరి గుంపులు కరణ్ జోహార్ సినిమా విడుదల చేయరాదని గలాభా చేశాయి. ఇలాంటి అల్లర్లే షారుక్ ఖాన్ సినిమా రయీస్ విషయంలోను జరిగాయి. ఆయన సినిమాలో పాకిస్థానీ నటి మహీరా ఖాన్‌ను తీసుకోవడం అభ్యంతరాలకు కారణం. చాలామంది మనోభావాలు గాయపడ్డాయి. సల్మాన్ ఖాన్ నటించిన టైగర్ జిందా హై సినిమా వల్ల మరాఠీ సినిమాలకు థియేటర్లు దొరకడం లేదని మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన మండిపడింది. సినిమాలపై అల్లరి శక్తులు దాడులు చేయడం అనేది ఒక మామూలు విషయంగా మారిపోయింది.

పద్మావత్ సినిమా షూటింగ్ సందర్భంగా సెట్ పై దాడి చేసి, దర్శకుడు భంసాలీపై భౌతికదాడికి తెగబడిన వారిలో ఒక్కరిని కూడా రాష్ట్రప్రభుత్వం ఇంతవరకు అరెస్టు చేయలేదు. భంసాలీ తలనరకాలని, హీరోయిన్ దీపికా పదుకునే ముక్కు చెవులు కోయాలని బెదిరింపులు చేసిన వారెవ్వరిపై చర్యలు లేవు. హింసాకాండకు పాల్పడిన వారిని కాని, రెచ్చగొట్టిన వారిని కాని రాజస్థాన్ ప్రభుత్వం ఏమీ చేయలేదు. పైగా వారిని బుజ్జగిస్తూ పద్మావత్ సినిమాపై నిషేధం విధించింది. ఇది ఎలాంటి ప్రజాస్వామ్యం?

జంతువులకు సేవ – ప్రత్యక్ష దైవాలకు ఈసడింపు!



చందుపట్ల రమణ కుమార్ రెడ్డి
9440449392

వినడానికి కఠినంగా ఉన్నా, అతిగా అనిపించినా మనలో చాలామంది కుక్కపిల్లలను పెంచడంలో చూపించే శ్రద్ధ, వాటిమీద కురిపించే ప్రేమ వయసుడిగిన తల్లిదండ్రుల మీద, అమ్మమ్మ, నాన్నమ్మ, తాతయ్యల మీద చూపించలేక పోతున్నారన్నది వాస్తవం! చాదస్తం, సర్దుకు పోవడం లేదు, కొత్త వాతావరణానికి అలవాటు పడటం లేదు, వెనుకటి అలవాట్లు మానుకోవడం లేదు, కొత్త కుటుంబ సభ్యులను గుర్తించడం లేదు, మంకుపట్టు పడతారు. ఇలాంటి కారణాలేవైనా మనలో చాలామంది తల్లిదండ్రులను ముఖ్యంగా వయోవృద్ధులను దూరంగా ఉంచడానికే మొగ్గుచూపుతున్నారన్నది వాస్తవం. కుక్కపిల్ల చేష్టలను ఓర్పుతో భరించే మనం వయసు తెచ్చిన చిత్త వైకల్యమో, లేక పిల్లలు పెద్దవారయ్యారు, నిర్ణయాలు తీసుకోగల సమర్థులు అన్న విషయాన్ని గ్రహించలేని బలహీనత వల్లనో ముసలి తల్లిదండ్రులు, అమ్మమ్మ/నాన్నమ్మ, తాతయ్యలు బెట్టు చేస్తే భరించలేక పోతున్నాం. మూగ జీవాలమీద చూపుతున్నది మానవత్వమైతే, మనసు పెట్టి మాటలాడే తల్లిదండ్రుల పట్ల, ముసలి అవ్వల పట్ల మన దాష్టీకాన్ని ఏమని పిలవాలి? మన చిన్నతనంలో అన్నివేళలా మనం అమ్మానాన్నల మనసెరిగి అనుకూలంగా మసలుకున్నామా? మారాం చేయలేదా? ధిక్కరించలేదా?ప్రశ్నించలేదా? పారిపోతానని బెదిరించలేదా? హక్కుల కోసం పోరాటం చేయలేదా?నాడు మనలను ఆవహించిన పసితనమే నేడు వయసుడిగిన మన అమ్మానాన్నలను, తాతయ్యలను అమ్మమ్మ, నాన్నమ్మలను ఆవహించింది, ఇది ప్రకృతి సహజం. నాడు పసితనంలో మన ప్రశ్నలను ఓపికగా విని, తిరుగుబాటును ప్రేమతో సహించి, బెదిరింపులకు భయపడి, హక్కులను గుర్తిస్తూ మనమీద మన అమ్మా నాన్నలు చూపిన ఔదార్యం, కురిపించిన ప్రేమామృతం, మన కోరికలు నెరవేర్చడానికి చేసిన త్యాగాలు, వొదులుకున్న సొంత సుఖాల్లో కొంతయినా నేడు మనం వారిపట్ల చూపలేమా? పసితనంలో తెలిసీ తెలియక తప్పటడుగులు వేసినప్పుడు మనకు ఆసరాగా నిలిచిన, గోరుముద్దలు తినిపించిన చేతులవి, మనకు నడకలు నేర్పిన పాదాలవి, కళ్ళలో వత్తులు వేసుకొని మన కండ్లలో నిద్ర కొరకు ఎదురుచూసిన నేత్రాలవి, నేడు వయసుడిగి, కందరాలలో పట్టు సడలి ఆసరాకు ఎదురు చూస్తున్నాయి, ఊతంగా నిలబడలేమా? సుదీర్ఘ తీరాలకు అడుగులు వేస్తున్న వారి ఈ చివరి మజిలీలో పసితనపు చిరునవ్వులను వారికి పరిచయం చేయలేమా?

పాలు, బిస్కట్లు, కోడిగుడ్లు, బొక్కలు, సబ్బులు, వాక్సిన్‌లు అంటూ నెలకు 2 వేలు కుక్కకు ఖర్చు చేస్తాం కాని చిన్నతనంలో తమ అవసరాలను, కోరికలను చంపుకొని మన కోరికలకోసం ఖర్చుచేసిన తల్లిదండ్రుల కొరకు 500ఖర్చు చేయడానికి వెనుకా ముందు చేస్తాం, అసలు వారికి అవసరాలు ఉంటాయనే గుర్తించడం లేదు! కుక్కల మేటింగుల మీద చూపే శ్రద్ధలో పదోవంతు కూడా తల్లిదండ్రుల హెల్త్ చెకప్ మీద చూపడం లేదు! మన కడుపున పుట్టిన పిల్లల కోరిక మేరకు పెంచుకుంటున్నామని సరిపెట్టుకుందామా, మరి మనలను కనిపెంచిన వారిపట్ల మనకు బాధ్యత లేదా! రెండురోజులు ఊరు కెళితేనే పెంచుకున్న కుక్కను డాగ్ కేర్ సెంటర్‌లోనో లేదంటే నమ్మకమైన పక్కింటి వారికో, బంధువులకో అప్పగించి పూటపూటకి దాని ఆలనా, పాలనా తెలిసికొనే ప్రేమ మూర్తులైన మనం వయసు ఉడిగిన తల్లిదండ్రులను, బామ్మలను, జేజమ్మలను, తాతయ్యలను వాళ్ళ మానాన ఒదిలేసి రోజుల తరబడి తిరుగుతున్నాం, వేరు కాపురాలు పెదుతున్నాం. వారి ఆలనాపాలనా గుర్తురాదెందుకో! పొద్దున్నే ఇంత వండేసి దాన్నే సాయంత్రం కూడా తినేయమని చెప్పి మరునాడు ఉదయమే వస్తామంటూ ముసలివాళ్లను ఇండ్లలో ఒంటరిగా వదిలేసి వెళ్ళే వాళ్లెందరో ఉన్నారు మనలో, ఆ ఒంటరి పక్షులకు ఏదైనా జరగరానిది జరిగితే, ఆత్మీయ పలుకులేని ఆ ముసలి గుండె ఆగిపోతే ఎలా అనే ఆలోచనే మనకు రాదెందుకు! వయసుడిగిన మన తల్లిదండ్రులకు, నాన్నమ్మ, తాతయ్యలకు చోటులేని మన ఎసి కారులో ఆశ్చర్యంగా పెంపుడు కుక్కలకు మాత్రం ప్రత్యేక ప్రవేశం ఉంటుంది! మనసు విప్పలేని మూగ జీవానికి, నోరున్నా బలవంతంగా మనసు కట్టేసుకుంటున్న ముసలివాళ్ళకు తేడా లేదంటారా?

చిన్న విశ్వాసానికే పొంగిపోయి కుక్కపిల్లకు ఎంతో చాకిరీ చేస్తున్నాం, చిన్నతనంలో అమ్మ వెళ్ళమంటే ఇంటి పక్కనే ఉన్న కిరాణా దుకాణంలోకి వెళ్ళటానికి కూడా బద్ధకించి, మసకబారిన నాన్న చూపు మీద శ్రద్ధ చూపకుండా పెంచుకున్న కుక్కకు చికెన్ బొక్కలకోసం మార్కెట్ మొత్తం వెతుకుతాం. కుక్క బిస్కెట్ల కొరకు ఎంతైనా ఖర్చు చేస్తాం. కుక్కను కొనడానికి, వాక్సిన్‌ల కొరకు, సబ్బులని, షాంపులని ఎంతైనా ఖర్చు చేసే మనం ఇంట్లో ఉన్న ముసలివాండ్ల కనీస ఖర్చుల విషయంలో మాత్రం లెక్కలు వేసుకుంటాం, అన్నాదమ్ములు, అక్కాచెల్లెళ్ల మధ్య వాటాలు వేసుకుంటాం! వంతులు పెట్టుకుంటాం? నాడు నేను అమ్మ కొడుకును, నేను నాన్న బిడ్డను అని పోటీపడి మన అవ్యాజమైన ప్రేమతో నాడు వాళ్ళను ఉక్కిరి బిక్కిరి చేసిన మనం, నేడు మలి వయసులో అమ్మ బాధ్యత నీదే, నాన్నను నేను భరించలేను నీతో ఉంచుకో అంటూ విదిలించుకుంటున్నాం, అదనపు బరువంటూ నిట్టూరుస్తున్నాం! మనమే లోకమనుకుని మనకోసం ఎన్నో వదులుకున్న వారి విలువ కుక్క విశ్వాసం పాటిది కాదా? ఇంతకూ మన విశ్వాసం ఏపాటిది?

తిరిగిరాని లోకాలకు తరలివెళ్ళిన తరువాత ఘనంగా జరిపే ఖర్మకాండల మీద చూపే శ్రద్ధలో పావలావంతు కండ్లముందు కదలాడుతున్న రోజుల్లో మనింట్లోని ముసలివాండ్ల మీద చూపగలిగితే, ఆప్యాయతతో కూడిన స్పర్శను, మాటను వారి కందించగలిగితే వారు జీవన్ముక్తులు కారా? ఎవరూ చూడని వైతరణిని దాటించాలనుకోవడం కన్నా బ్రతికుండగా ఆదరించడం గొప్ప కర్మ కాదంటారా? అంతిమ ఘడియల్లో ఆప్యాయతకు, ఆసరాకు అంగలార్చిన తల్లిదండ్రులు, తాతయ్యలు, అమ్మమ్మ, నాన్నమ్మలు తనువు చాలించిన తరువాత పిండాల రూపంలో మనం పెట్టే మృష్టాన్న భోజనం కోసం ఆత్మలుగా ఎగిరివస్తారంటారా? మూగజీవాల మీద కురిపిస్తున్న వల్లమాలిన ప్రేమలో కొంతైనా మలిసంధ్యలోని కన్నవారిమీద చూపించగలిగితే అంతకు మించిన మహాయజ్ఞం, కర్మయోగం మరోటి ఉండదు కదా. బ్రతుకంతా ధారబోసి కట్టుకున్న తన స్వంత ఇంట్లో ఎక్కడో ఓ మూలన ఇంకా చెప్పాలంటే ఇంటిని ఆనుకొని ఉన్న ఏ షెడ్డులోనో, పాత పాకలోనో చావుకోసం ఎదురు చూస్తూ చుట్టూ తనవాళ్లున్నా తానుమాత్రం ఒంటరిగా బతుకులీడుస్తున్న నాన్నమ్మలు, అమ్మమ్మలు, తాతయ్యలు ఎందరో. ఎసి రూముల్లో మనముంటే ఏసిసి షెడ్లలో మనింటి పెద్దలు! ఎండలో మాడిపోతుందని, వానలో తడిసి పోతుందని కుక్కపిల్లలకు మన పక్కలో కాదంటే పడకకింద చోటిచ్చే గొప్ప మనసున్న మనకు తనువిచ్చిన తల్లికి, దారి చూపిన తండ్రికి కాసింత చోటిచ్చే మనసే ఉండటం లేదు ఎందుకు? పిల్లలకు ప్రత్యేక పడక గదులు నిర్మించుకుని మురిసిపోతున్న తల్లిదండ్రులు విరివిగా అగుపిస్తున్నారు కాని తల్లిదండ్రులకు, నాన్నమ్మ, తాతయ్యలకు ప్రత్యేక పడక గదులు నిర్మించుకుంటున్న పిల్లలు, మనుమలు, మనుమరాండ్లు తోకచుక్క వోలె ఎక్కడో అక్కడ మాత్రమే అగుపిస్తున్నారు. మార్పుకు మనమే శ్రీకారం చుట్టలేమా? పెద్దలు అని కసురుకోకుండా వారిని మన పిల్లల్లాగే చూడలేమా? మారాం చేస్తే మనసు మీదకు తీసుకోకుండా మన పిల్లలతో పాటు క్షమించలేమా.

మన తెలంగాణ
5
హైదరాబాద్
శుక్రవారం
12 జనవరి, 2018
www.manatelangana.news



తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఇంటర్వ్యూలో అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్రస్థాయి పరిణామాలపై ఎక్కువగా ప్రశ్నలు వస్తుంటాయి.ముఖ్యంగా అభ్యర్థి ప్రొఫైల్ ఆధారంగా బోర్డు సభ్యులు ప్రశ్నలు అడుగుతున్నారు. ఉదాహరణకు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తోన్న వారిని విద్యారంగానికి సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. ఇప్పటివరకు సాగిన ఇంటర్వ్యూల ప్రశ్నల విధానం పరిశీలిస్తే ... అభ్యర్థి నేపథ్యం, చేస్తున్న ఉద్యోగం, తెలంగాణ ప్రభుత్వ పథకాలు, కరెంట్ అఫైర్స్‌తో పాటు అంతర్జాతీయ అంశాలను సైతం అడిగినట్లు అర్థమవుతోంది. ఒక్కోఅభ్యర్థికి కనిష్ఠంగా 15 నిమిషాలు, గరిష్ఠంగా 30 నిమిషాల వరకు ఇంటర్వ్యూ జరుగుతోంది. గ్రూప్స్ అభ్యర్థుల కోసం టీఎస్‌పీఎస్సీ ఇంటర్వ్యూ ప్రశ్నల విధానం.....

టీఎస్‌పీఎస్సీ ప్రశ్నలు వీటిపైనే..



టీచర్‌గా పనిచేస్తున్న అభ్యర్థిని ఎలాంటి ప్రశ్నలు వేస్తారంటే...మీరు ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల నమోదును పెంచడానికి ఎలాంటి చర్యలు చేపడతారు? ప్రభుత్వ పాఠశాలలో చేరేలా విద్యార్థుల తల్లిదండ్రులను ఆకర్షించేందుకు ఎలాంటి ప్రణాళిక అమలు చేస్తారు? ప్రభుత్వ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్నవారిని వారి పిల్లలను ఏ స్కూల్లో చేర్పించారనే విషయాన్ని కూడా అడిగారు.

* ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మరో అభ్యర్థిని విద్యారంగంపై ఎక్కువగా ప్రశ్నించారు. కొఠారి కమిషన్, విద్యాహక్కు చట్టం, విద్యా రంగంలో ఎలాంటి మార్పులు రావాల్సిన అవసరం ఉంది. సమూల మార్పులకు సూచనలు? తెలంగాణ ప్రభుత్వం చెబుతోన్న కేజీ టు పీజీ ఉచిత విద్య గురించి ప్రశ్నించారు. కేజీ టు పీజీ అమలు ఎలా ? కేజీ టు పీజీ ఉచిత విద్య అంటే ఏమిటి అనే ప్రశ్నలు అడిగారు.

* లేబర్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నవారిని కార్మిక చట్టాలపై.. పోలీసు శాఖలో పనిచేస్తున్నవారికి శాంతిభద్రతల పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకుంటారు..? లాఠీచార్జ్ ఎప్పుడు చేస్తారు? 144 సెక్షన్ ఎప్పుడు విధిస్తారు? అని అడిగారు.

* ఇంటర్వ్యూలో ఎక్కువగా దృష్టిసారుస్తున్న మరో అంశం... భూ సేకరణ చట్టం. ఈ చట్టం విధివిధానాలు, దానికి సంబంధించిన సవరణల గురించి ప్రశ్నించారు. తెలంగాణ ప్రభుత్వం.. భూసేకరణ ప్రాధాన్యత , రాష్ట్రంలో భూసేకరణకు సంబంధించి ప్రభుత్వం ఎదుర్కొంటున్న సమస్యలు, భూసేకరణను వ్యతిరేకిస్తూ వార్తల్లో నిలిచిన కొన్ని సంఘటనలు, వాటిపై అభ్యర్థి అభిప్రాయాన్ని తెలుసుకునేందుకు బోర్లు సభ్యులు ప్రయత్నించారు. ఒక వేళ మీరు ఆర్డీఓగా విధుల్లో ఉంటే భూ సేకరణను వ్యతిరేకిస్తోన్న ప్రజలను ఎలా మెప్పిస్తారు? అని అడిగారు.

* మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి ప్రభుత్వ పథకాల ప్రాముఖ్యం, వాటి ఉద్దేశం, ఆయా పథకాలకు ఎంత నిధులు అవసరం? వాటిని ప్రభుత్వం ఎలా సమకూర్చుకుంటోంది ? ఏయే సంస్థల నుంచి కావాల్సిన నిధులు తెచ్చుకుంటోంది..? ఆయా పథకాల అంచనా బడ్జెటు ఎంతెంత? మీకు బాగా నచ్చిన, నచ్చని రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ఏమిటి? అందుకు కారణాలు ఏమిటి? అని తెలుసుకునే ప్రయత్నం చేశారు.

* తెలంగాణ రాష్ట్రానికి సంబంధించి కృష్ణ–గోదావరి నదీ జల వివాదాలపై అభ్యర్థి విషయ పరిజ్ఞానాన్ని పరీక్షించే విధంగా ప్రశ్నలు అడిగారు. మరీ ముఖ్యంగా కృష్ణ నదిపైనే ఎక్కువ వివాదాలు రావడానికి కారణాలు ఏంటి అని అడిగారు?

* మత్తు మందులపై ప్రశ్నలు ఎదురయ్యాయి. డ్రగ్స్ వినియోగం మన దగ్గర ఇప్పుడే కొత్తగా ఉందా ? ఒక వేళ ముందు నుంచే ఉంటే ఇన్ని రోజులు లేనిది ఇప్పుడే ఎందుకు ప్రధానాంశంగా మారింది? ప్రపంచంలో ఏయే దేశాల్లో డ్రగ్స్ వినియోగం ఎక్కువగా ఉంది? డ్రగ్స్ వినియోగం వల్ల జరిగే పరిణామాలు? ఫార్మసీ నేపథ్యం ఉన్న అభ్యర్థులను డ్రగ్స్‌కు సంబంధించిన పదజాలం, వాటి అబ్రివేషన్స్ పైన ప్రశ్నలు అడిగారు.

* జిల్లాల సమాచారంపై సభ్యులు ప్రశ్నలు సంబంధించారు. జిల్లాలో పర్యాటక ప్రాంతాలు, ప్రముఖ వ్యక్తులు, రాజకీయ నాయకులు, జిల్లా విశిష్టతపై అభ్యర్థుల పరిజ్ఞానాన్ని పరిశీలించారు.

* భారత్–చైనా సరిహద్దు ప్రాంతంలో నెల కొన్న ఉద్రిక్త పరిస్థితులపైన ప్రశ్నించారు. చికెన్ నెక్, ట్రై జంక్షన్, డోక్లా పీఠభూమి వివాదాలపై ప్రశ్నలు అడిగినట్లు అభ్యర్థులు తెలిపారు.

* జమ్ముకశ్మీర్‌లో ఈ మధ్య హింస బాగా పెరిగిపోయింది. అక్కడ ప్రశాంత పరిస్థితులు నెలకొనాలంటే .. ఎలాంటి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది? వంటి ప్రశ్నలు అడిగారు.

* దేశంలో ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమం ఎక్కడ జరుగుతుంది? ఆ ఉద్యమం రావాడానికి గల కారణాలు? అక్కడి భౌగోళిక , రాజకీయ పరిస్థితులు ఏమిటి? ఆ ప్రత్యేక ఉద్యమంపై మీ అభిప్రాయం ఏమిటి? అని ప్రశ్నించారు.

* ఇంటర్వ్యూ మొత్తం అభ్యర్థుల ప్రొఫైల్ ఆధారంగా, సమకాలీన అంశాల మేళవింపుగా , ప్రభుత్వ పథకాలపై అవగాహనను పరిశీలించే విధంగా ఉంటునట్లు అభ్యర్థులు అభిప్రాయపడుతున్నారు. అభ్యర్థులు చెప్పే సమాధానాల ఆధారంగా ఎక్కువగా ఉప ప్రశ్నలు ఉంటున్నాయి. ఇంటర్వ్యూకు ఎంపికైనవారిలో చాలామంది ఇప్పటికే ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నట్లుగా తెలుస్తోంది. వీరు విధుల్లో భాగంగా చేసే పనులకు సంబంధించిన ప్రశ్నలు అడుగుతున్నారు.

విధుల్లో ఉత్సాహం కావాలంటే..



ఆరోగ్యవంతుడి మదిలోనే సృజనాత్మక ఆలోచనలు, అద్భుతమైన ఆవిష్కరణలు రూపుదాలుస్తాయి. కార్యాలయంలో విధులు నిర్వర్తించే ఉద్యోగులు తరచుగా అలసటకు లోనవుతుంటారు. నిస్సత్తువ, నిరుత్సాహం ఆవర్తిస్తుంటాయి. దీంతో పనితీరు, ఉత్పాదకత తీవ్రంగా దెబ్బతింటాయి. క్రమ పద్ధతి లేని ఆహారపు అలవాట్లు, మానసిక ఒత్తిడి, పనిలో విసుగుదల, తగినంత నిద్ర లేకపోవడం.. ఇలాంటి ప్రతికూల కారణాలతోనే ఉద్యోగులు కార్యాలయంలో అలసటకు లోనవుతుంటారని నిపుణులు చెబుతున్నారు. జీవన శైలి(లైఫ్ స్టైల్) లో కొన్ని మార్పులు చేసుకోవడం వల్ల ఉత్సాహం పుంజుకోవచ్చని సూచిస్తున్నారు.

* **నడకే నయం:** ఆఫీస్‌లో సహచరులతో సంభాషించాలంటే చాట్ మెసెంజర్, ఈ–మెయిల్, సెల్ ఫోన్ వంటివి ఉపయోగించకుండా.. వారి దగ్గరకు నడిచి వెళ్లండి,. లిఫ్ట్ వాడకుండా మీరుండే అంతస్తు దాకా మెట్లదారినే ఎంచుకోండి. మీ వాహనాన్ని ఆఫీస్‌కు కొంత దూరంలోనే నిలిపేసి కాళ్లకు పని చెప్పండి. వినడానికి ఇవన్నీ చాలా చిన్న విషయాలుగానే కనిపిస్తాయి. కానీ ,ఇవి చూపే ప్రభావం మాత్రం అసమాన్యం. నడక వల్ల శరీరంలో క్యాలరీలు కరిగిపోతాయి. మీరు వేసే ప్రతి అడుగు మీ ఆరోగ్యాన్ని పెంచుతుంది. బద్ధకాన్ని దూరంగా తరిమికొడుతుంది.

* **కంటినిండా నిద్ర:** తగినంత నిద్ర లేకపోతే మరుసటి రోజు త్వరగా అలసి పోతారు. క్రమంగా బరువు కూడా పెరుగుతారు. నిద్ర సరిపోకపోతే శరీరంలో కీలక హార్మోన్ల పనితీరు మందగిస్తుంది. శరీరనికి ఆహారం అవసరం లేకపోయినా ఆకలిగా అనిపిస్తుంది. దీంతో ఎక్కువ తింటారు. కాబట్టి రోజూ కనీసం ఆరు నుంచి ఏడు గంటల పాటు కంటినిండా నిద్ర పోవాలి.

* ఫాస్ట్‌ను బ్రేక్ చేయాల్సిందే: కొందరు ఉదయం అల్పాహారం తీసుకోకుండా నేరుగా మధ్యాహ్నం భోజనం చేస్తుంటారు. ఈ అలవాటు వల్ల బరువు పెరుగుతారు. రాత్రి పడకపై చేరినప్పటి నుంచి ఉదయం లేచేదాకా ఎలాంటి ఆహారం తీసుకోం కాబట్టి శరీరం శక్తిని కోల్పోతుంది. అందుకే ఉదయం నిద్ర లేచిన గంటలోపే అల్పాహారం తప్పనిసరిగా తినాలి. శరీరంలో అన్ని వ్యవస్థలు సక్రమంగా పనిచేయాలంటే ఉదయం బ్రేక్‌ఫాస్ట్ అవసరం.



* **భోజనం.. ఎన్నిసార్లు:** మనం సాధారణంగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం చేస్తాం. ఒక రోజులో మొత్తం మూడు సార్లు తింటాం. దీన్ని ఆరు నుంచి ఎనిమిది భాగాలుగా విడగొట్టండి. తక్కువ మొత్తంలో ఎక్కువ సార్లు ఆహారం తీసుకుంటే జీర్ణాశయంపై ఒత్తిడి తగ్గి, దాని పనితీరు పెరుగుతుంది. తీసుకున్న ఆహారం సక్రమంగా జీర్ణమై, శక్తి సమకూరుతుంది. కాబట్టి ప్రతి రెండు గంటలకోసారి కొద్ది మొత్తంలో తినండి. అలాగే తీసుకొనే ఆహారం తాజాగా, అందులో అన్ని రకాల పోషకాలు ఉండేలా చూసుకోవాలి. ఇలా కొన్ని రోజులపాటు చేస్తే వచ్చే ఫలితాలను చూసి మీరు ఆశ్చర్యపోవడం ఖాయం.

* **వ్యాయామం మర్చిపోవద్దు :** ప్రతిరోజూ వ్యాయామం చేయడానికి తీరిక దొరక్కపోతే కనీసం వారాంతాల్లోనైనా అందుకు సమయం కేటాయించండి. ఫిట్‌నెస్ కాపాడుకోవడంపై దృష్టి పెట్టండి. టెన్నిస్, ఫుట్ బాల్ వంటి ఆటలు ఆడండి, జాగింగ్, రన్నింగ్ చేయండి. ఆసక్తి ఉంటే డ్యాన్స్ కూడా చేయొచ్చు. యోగాతో తీరైన శరీరాకృతి, ఆరోగ్యం సొంతమవుతాయి. మనసుంటే మార్గాలుంటాయి. చిత్తశుద్ధితో ప్రయత్నిస్తే జీవన శైలిలో మార్పులు చేసుకోవడం కష్టమేమీ కాదు. ఆరోగ్యానికి మించిన విలువైన ఆస్తి మరొకటి లేదు.

మంచి మాట

పర్యావరణానికున్న అతి ప్రమాదకరమైన ముప్ప ఏంటంటే “ఎవరో వచ్చి దాన్ని కాపాడతారు” అని అందరం అనుకోవడమే.



ఎథికల్ హ్యాకింగ్

ఆన్‌లైన్ మోసాలు రోజురోజుకూ పెరిగిపోతున్న నేటి తరుణంలో ప్రపంచ దేశాలను వణికిస్తున్న మహమ్మారి హ్యాకింగ్. ఫోన్‌కాల్స్, ఈ మెయిల్, ఎస్ ఎం ఎస్ వంటి నిత్యం వినియోగించే సాంకేతికతలోను అనేక మోసాలు చోటు చేసుకుంటున్నాయి. మనకు తెలియకుండానే మన కంప్యూటర్‌లోని సమాచారాన్ని అక్రమంగా తస్కరిస్తున్నారు. ఇలా చేయడాన్నే హ్యాకింగ్ అంటారు. ఇక ఎథికల్ హ్యాకింగ్ అంటే... యజమాని అనుమతితో కంప్యూటర్‌లోకి ప్రవేశంచి డేటాను నాశనం చేయడం. కంప్యూటర్ డేటా ఎంత సురక్షితంగా ఉంది? దానిలో ఎలాంటి లోపాలున్నాయి? వాటిని ఎలా సరి చేయాలి? అనే విషయాలను గుర్తుచేయడానికి ఎథికల్ హ్యాకర్లను నియమిస్తారు. అయితే వీళ్లు కంప్యూటర్‌లో ఉన్న కీలక సమాచారాన్ని గోప్యంగా ఉంచాలి.

లేటెస్ట్ టెక్నాలజీ... లైఫ్‌స్టైల్ కాదు వార్ స్టైల్‌నూ మార్చేసింది. యుద్ధం చేయాలంటే బాంబులేసి రక్తపాతం సృష్టించాలన్నది ఒకప్పటి మాట. కాని ఇప్పడు ఒక్క క్లిక్‌తో అగ్రరాజ్యాలను సైతం కూల్చేయొచ్చు. ఇందుకు అవసరమైన టూల్ హ్యాకింగ్...! ఈ పేరు వినిపిస్తే చాలు సాంకేతికంగా అభివృద్ధి చెందిన దేశాలు సైతం గజగజ వణికిపోతున్నాయి. ఈనేపథ్యంలో ఎప్పటికప్పడు ఆన్‌లైన్ ప్రమాదాలను పసిగడుతూ వాటిని సమర్థవంతంగా ఎదుర్కోవడం కోసం పుట్టు కొచ్చిన సాంకేతిక పరిజ్ఞానమే ఎథికల్ హ్యాకింగ్.....

అర్హతలు

ఇంటర్ అర్హతతో ఎథికల్ హ్యాకింగ్ సర్టిఫికెట్, డిప్లొమా ఇన్ నెట్‌వర్క్ సెక్యూరిటీ కోర్సుల్లో చేరవచ్చు.

నైపుణ్యాలు

* basic computer knowledge
* programming languages (java, c,c++, perl, python, ruby)
* web application (net, php, vital)
* opersting systems (windos, linux)
* network devices (switches routers, firewalls)
* basic knowledge in IP protocols (SMTP,ICMP, HTTP)
* Good communication skills

జాబ్‌రోల్స్

* ప్రైవేటు సెక్టార్
* ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ అనలిస్ట్
* ఎథికల్ హ్యాకర్
* సెక్యూరిటీ అనలిస్ట్
* సెక్యూరిటీ కన్సల్టెంట్
* ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ మేనేజర్.

గవర్నమెంట్ సెక్టార్

* నెట్‌వర్క్ సెక్యూరిటీ అడ్మినిస్ట్రేటర్
* చీఫ్ ఇన్ఫర్మేషన్ సెక్యూరిటీ ఆఫీసర్
* అప్లికేషన్ సెక్యూరిటీ టెస్టర్
* చీఫ్ అప్లికేషన్ సెక్యూరిటీ ఆఫీసర్

ఉద్యోగ వేదికలు

* ప్రభుత్వ రంగం
* ప్రైవేట్ రంగం
* డిఫెన్స్ ఆర్గనైజేషన్స్
* లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆర్గనైజేషన్స్
* బీపిఓలు
* ఫోరెన్సిక్ ఆర్గనైజేషన్స్
* బ్యాంకులు
* డిటెక్టివ్ కంపెనీస్
* ఫైనాన్స్ సంస్థలు
* ఇన్వెస్టిగేషన్ ఎజన్సీస్

వేతనాలు

సరైన అర్హతలు, నైపుణ్యాలున్న ఎథికల్ హ్యాకర్స్‌కు ప్రారంభం వేతనం ఏడాదికి రూ. 3 లక్షలు ఇవ్వడానికి సంస్థలు సిద్ధంగా వున్నాయి. అనుభవం పని తీరును ఆధారంగా ఏడాదికి రూ.30 లక్షలు ఆర్జిస్తున్న వారు కూడా ఉన్నారు.

కొన్ని విద్యా సంస్థలు

* ఇండియన్ స్కూల్ ఆఫ్ ఎథికల్ హ్యాకింగ్
* www. isoeh. com
  అరిజోనా ఇన్ఫోటెక్
* www. airzonainfotech.com
  ఇన్‌ఫైర్ సైబర్ సెక్యూరిటీ
* http:// www. cybersecurityindia.in
  ప్రిస్టిన్ ఇన్ఫో సొల్యూషన్స్
* http:// www.pristineinfo.com
* www. infysec. com ఇన్ఫీ సెక్.

మన తెలంగాణ
6
హైదరాబాద్
శుక్రవారం
12, జనవరి 2018
www.manatelangana.news

నగర పంచాయతీగా బాన్సువాడ

మన తెలంగాణ / హైదరాబాద్ : కామారెడ్డి జిల్లాలోని బాన్స్‌వాడ గ్రామ పంచాయతీని నగర పంచాయతీగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ట్రాన్సిషనల్ ఏరియా అండ్ స్మాల్ అర్బన్ ఏరియాస్ (ఫిక్సేషన్ ఆఫ్ క్రైటీరియా) నిబంధనల ప్రకారం ఇప్పటివరకూ గ్రామ పంచాయతీగా కొనసాగిన బాన్స్‌వాడను నగర పంచాయతీగా మార్చడానికి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని మున్సిపల్ వ్యవహారాల శాఖ ముఖ్య కార్యదరిAృ అరవింద్‌కుమార్ గురువారం జారీ చేసిన ఉత్తర్వుల్లో (నెం. 7)లో పేర్కొన్నారు. నగర పంచాయతీగా మారుస్తూ బాన్స్‌వాడ గ్రామ పంచాయతీ గతేడాది ఆగస్టు 18వ తేదీన తీర్మానం చేసిందని, దీనికి అనుగుణంగా కామరెడ్డి జిల్లా కలెక్టర్, మున్సిపల్ శాఖ డైరెక్టర్ (హైదరాబాద్)లు నగర పంచాయతీగా మార్చాలని ప్రభుత్వానికి సిఫారసు చేశారని అరవింద్‌కుమార్ ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ సిఫారసులతో పాటు గ్రామ పంచాయతీ తీర్మానాన్ని ప్రభుత్వం పరిశీలించిందని, నిబంధనల ప్రకారం బాన్స్‌వాడ గ్రామ పంచాయతీ నగర పంచాయతీగా మారడానికి అన్ని అర్హతలూ ఉన్నట్లు ప్రభుత్వం అభిప్రాయపడిందని అరవింద్‌కుమార్ పేర్కొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో బిసిలకు నిధులు

కేంద్రమంత్రి రాందాస్ అథవాలేకు బిసి సంఘం వినతి



మన తెలంగాణ/ హైదరాబాద్ : వచ్చే నెలలో పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో బిసి సంక్షేమానికి నిధులు పెంచేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర సామాజిక న్యాయ సాధికారత సహాయ మంత్రి రాందాస్ అథవాలేకు బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. బిసి డిమాండ్లతో కూడిన ఒక వినతిపత్రాన్ని ఈ మేరకు హైదరాబాద్‌లో మంత్రికి అందజేశారు. ఎన్‌డిఎ ప్రభుత్వం ఇప్పటి వరకు ప్రవేశపెట్టిన అన్ని బడ్జెట్‌లలోనూ బిసిలకు అన్యాయం జరిగిందన్నారు. కనీసం ఈసారైనా బిసిల సంక్షేమానికి రూ. 50 వేల కోట్లు కేటాయించాలని జాజుల విజ్ఞప్తి చేశారు. అలాగే జాతీయ బిసి కమిషన్‌కు రాజ్యాంగబద్ధత కల్పించాలని, కేంద్రంలో ప్రత్యేక మంత్రిత్వశాఖను ఏర్పాటు చేయాలని ఆ వినతిపత్రంలో పేర్కొన్నారు.అథవాలే స్పందిస్తూ బిసిలకు నిధులు పెంచే అంశాన్ని పరిశీలిస్తామని సంఘం ప్రతినిధులకు హామీ ఇచ్చారు.

ఘనంగా రెడ్డి హాస్టల్ శత వార్షికోత్సవం

మన తెలంగాణ / హైదరాబాద్ : రాజాబహుదూర్ వెంకటరామ రెడ్డి హాస్టల్ (రెడ్డి హాస్టల్) శత వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు రాజ బహుదూర్ వెంకటరామ రెడ్డి ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి కుందవరం వెంకట్‌రెడ్డి తెలిపారు. గతంలో హాస్టల్‌లో ఉన్న వారు ప్రాంతాలకు అతీతంగా ఈ శత వార్షికోత్సవాలలో పాల్గొనాలని ఆయన కోరారు. ఉత్సవాల సందర్భంగా విడుదల చేసే ప్రత్యేక సావనీర్‌లో ప్రచురించే విధంగా వాAరు హాస్టల్‌లో తమ అనుభవాలు, జ్ఞాపకాలను ఆర్టికల్స్ రూపంలో సొసైటీ కార్యాలయానికి పంపాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

సుప్రీం జడ్జిగా

(మొదటిపేజీ తరువాయి)

అంగీకారం కోరుతూ సుప్రీంకోర్టుకు కొలీజియం కేంద్ర ప్రభుత్వానికి వీరిద్దరి పేర్లను ప్రతిపాదించింది. ఇందుకు కేంద్రం ఆమోదం తెలిపితే ఓ మహిళా న్యాయవాది నేరుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయిన తొలి వ్యక్తిగా చరిత్ర సృష్టిస్తారు. అలాగే సుప్రీంకోర్టుకు ఎంపికైన ఏడో మహిళా న్యాయమూర్తిగా నిలుస్తారు. ప్రస్తుతం సుప్రీంకోర్టు న్యాయమూర్తుల్లో మహిళా న్యాయమూర్తిగా జస్టిస్ ఆర్.భానుమతి ఉన్నారు. 1989లో తొలిసారిగా సుప్రీంకోర్టుకు తొలి మహిళా న్యాయమూర్తిగా జస్టిస్ ఎం.ఫాతిమా బీవీ నియమితులయ్యారు. ఆమె తర్వాత జస్టిస్ సుజాత వి. మనోహర్, జస్టిస్ రుమా పాల్, జస్టిస్ జ్ఞాన సుధా మిశ్రా, జస్టిస్ రంజన ప్రకాశ్ దేశాయ్ న్యాయమూర్తులుగా ఉన్నారు.

సంగీతకు ఊరట

(మొదటిపేజీ తరువాయి)

జారీ చేసింది. కోర్టు ఉత్తర్వుల ప్రకారం శ్రీనివాస్ రెడ్డి తన భార్యను మరియు కూతురు అభిదను పోషించుకోవాలి. ఆమె ప్రస్తుతం ఎక్కడైతే ఉందో అదే ఇంట్లో నివాసం ఉండానివ్వాలని ఆమెకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలి. అలాగే సంగీతకి ఆమె కూతురి పోషణ కోసం ప్రతి నెల 20 వేల రుపాయాలు అందించాలని, ఆమెకు ఏలాంటి హానీ జరుగకుండా చూడాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది.

అత్తింట్లోకి సంగీత : మీయపూర్ కోర్టు సంగీతను ఇంట్లోకి వెళ్లొచ్చనే ఉత్తర్వులు జారీ చేయడంతో సంగీత అత్తింట్లోకి వెళ్లింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేను ఏ రోజు కుడా చట్టవ్యతిరేఖ పనులు చేయలేదు ఓ మహిళగా, భార్యగా, తల్లిగా నా అత్తామామలను, నా భర్త నుండి నాకు గౌరవ ప్రధమైన న్యాయం కావాలని కోరుకున్నాను. ఈ రోజు న్యాయస్థానం ఇచ్చిన ఉత్తర్వులు నాలో ఓ కొత్త జోష్‌ను నింపాయి. నా పోరాటం ఫలించింది. ఈ పోరాటంలో అండగా ఉన్న ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు.

ఉత్తమ్, జానా వస్తేనే చర్చ

(మొదటిపేజీ తరువాయి)

కాంగ్రెస్‌లో ఉంటాడో, ఉండడో తెలియని ఎంఎల్‌ఎ సంపత్‌కుమార్, నిన్నటి వరకు టిఆర్‌ఎస్‌లో ఉన్న దాసోజు శ్రవణ్‌లతో చర్చకు వస్తానని రేవంత్‌రెడ్డి అంటే కుదరదన్నారు. ఆయన ఇటీవలనే కాంగ్రెస్‌లో చేరారని, ఉత్తమ్, జానారెడ్డి, షబ్బీర్ అలీ, జీవన్‌రెడ్డి వంటి వారు గతంలో పదేళ్ళ పాటు అధికారంలో ఉన్నారని, మంత్రి పదవులు నిర్వర్తించారని,కాంగ్రెస్ హయాంలో జరిగిన దానిపై వారితో చర్చిస్తే అర్థం ఉంటుందన్నారు. మరో కాంగ్రెస్ నేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారని, అసలు చర్చకు ఎవరు వస్తారో ముందుకు కాంగ్రెస్ నాయకులే తేల్చుకోవాలన్నారు.

కోమటిరెడ్డి ఆరోపణలు పచ్చి అబద్ధాలు : పల్లా

సోలార్ పవర్‌లో అవినీతి జరిగిందని సిఎల్‌పి ఉప నేత కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆరోపణలు అబద్ధమని డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఖండించారు. సౌర విద్యుత్ కింద 2వేల మెగావాట్లకు 1700 మెగావాట్లు ఉత్పత్తి అవుతున్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటక ప్రభుత్వం కంటే తెలంగాణ ప్రభుత్వం తక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు చేస్తోందన్నారు. 2008లో వచ్చిన జిఒ ఆధారంగానే ఐదేళ్ళ విద్యుత్ వాడకం ఆధారంగానే 2014లో తెలంగాణకు 58 శాతం విద్యుత్‌ను కేటాయించారే తప్ప కాంగ్రెస్ నాయకుల కారణంగా కాదన్నారు. దేశంలో ఉత్పత్తి అవుతున్న 2.40 లక్షల మెగావాట్ల విద్యుత్‌లో 2.15 లక్షల మెగావాట్లు సబ్ క్రిటికల్ విద్యుత్ ప్లాంట్ల ద్వారానే ఉత్పత్తి అవుతుందని భాను ప్రసాద్ తెలిపారు.

ట్రంప్ హరితహారం

(మొదటిపేజీ తరువాయి)

ఏడాదికి లక్షా 20 వేల నుంచి లక్షా 75 వేలకు (45 శాతం పెంపు) పెరుగుతుంది. ఇండియన్– అమెరికన్ సాంకేతిక వృత్తి నిపుణులు ప్రధానంగా హెచ్–1బి వీసాలపై అమెరికాకు వచ్చి గ్రీన్ కార్డులు కోరుకుంటారు. దానితో వారికి చట్టబద్ధమైన శాశ్వత నివాసం అమెరికాలో చేకూరుతుంది. తాజా వలసల బిల్లుతో భారతీయ టెకీలకు విశేష ప్రయోజనం చేకూరుతుందని ఆశిస్తున్నారు. గ్రీన్ కార్డుల కోసం క్యూలో 5 లక్షల మంది భారతీయులు వేచి ఉన్నారని అధికార్లు అంచనా వేశారు. వారు తమ హెచ్–1బి వీసాల వార్షిక పొడిగింపు కోరుతున్నారు. గ్రీన్ కార్డుల కోసం వారిలో చాలా మంది కొన్ని దశాబ్దాలుగా ఎదురు చూస్తున్నారు. ఏడాదికి కేటాయించే గ్రీన్ కార్డుల సంఖ్య పెంచడంవల్ల ఎదరు చూపుల కాలం తగ్గుతుందని చెప్పవచ్చు. హెచ్–1బి కార్యక్రమం కింద అమెరికాలో తాత్కాలిక వీసా సౌలభ్యం సమకూరుతుంది. హెచ్–1బి వల్ల కంపెనీలు అత్యంత నైపుణ్యం గల విదేశీ కార్మికులను నియమించగలుగుతున్నాయి. ముఖ్యంగా అర్హతగల అమెరికన్ కార్మికులు కొరవడిన రంగాల్లో ఈ వీసాలు కంపెనీలకి అక్కరకు వస్తున్నాయి. తాజా బిల్లుతో గొలుసుకట్టు వలసల సంఖ్య బాగా దెబ్బతింటుందని భావిస్తున్నారు. తమ ఇతర కుటుంబ సభ్యులను అమెరికాకు రప్పించుకోవాలని (స్పాన్సర్ షిప్ ద్వారా) ఆశిస్తున్న ఇండియన్ అమెరికన్‌లు ఈ నియమంతో కంగుతింటారు. బంధువలుకు, భార్య లేదా భర్త మినహా ఇతర కుటుంబ సభ్యులకు గ్రీన్ కార్డులు పొందడాన్ని తాజా బిల్లు నిరోధిస్తోంది. ప్రతిభ ఆధారిత వలస విధానం వల్ల అత్యంత ప్రతిభావంతులయిన నిపుణులే అమెరికాలోకి అడుగుపెట్టడం జరుగుతుందని, ఇబ్బడిముబ్బడిగా వచ్చే వలసలను అరికట్టవచ్చని ట్రంప్ యంత్రాంగం భావిస్తోంది.

దళితుల వర్గీకరణ కష్టసాధ్యం

కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే



మన తెలంగాణ/హైదరాబాద్: షెడ్యూల్డు కులాల వర్గీకరణ కష్టసాధ్యమని, అవసరమైతే మరిన్ని ప్రయోజనాలను కల్పించాల్సి ఉంటుందని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి రాందాస్ అథవాలే వ్యాఖ్యానించారు. దళితుల్లోని 1264 ఉప కులాలకు రిజర్వేషన్లు అమలు చేయలేమని, అయితే వారి అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌సి,ఎస్‌టి, ఒబిసి రిజర్వేషన్లతో సంబంధం లేకుండా ఆర్థికంగా వెనుకబడిన (అగ్ర కులాలు సహా) వర్గాలకు కూడా 25 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, అవసరమైతే వారికి క్రీమీలేయర్‌ను అమలు చేయాలని, ఇప్పటికే ఈ అంశాన్ని ప్రధాని మోడి దృష్టికి తీసుకెళ్లినట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులకు రిజర్వేషన్ కూడా ఒక కారణమన్నారు. ఎస్సీ ఎస్‌టి అత్యాచారాల నిరోధక చట్టం రద్దు కాదని అన్నారు. ఈ చట్టం దుర్వినియోగం జరుగుతున్నట్లు భావిస్తే, చట్ట సవరణకు అవకాశముందని అభిప్రాయపడ్డారు. హిందువులకు వ్యతిరేకంగా ముస్లిం, దళితుల కలయికతో లాభం కంటే నష్టమే ఎక్కువగా ఉంటుందని, అన్యాయం జరిగే ప్రతి ఒక్కరూ ఏ మతంలో ఉన్నప్పటికీ ఐక్యం కావాల్సిన అసవరం ఉందన్నారు. కుల రాజకీయాలతో మార్పు రాదని, ఏ ఒక్కరికీ లాభం జరగబోదని పేర్కొన్నారు. రెచ్చగొట్టే వ్యాఖ్యాలు చేయడం ద్వారా బాధిత కుటుంబాలకు ఇబ్బందికర పరిస్థితులు ఉంటాయన్నారు. పదోన్నతుల లోనూ రిజర్వేషన్లు కల్పించే అంశంపై ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టేనున్నట్లు పేర్కొన్నారు.

నక్సలైట్ల డిమాండ్లు సరైనవే

నక్సలైట్ల డిమాండ్లు సరైనవేనని, కాని వారు ఎంచుకున్న మార్గం సరైంది కాదని మంత్రి రాందాస్ ఆథ్వాలే అన్నారు. నక్సలిజాన్ని వదిలి అంబేద్కరిజాన్ని స్వీకరించాలని సూచించారు. గో రక్షణ పేరుతో దాడులకు దిగడం మంచిది కాదని, ఇలాంటి ఘటనలను ప్రధాని మోడి కూడా ఇష్టపడరని, దాడులకు పాల్పడే వారిని కఠిన శిక్ష విధించాలన్నారు. ఎస్.సి,ఎస్‌టి తరహాలో ఒబిసి కమిషన్‌కు రాజ్యాంగబద్ధమైన అధికారాన్ని కల్పించే బిల్లును బడ్జెట్ సమావేశాల్లో రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నట్టు వివరించారు. వికలాంగుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలను నిర్వహిస్తోందన్నారు. ఇప్పటి వరకు ఏడు లక్షల మంది వికలాంగులకు ఉపకరణాలను పంపిణీ చేసినట్లు వివరించారు. బాబా సాహెబ్ అంబేద్కర్ రూపొందించిన రాజ్యాంగాన్ని మార్చాల్సిన అవసరం లేదని, ఇప్పటికే 120 సవరణలు జరిగాయని గుర్తు చేశారు.

బ్యాక్‌లాగ్ పోస్టులపై కేంద్ర మంత్రి విస్మయం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ బ్యాక్‌లాగ్ పోస్టుల విషయంలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ మంత్రి రాందాస్ ఆథ్వాలే విస్మయం వ్యక్తం చేశారు. దళిత, గిరిజన బ్యాక్‌లాగ్ పోస్టులపై హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో గురువారం వివిధ శాఖాధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల శాఖాధికారులు తమ శాఖలోని బ్యాక్‌లాగ్ పోస్టులు, దళిత, గిరిజన రిజర్వేషన్ల అమలుతీరును రాందాస్‌కు వివరించారు. ఈ సందర్భంగా కొన్ని శాఖలు బ్యాక్‌లాగ్ పోస్టుల వివరాలను తెలియజేయలేదు. మరి కొన్ని శాఖలు ఎస్‌సి,ఎస్‌టి రిజర్వేషన్లపై స్పష్టమైన లెక్కలు చూపలేదు. పెట్రోల్ బంకులలో ఎంత మంది దళిత, గిరిజనులకు కేటాయించారని రాందాస్ భారత్ పెట్రోలియం శాఖాధికారులను ప్రశ్నించగా, వాటి సమాచారం తమ వద్ద లేదని చెప్పడంతో ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఖాళీ పోస్టులను ఎందుకు భర్తీ చేయడం లేదని పలువురు అధికారులు ప్రశ్నించగా తాము ప్రతిపాదలను పంపించామని సమాధానమిచ్చారు.

విద్యుత్‌పై శ్వేతపత్రం విడుదల : సిపిఐ డిమాండ్

మన తెలంగాణ / హైదరాబాద్ : రాష్ట్రంలో విద్యుత్ అంశంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో వాస్తవాలతో ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ ప్రభుత్వ హయాంలోనే విద్యుత్ ఉత్పత్తిని పెంచామని అధికార, ప్రతిపక్ష పార్టీల నేతలు చేస్తున్న ప్రకటనలను తప్పుబట్టారు. వాస్తవంగా గత ప్రభుత్వ కాలంలో ప్రారంభించబడిన విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో ఇటీవల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని, టిఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా కొత్త విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలకు శంకుస్థాపన చేసిందని, ఫలితంగా విద్యుత్ కొరత లేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇవన్నీ కూడా ప్రభుత్వ నిరంతర ప్రక్రియలో భాగంగానే జరిగాయని గమనించాలన్నారు. టిఆర్‌ఎస్ ప్రభుత్వం తొందరపడి చత్తీస్‌గడ్ రాష్ట్రం నుండి ఎక్కువ ధరకు విద్యుత్‌ను కొనుగోలు చేస్తుందని, దీంతో వేల కోట్ల భారం పడనుందని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

దేశవ్యాప్త ఆందోళనలు

విస్తృతస్థాయిలో లౌకిక, ప్రజాతంత్ర, వామపక్ష పార్టీలతో వేదిక ఏర్పాటు చేసి, బిజెపి, ఎన్‌డిఎ అనుసరిస్తున్న విధానాలను, సంఘ్‌పరివార్ శక్తుల ఆగడాలను నిరసిస్తూ దేశ వ్యాపితంగా ఆందోళనలు చేపట్టాలని విజయవాడలో జరిగిన సిపిఐ జాతీయ సమితి సమావేశంలో తీర్మానించినట్లు చాడ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి తెలిపారు. ఈ నెల 26న 68వ గణతంత్ర దినోత్సవాన్ని దేశ వ్యాపితంగా రాజ్యాంగ పరిరక్షణ దినంగా పాటించాలని నిర్ణయించినట్లు తెలిపారు.



కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

సింగిల్ బ్రాండ్ రిటైల్ ట్రేడింగ్, నిర్మాణ రంగాలలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల (ఎఫ్‌డిఐ)ను 100 శాతానికి అనుమతించిన కేంద్ర మంత్రివర్గం నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సిపిఐ శ్రేణులు గురువారం హైదరాబాద్‌లోని ఎఐటియుసి కార్యాలయం నుంచి హిమాయత్‌నగర్ కూడలి వరకు ప్రదర్శన నిర్వహించి అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, నాయకులు వి.ఎస్.బోస్, ఇ.టి.నరసింహ, బి.వెంకటేశం, ఎం.నరసింహ, ఆర్.శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చిన్న పరిశ్రమలకు అభయం

(మొదటిపేజీ తరువాయి)

పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావు తెలిపారు. ఈ దిశగా సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళ్లనుందన్నారు. సూక్ష్మ, చిన్న పరిశ్రమలకు బ్యాంకుల నుండి అందించాల్సిన సహాయం పై హైదరాబాద్ కోఠిలోని ఎస్‌బిఐ ప్రధాన కార్యాలయంలో వివిధ బ్యాంకర్లు సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ప్రతినిధులు, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కెటిఆర్ పాల్గొని పలు సూచనలు చేశారు.



జిల్లా పారిశ్రామిక కేంద్రాలు (డిఈసి)లతో సమన్వయం చేసుకుని సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల పునరుద్ధరణకు ముందుకు రావాలని సూచించారు. ఎంఎస్‌ఎంఈ పరిశ్రమల పునరుద్ధరణకు రికవరీ, రీ స్ట్రక్చరింగ్, రెక్టిఫికేషన్ అనే త్రీ ''ఆర్ '' సూత్రాన్ని పాటించాలన్నారు. ఖాయిలా పడిన పరిశ్రమల పునరుద్ధరణలో యూనిట్ల సమస్యను గుర్తించి వాటికి పరిష్కారం చూపించి రుణాలను పునరుద్దరించి తోడ్పాటు నందించాలని కోరారు. ఆ తర్వాతే ఈ రుణాల రికవరీ చేసుకోవాలని బ్యాంకర్లను ఆదేశించారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం వినూత్నమైన కార్యక్రమాలతో ముందుకు పోతోందని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా ఇండస్ట్రియల్ హెల్త్ క్లినిక్స్‌ను ఏర్పాటు చేయడం ద్వారా చిన్న తరహా పరిశ్రమల సమస్యలను అర్థం చేసుకొని వాటికి సంబంధించిన అన్ని రకాల సహాయాన్ని అందించేందుకు ముందుకు పోతామన్నారు. ఈ హెల్త్ క్లినిక్‌కు ఆర్‌బిఐ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్సింగ్ కంపెనీగా గుర్తింపు ఇచ్చిందన్నారు. ఇలా సూక్ష్మ , చిన్న తరహా పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఒక సంస్థను ఏర్పాటు చేసిన తొలి రాష్ట్రమన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇండిస్ట్రీ హెల్త్ క్లినిక్ సంస్థలో బ్యాంకర్లు పెట్టుబడులు పెట్టి భాగస్వాములు కావాలని కెటిఆర్ పిలుపు నిచ్చారు.

సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల అభివృద్ధిలో బ్యాంకుల సహకారాన్ని తాము గుర్తిస్తున్నామన్నారు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలకు సకాలంలో రుణాలు ఇచ్చేలా, ఒక వేళ వాయిదాలు చెల్లించకుంటే మొండి బకాయిల ఖాతాలోకి పంపకుండా వాటిని తిరిగి ఆదుకునే విషయంలో నిర్వహించే సాంకేతిక ఆర్థిక సాధ్యాసాధ్యాల అధ్యయనంలో కొంత సానుకూలంగా ఉండాలన్నారు. సాధ్యమైనంత తక్కువ సమయంలో దీన్ని పూర్తి చేయాలన్నారు. అవసరం అయితే ఈ అధ్యయనాన్ని తమ హెల్త్ క్లినిక్ చేసి పెడుతుందన్నారు. సూక్ష్మ పరిశ్రమలకు 'ముద్రా' బ్యాంకు లోన్ల పంపిణీ, ఖాయిలా పడిన యూనిట్లకు అందించాల్సిన సహకారం పై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. తక్కువ మొత్తాల్లో రుణాలను పునరుద్దరించడం ద్వారా అనేక చిన్న తరహా పరిశ్రమలు తిరిగి తమ కార్యకలాపాలు ప్రారంభిస్తాయని, ఇలాంటి వాటికి ఖచ్చితంగా సహకారం అందించాలని మంత్రి బ్యాంకర్లను కోరారు. ఫుడ్ ప్రాసెసింగ్, లెదర్, వివిధ వృత్తుల ఆధారిత పారిశ్రామిక క్లస్టర్లలో ఉన్న యూనిట్లకు లోన్లు ఇచ్చేందుకు బ్యాంకులు ముందుకు రావాలన్నారు. మహిళా పెట్టుబడిదారులకు మరింత ప్రాధాన్యత ఇవ్వాలని, ముద్రా రుణాల్లో ప్రధాన మంత్రి ఉపాధి పథకం వంటి కార్యక్రమాల్లో రుణాల పంపిణీ లక్ష్యాలను చేరుకునేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని మంత్రి బ్యాంకర్లకు సూచించారు. ఈ రెండు అంశాల్లో వంద శాతం లక్ష్యాన్ని పూర్తి చేయాలని కోరారు. అలాగే రాష్ట్రంలోని చేనేత కార్మికులకు ముద్రా రుణాల్లో అవకాశం కల్పించి రుణాలను ఇవ్వాలని సూచించారు. ఈ సమావేశంలో పలు బ్యాంకుల ఉన్నతాధికారులు, తెలంగాణ పరిశ్రమల శాఖ ఉన్నతాధికారులు, పరిశ్రమ సంఘాలు, చిన్న తరహా పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యాట్ ఎగవేతపై నోటీసులు

(మొదటిపేజీ తరువాయి)

జారీ చేయడంతో సగం మంది ఒక్క రోజు వ్యవధిలోనే చెల్లించారని, ప్రతిసారీ నోటీసులు జారీ చేయడం అలవాటుగా మారకూడదన్న ఉద్దేశంతోనే ఇప్పుడు వారం రోజుల వ్యవధిలోపు చెల్లించాలని స్పష్టంగా పేర్కొన్నట్లు ఆ అధికారులు తెలిపారు. గతేడాది జూలై నుంచి జిఎస్టి అమల్లోకి రావడంతో రిటర్న్‌లను దాఖలు చేసినా ఆ మొత్తాన్ని ఆన్‌లైన్ ద్వారా చెల్లించలేదని, ఫలితంగా ప్రభుత్వానికి రూ. 185 కోట్ల మేర వసూలు కావాల్సి ఉన్నదని తెలిపారు. సకాలంలో చెల్లింపులు జరగకపోవడానికి తాము నిర్దిష్టంగా ఏడు కారణాలను గుర్తించామని, ఇందులో ఉద్దేశపూర్వకంగా ఉదాసీనంగా వ్యవహరించడమే ప్రధానమైనదని తెలిపారు. జిఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత రిటర్న్‌లలో పేర్కొన్న విధంగా పన్నును ఆన్‌లైన్‌లోనే చెల్లించాల్సి ఉంటుందని, అయితే సెర్వర్ ఢిల్లీలో ఉన్నందువల్ల చెల్లింపులకు సంబంధించిన వివరాలు సకాలంలో తమకు అందడంలేదని పేర్కొన్నారు. కానీ కేంద్ర జిఎస్టి అధికారుల నుంచి కొన్ని వివరాలను సేకరించిన తర్వాత ఐదు నెలల వ్యవధిలో సుమారు రూ. 185 కోట్ల మేర రిటర్న్‌లలో పేర్కొన్న పన్ను బకాయి ఉన్నట్లు తేలిందని, సగటున ప్రతి నెలా రూ. 30 కోట్ల వరకు ప్రభుత్వానికి నష్టం జరుగుతూ ఉందని తెలిపారు. వ్యాట్ అమల్లో ఉన్నప్పుడు సుమారు 1.85 లక్షల మంది పన్ను చెల్లింపుదారులు ఉంటే జిఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత అది మూడు లక్షలు దాటిందని వివరించారు. 'వ్యాట్' బకాయిలను వసూలు చేయడానికి గతంలోనైతే మాన్యువల్‌గా నోటీసులు జారీ చేయాల్సి వచ్చేదని, కానీ హైదరాబాద్ ఐఐటి సహకారంతో తయారుచేసిన సాఫ్ట్‌వేర్ ద్వారా ఒక్క సెకనులోనే అందరికీ నోటీసులు జారీ చేయడం సాధ్యమవుతోందని, ఒకేసారి మెయిల్ ద్వారా, మొబైల్ ఎస్‌ఎంఎస్ ద్వారా పంపడం సాధ్యమైందని తెలిపారు. తొలుత వారం రోజుల గడువు ఇస్తామని, ఆ తర్వాత చట్టంలోని వివిధ సెక్షన్ల ప్రకారం పెనాల్టీ విధిస్తామని, ఆ తర్వాత లైసెన్సుపై చర్య తీసుకునేలా నోటీసు జారీ చేస్తామని, అప్పటికీ మొండిగా వ్యవహరించినవారి బ్యాంకు ఖాతాలపై ఆయా బ్యాంకు యాజమాన్యాలతో మాట్లాడి ఖాతాలను స్థంభింపజేయడం లేదా ఇతర చర్యలకు చొరవ తీసుకుంటామని తెలిపారు. ఇప్పుడు పన్ను ఎగవేసినవారంతా కట్టడానికి ఆర్థిక స్థోమతలేనివారేమీ కాదని, అలసత్వం కారణంగానే కుంటిసాకులు చెప్తూ దాటవేస్తున్నారని ఒక ప్రశ్నకు సమాధానంగా ఒక అధికారి వ్యాఖ్యానించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఆ డబ్బు వసూలవుతుందని, తప్పించుకోడానికి ఎలాంటి ఆస్కారమూ లేదని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ఇలాంటి సాఫ్ట్‌వేర్‌ను ఏ రాష్ట్ర ప్రభుత్వమూ వాడడంలేదని, దేశంలోనే ఇది తొలిసారి అని దాని ప్రత్యేకతలను వివరించారు. జిఎస్టి వసూళ్ళ గురించి ఆ అధికారి మాట్లాడుతూ, వ్యాట్ అమల్లో ఉన్నప్పుడు అంచనాలకు అనుగుణంగా వసూలైనట్లే ఇప్పుడు కూడా సంతృప్తికరంగానే జరుగుతోందని తెలిపారు. ఇటీవల ఎక్కువ పన్ను శ్లాబ్‌లో ఉన్న కొన్ని వస్తువులను తక్కువ శ్లాబ్‌లోకి మార్చినందువల్ల దేశవ్యాప్తంగా పన్ను ఆదాయం తగ్గుతున్నట్లుగానే మన రాష్ట్రానికి కూడా ఒక మేరకు తగ్గే అవకాశం ఉందని, అయితే ఇది పెద్దగా ఆందోళనకర స్థాయిలో లేదని తెలిపారు.

సోయిలేని సన్నాసులు

(మొదటిపేజీ తరువాయి)

తెలంగాణలో జరుగుతున్న జలం అభివృద్ధి చరిత్రలో నిలుస్తుందని తెలిపారు. ఐదు నుండి పది ఏళ్లుగా పూర్తికాని పనులు కేవలం 20 నెలల్లో పూర్తి చేసుకునేలా కాళేశ్వరం పనులు మూడు షిఫ్టుల్లో వేగంగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. రెండు రోజుల క్రితం ప్రాజెక్టులను సందర్శించిన సిడబ్ల్యుసి బృందం ప్రాజెక్టు పనుల తీరుపై సిఎం కెసిఆర్‌కు హ్యాట్సాఫ్ చెప్పారని గుర్తుచేశారు. భూపాలపల్లి నియోజకవర్గంలోని చివరి ఆయకట్టు వరకు సాగునీరు అందిస్తామని, వచ్చే ఏడాది నాటికి కాళేశ్వరం నీళ్లు భూపాలపల్లికి వస్తాయని, ఈ ప్రాంతానికి ప్రాతినిథ్యం వహిస్తున్న శాసన సభ స్పీకర్ పట్టుబట్టి నీళ్ల తెచ్చుకుంటున్నారని, ఇకనుండి భూపాలపల్లికి అన్నీ మంచి రోజులేనని ఆయన వెల్లడించారు. కడియం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించి, కోట్ల రూపాయల నిధులను తీసుకువచ్చి భూపాలపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో స్పీకర్ అభివృద్ధి చేస్తున్నారని ప్రశంసించారు. తన నియోజకవర్గ ప్రజలకు పాలకుడిగా కాకుండా సేవకుడిగా పనిచేస్తున్నానని స్పీకర్ మధుసూదనచారి అన్నారు.

రైతు సమితుల సహకారం

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులకు శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సిఎం చెప్పినట్లు తెలిసింది. రైతు సమన్వయ సమితుల ఏర్పాటుకు సంబంధించిన ఉత్తర్వుల్లో కూడా ప్రభుత్వం రైతులను సంఘటితం చేసి వారి సమస్యలను తెలుసుకోవడం, ఏ పంటలు ఎప్పుడు పండించాలో తెలియజేయడం, మద్దతు ధర ఇప్పించడం, యాంత్రీకరణ, సూక్ష్మ సేద్యం ప్రోత్సహించడం వంటి వాటితో పాటు పెట్టుబడి పథకానికి ప్రభుత్వానికి సహకరించడం వారి బాధ్యత అని స్పష్టంగా పేర్కొంది. గ్రామాల్లో 15 మందితో, మండలాల్లో 24 మందితో రాష్ట్రం మొత్తం 559 మండలాలకు, అందులోని 10,733 గ్రామాలకు సంబంధించిన సమితుల ఏర్పాటు పూర్తైంది. వీటన్నింటిలో మొత్తం 1,60,995 మంది సభ్యులు ఉన్నారు. రైతుల సమన్వయ సమితుల ఏర్పాటులో జాప్యం జరుగుతుండడంపై నల్లగొండ ఎంపి గుత్తా సుఖేందర్ రెడ్డి అసంతృప్తిగా ఉన్నట్లు తెలిసింది.

పంచాయతీకి పవర్స్

(మొదటిపేజీ తరువాయి)

ఆడిటింగ్ ప్రక్రియ కొంత ఆలస్యంగా జరుగుతున్నట్లు గుర్తించిన అధికారులు దానిని సరిచేసేలా చట్టంలో మార్పులు చేయాలని భావిస్తున్నారు. ఇప్పటి వరకు ఆర్థిక సంవత్సరం పూర్తయిన 9 నెలలలోపు ఆడిటింగ్ ప్రక్రియ ముగుస్తుంది. పంచాయతీల్లో జరుగుతున్న ఆడిటింగ్ ప్రక్రియకు సంబంధించి డైరెక్టర్ వెంకటేశ్వరరావు సబ్ కమిటికి వివరించారు. దీనిలో చేపట్టాల్సిన మార్పులపై చర్చించిన సబ్ కమిటి ఆడిటింగ్ ప్రక్రియ కాల పరిమితిని తగ్గించే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో చర్చించింది. పంచాయతీల్లో జరుగుతున్న నిధుల వ్యయం, పన్నుల వసూళ్లు లాంటివన్నీ ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలనే నిబంధనలను చట్టంలో పొందుపర్చే అంశంపైనా సబ్ కమిటి చర్చించింది. ఇందులో ప్రతి గ్రామ పంచాయతీలోను ఒక కంప్యూటర్ ఆపరేటర్‌ను నియమించుకోవాలనే అభిప్రాయాన్ని సబ్ కమిటి వ్యక్తం చేసింది. సరిగా పనిచేయని కార్యదర్శులను సరెండర్ చేసే అధికారాన్ని పాలక వర్గానికి కట్టబెట్టే దిశగానూ సమావేశంలో చర్చ జరిగింది. ఈ సమావేశంలో మంత్రి పోచారం శ్రీనివాస్ రెడ్డితో పాటు సిఎం కార్యాలయ ముఖ్య కార్యదర్శి నర్సింగ్‌రావు, అదనపు కార్యదర్శి స్మితా సబర్వాల్ , అడిషనల్ అడ్వకేట్ జనరల్ రాంచందర్ రావు, పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్, కమిషనర్ నీతూ ప్రసాద్, న్యాయ శాఖ కార్యదర్శి నిరంజన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తేయండి

ముగ్గురు సంతానం ఉంటే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హులుగా పేర్కొంటూ 1995లో విధించిన చట్ట నిబంధనను ఎత్తి వేయాలని తెలంగాణ గిరిజన అభివృద్ధి సంస్థ ఛైర్మన్ గాంధీ నాయక్ ఈ సందర్భంగా మంత్రి జూపల్లికి వినతిపత్రం అందజేశారు. అసెంబ్లీ, పార్లమెంటుకు పోటీ చేసే ఎంఎల్‌ఎలు, ఎంపిలకు లేని నిబంధన స్థానిక సంస్థల ఎన్నికలకు మాత్రం ఎందుకుండాలన్నారు.

Dwaraka

మన తెలంగాణ
7
హైదరాబాద్
శుక్రవారం
12, జనవరి 2018
www.manatelangana.news



కెసిఆర్ రైతు పక్షపాతి, కాంగ్రెస్‌కు విమర్శించే అర్హత లేదు : మంత్రి జగదీశ్‌రెడ్డి

మన తెలంగాణ/హైదరాబాద్: రాష్ట్రంలో పార్టీలు లేవని, కెసిఆర్ మాత్రమే ఉన్నారని ఇంధన శాఖ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి అన్నారు. అజహరుద్దీన్, విజయశాంతిలు కాంగ్రెస్ స్టార్ క్యాంపేనర్లు అని అనడంతోనే ఉత్తమ్‌లాంటి వారు స్టార్ క్యాంపేనర్లు కాదని ఒప్పుకున్నట్లేనని విమర్శించారు. గురువారం నాడు టిఆర్‌ఎస్ ఎల్‌పి కార్యాలయంలో శాసనమండలిలో ప్రభుత్వ విప్ బోడకుంటి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, శ్రీనివాసరెడ్డి, రాములు నాయక్‌లతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్‌కు వ్యవసాయ నాయకత్వం అవార్డు ఇస్తే కాంగ్రెస్ నేతలకు కడుపు మంట ఎందుకని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఏ సమస్య కనిపించక కాంగ్రెస్ నేతలే సమస్యలు సృష్టించుకొని అనవసర రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. 70 ఏళ్లుగా సేద్యాన్ని పట్టించుకోకుండా పంటలు ఎండబెట్టి వ్యవసాయాన్ని వల్లకాడుగా మారిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడెందుకు మొసలి కన్నీరు కారుస్తున్నారని మండిపడ్డారు. వారాల తరబడి కరెంటు ఇవ్వకుండా పచ్చని పొలాలు ఎండబెట్టిన పాపపు పాలన కాంగ్రెస్‌దని, అధికారంలోకి వచ్చిన కొద్ది రోజులకే రోజుకు 9 గంటలు, ఇప్పుడు 24 గంటల సేద్యానికి కరెంటు సరఫరా చేస్తున్న ఘనత టిఆర్‌ఎస్‌దేనని మంత్రి పేర్కొన్నారు.

వరంగల్ 4వ డివిజన్ ఉప ఎన్నిక విజేత టిఆర్‌ఎస్

బిజెపిపై 835 ఓట్ల ఆధిక్యతతో విజయం



మన తెలంగాణ / వరంగల్ : వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలోని 44వ డివిజన్‌కు జరిగిన ఉప ఎన్నికలో టిఆర్‌ఎస్ అభ్యర్థి అనిశెట్టి సరిత తన సమీప బిజెపి అభ్యర్థి కొలను సంతోష్‌రెడ్డిపై 835 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 9వ తేదీన నిర్వహించిన ఈ ఎన్నిక కౌంటింగ్ గురువారం మహానగర పాలక ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో జరిగింది. పటిష్టమైన పోలీస్ బందోబస్తు మధ్య ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మొదలైన గంటలోపే ఫలితం వెలువడింది. టిఆర్‌ఎస్ అభ్యర్థి అనిశెట్టి సరితకు 3016 ఓట్లు రాగా బిజెపి అభ్యర్థి కొలను సంతోష్‌రెడ్డికి 2181ఓట్లు వచ్చాయి. టిఆర్‌ఎస్ అభ్యర్థి సరిత 835 ఓట్ల మెజార్టీతో బిజెపి అభ్యర్థిపై విజయం సాధించింది.

పోలీసుల కార్డన్ సెర్చ్ పాతబస్తీలో 40 మంది అరెస్టు

మన తెలంగాణ/హైదరాబాద్/ చార్మినార్ : పాతబస్తీ దక్షిణ మండల పోలీసులు గురువారం పలు ప్రాంతాలలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. దక్షిణ మండల డిసిపి వి.సత్యనారాయణ నేతృత్వంలోని మూడు వందల మంది పోలీసులు ఉదయం ఆరున్నర గంటల నుంచి తొమ్మిది గంటల వరకు దాల్‌మండీ, అల్లా మసీద్, కిషన్‌బాగ్, బహదూర్‌పురా తదితర ప్రాంతాలలో విస్తృత తనిఖీలు చేపట్టారు. 38 మంది అనుమానితులలో 14 మంది రౌడీషీటర్లుండగా 40 వాహనాలను, నాలుగు డాగర్లను, హుక్కా పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. ఈసందర్భంగా డిసిపి సత్యనారాయణ మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే ఎలాంటి కార్యక్రమాలను ఉపేక్షించేది లేదన్నారు. పలు బస్తీల నుంచి కార్డన్ సెర్చ్ చేపట్టాలంటూ పెద్ద ఎత్తున వినతులు అందుతున్నాయని వెల్లడించారు. ఇక నుంచి యాంటి బారాత్ న్యూసెన్స్ గ్యాంగ్ టీమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. బారాత్‌లలో మారణాయుధాలు పట్టుకొని నృత్యం చేస్తూ ఇతరుల ప్రాణాలకు ప్రమాదకరంగా మారారని, అలాంటివి ఇక ముందు సాగనివ్వమని స్పష్టం చేశారు.20 మంది మెరికల్లాంటి పోలీసులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసి బారాత్‌లపై నిఘా పెడతామన్నారు. రౌడీ, గూండాయిజాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని తెలిపారు. తనిఖీల్లో అదనపు డీసీపీ గౌస్ మొహినుద్దీన్, ఏసీపీలు అంజయ్య, ఫయాజ్, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు 25 తులాల బంగారం స్వాధీనం

మన తెలంగాణ/హైదరాబాద్/చార్మినార్ : సంతోష్‌నగర్ పోలీసులు ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి వద్ద నుంచి ఏడున్నర లక్షల రూపాయల విలువచేసే 25 తులాల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. దక్షిణ మండల డీసీపీ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం... సంతోష్‌నగర్ కాలనీకి చెందిన అస్మా జబీన్ గత నెల 29న పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఇంట్లో దాచిన 25 తులాల బంగారు నగలు కనిపించటం లేదని తెలిపింది. పోలీసులు దర్యాప్తు చేపట్టగా షబానా బేగం, షేక్ తాజ్ ఎలియాస్ తాజులు ఇద్దరు భార్యాభర్తలు. వీరిది నిజామాబాద్. ఇరువురు ఇళ్ళలో అద్దెకు దిగి అదను చూసుకొని చోరీలకు పాల్పడుతున్నారు. ఇదే తరహాలో అస్మా జబీన్‌తో చనువుగా నటించి వారి ఇంట్లోని బంగారాన్ని దోచుకున్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దొంగలను అదుపులోకి తీసుకొని వారి నుంచి ఏడున్నర లక్షల విలువ చేసే బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు.కేసును ఇన్‌స్పెక్టర్ ఎన్.రామలక్ష్మ ణ్ రాజు ఆధ్వర్యంలో డిఎస్‌ఐ వి.సత్యనారాయణ దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇళ్ళను అద్దెకిచ్చే సమయంలో గుర్తింపు పత్రాలను తీసుకొని, స్థానిక పోలీసుస్టేషన్లో విచారించిన తరువాతే అద్దెకివ్వాలని పోలీసులు సూచించారు.

రూ.3 కోట్ల డ్రగ్స్ పట్టివేత



మన తెలంగాణ/సంగారెడ్డి ప్రతినిధి : కర్ణాటక నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్ తరలిస్తున్న ముగ్గురు సభ్యుల ముఠాను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ విభాగం అధికారులు గురువారం సాయంత్రం పట్టుకున్నారు. ఈ ముఠా నుంచి దాదాపు 55 కిలోల డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ దాదాపు మూడు కోట్లు వుంటుందని అధికారులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం నుంచి జహీరాబాద్, సంగారెడ్డి మీదుగా హైదరాబాద్‌కు డ్రగ్స్ తరలిస్తున్నట్టు సమాచారం రావడతో డిఆర్‌ఐ అధికారులు వలపన్ని ముఠాను పట్టుకున్నారు. వివిధ బృందాలుగా ఏర్పడిన అధికారులు పక్కా సమాచారంతో సంగారెడ్డి జిల్లా సదాశివపేట శివారులోని కంకోల్‌కు ఈ ముఠా రాగానే వారిని పట్టుకొని డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకొని అదే సమాచారాన్ని జిల్లా ఎస్‌పి చంద్రశేఖర్ రెడ్డికి ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చినట్టు తెలిసింది.

మేడారం ప్రత్యేక అధికారిగా కరుణ

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సింగ్



మన తెలంగాణ / వరంగల్ బ్యూరో : మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు ప్రత్యేకాధికారిగా వాకాటి కరుణను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌పి సింగ్ గురువారం ఉత్తర్వులను జారీ చేశారు. వాకాటి కరుణ గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లా కలెక్టర్ హోదాలో మేడారం జాతరను నిర్వహించారు. జాయింట్ కలెక్టర్‌గా కరుణ రెండుసార్లు జాతర నిర్వహణలో చురుకుగా పనిచేసి సక్సెస్ చేశారు. అదే అనుభవంతో ఈ సారి మేడారం జాతర ప్రత్యేకాధికారి బాధ్యతలను అప్పగించారు. జాతర సమయంలోనే జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న కలెక్టర్ ఆకునూరు మురళిని ఇటీవలనే బదిలీ చేసిన విషయం తెలిసిందే. అలాగే మంచిర్యాల కలెక్టర్ విఆర్ కర్ణాన్‌కు జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్‌గా అదనపు బాధ్యతలను అప్పగించారు. కలెక్టర్‌గా ఉన్న మురళిని బదిలీ చేసిన నేపథ్యంలోనే మేడారానికి ప్రత్యేకాధికారిని నియమిస్తారనే ప్రచారం జరిగిన విషయం తెలిసిందే. జాతరను సమర్థవంతంగా నిర్వహిస్తుందనే నమ్మకంతోనే ప్రభుత్వం వాకాటి కరుణకు బాధ్యతలను అప్పగించింది.

రాష్ట్ర వ్యాప్తంగా రైతు సదస్సులు

- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే రైతు పథకాలపై ప్రజల్లో ప్రచారం చేద్దాం
- కాంగ్రెస్ కార్యవర్గ సమావేశంలో ఉత్తమ్



మన తెలంగాణ/ హైదరాబాద్ : రాష్ట్ర వ్యాప్తంగా రైతు సదస్సులు ఏర్పాటు చేసి కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అమలు చేసే రైతు పథకాలను ప్రచారం చేయాలని టిపిసిసి అధ్యక్షులు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులకు పిలుపునిచ్చారు. ఇప్పటికే ఆర్మూర్ డిక్లరేషన్ పేరుతో పంటల మద్దతు ధరలను ప్రకటించామని, వాటిని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకుపోవాలని సూచించారు. గాంధీభవన్‌లో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు కోదండరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో ఉత్తమ్, శాసనసభ్యులు, టి.జీవన్ రెడ్డి, డాక్టర్ జి.చిన్నా రెడ్డి తదితరులు పాల్గొన్నారు. మూడున్నరేళ్ళు రైతులు నష్ట పోయినా పట్టించుకోని సిఎం కెసిఆర్ ఎన్నికల ఏడాది కాబట్టి రైతుకు ఎకరానికి 4 వేలు ఇస్తామని మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు.ఈనెల 17న కొత్త జిల్లా కేంద్రాలలో రైతు సమస్యలపై కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని ఆయన అన్నారు.

ఐటిడిఏ అధికారిపై చర్య తీసుకోవాలి : రవీంద్రనాయక్

ఎస్‌టిల మధ్య వర్గపోరు సమస్యకు కారణమైన ఉట్నూర్ ఐటిడిఏ అధికారిపై చర్య తీసుకోవాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి, మాజీ ఎంపి రవీంద్రనాయక్ డిమాండ్ చేశారు. గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ బడ్జెట్ లో ఎస్‌టిలకు కేటాయించిన నిధులు ఇంతవరకు ఖర్చుచేయలేదని,గిరిజనులకు అన్యాయం జరుగుతుంటూ గవర్నర్ ప్రేక్షకపాత్రకు పరిమితమవుతున్నారన్నారు.

24 గంటల విద్యుత్ వద్దంటున్నారు : మల్లు రవి

భూగర్భ జలాలపై అవగాహన లేకుండా 24 గంటల విద్యుత్ అంటున్నారని పిసిసి ఉపాధ్యక్షులు డాక్టర్ మల్లు రవి అన్నారు. ఇప్పుడు రైతులే తమకు 24గంటల విద్యుత్ వద్దంటున్నారని చెప్పారు.

భగ్గుమన్న 'రియల్' కక్షలు

- రిటైర్డ్ నేవీ కెప్టెన్‌పై కత్తులతో దాడి
- పోలీసుల అదుపులో రౌడీషీటర్



మన తెలంగాణ/హైదరాబాద్: హైదరాబాద్‌లో మరోసారి భూ వివాదాలు భగ్గుమన్నాయి. ప్రత్యర్థులు బుధవారం రాత్రి మాసాబ్‌ట్యాంక్‌లో రిటైర్డ్ నేవీ కెప్టెన్‌పై విచక్షణారహితంగా కత్తులతో దాడిచేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న అతన్ని సకాలంలో ఆసుపత్రికి తరలించడంతో ప్రాణాపాయం తప్పింది. భూ వివాదామే దాడికి కారణమని పోలీసులు తేల్చారు. హత్యాయత్నానికి పాల్పడిన నిందితుల్లో ఒక రౌడీషీటర్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. మాసాబ్‌ట్యాంక్‌లోని పోలీసు ఆఫీసర్స్ మెస్ ఎదురుగా ఉన్న హెలిగెన్స్ అపార్ట్‌మెంట్‌లో రిటైర్డ్ నేవీ కెప్టెన్ ఇక్రముద్దీన్ కలీమ్ (50) తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసముంటున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెం.12లో ఉన్న ఓ భూ విషయంలో రౌడీషీటర్ సౌద్ అమోది, ఇక్రముద్దీన్‌ల మధ్య విభేదాలు ఉన్నాయి. ఈ భూమికి సంబంధించి ఇక్రముద్దీన్ కోర్టులో కేసు వేశారు. ప్రస్తుతం కేసు విచారణ తుది దశలో ఉంది. ఇదిలావుండగా ఇక్రముద్దీన్ తన కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం రాత్రి 11 గంటలకు ఎగ్జిబిషన్‌కు వెళ్లి కారులో ఇంటికి చేరుకుని లిఫ్ట్ ఎక్కుతుండగా ఇద్దరు అగంతకులు అతడిని విచక్షణారహితంగా కత్తులతో పొడిచి పారిపోయారు. దిగ్భ్రాంతికి గురైన కుటుంబ సభ్యులు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్న ఇక్రముద్దీన్‌ను కేర్ ఆసుపత్రికి తరలించారు. సకాలంలో వైద్యం అందడంతో అతనికి ప్రాణాపాయం తప్పింది. ముఖం, వీపుపై సుమారు ఎనిమిది కత్తిపోట్లు అయ్యాయని వైద్యులు తెలిపారు. ఈ దాడికి రౌడీషీటర్ సౌద్ అమోది కారణమని, కిరాయి హంతకు ముఠాతో దాడి చేయించాడని పోలీసులకు ఇక్రముద్దీన్ కుమారుడు ఫిర్యాదు చేయడంతో హుమాయున్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు రౌడీషీటర్‌ను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. గతంలో కూడా ఇక్రముద్దీన్‌పై దాడికి పాల్పడిన సంఘటనకు సంబంధించి బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో సౌద్‌పై అప్పట్లో కేసు నమోదైంది. ఈ కేసుపై కోర్టులో విచారణ జరుగుతుంది.

మంత్రాల నెపంతో నలుగురిపై దాడి


- కాగే నూనెలో చేతులుపెట్టాలని బలవంతం
- పోలీసులకు చెబితే చంపుతామని బెదిరింపు
- మహిళలను సైతం చితకబాదిన వైనం



మన తెలంగాణ/మంగపేట : మంత్రాలు చేస్తున్నారని ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు గ్రామస్తులను ఏకం చేసి నలుగురిని చితక బాదిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యశంకర్ భూపాలపల్లి జిల్లా మంగపేట మండలంలోని బాలన్నగూడెం గ్రామానికి చెందిన పాయం పోతురాజు చుంచుపల్లి ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడుగా విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే పోతురాజు కుమార్తె గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యానికి గురైంది. దీంతో ఇటీవల పోతరాజు భూత వైద్యునితో వైద్యం చేయించగా గ్రామానికి చెందిన తాటి భిక్షపతి, తెలగాని గణేష్, కోరం పాపారావు, యాలం నాగమ్మల పేర్లను చెప్పారని తెలిరు. దీంతో కోపోద్రిక్తుడైన పోతురాజు ఇదే గ్రామానికి చెందిన కోరం సత్యం, కొర్స ఆంజనేయులు, యాలం చిన్ననర్సయ్య, తాటి లక్ష్మి నర్సు, కొట్టం సమ్మయలతో కలిసి గత బుధవారం పంచాయతీ నిర్వహించారు. పోతురాజు కుమార్తెకు చేతబడి చేసి అనారోగ్యానికి కారణమయ్యారని ఆరోపించారు. తమకు సంబంధం లేదని బాధితులు తెలుపగా కాగే నూనెలో ఉంగరాన్ని తీయాలని, తప్పు చేయకుంటే చేతులు కాలవు అని తెలిపారని అన్నారు. దీనికిససేమిరా అనడంతో గ్రామస్తులందరితో కలిసి మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచినట్టు తెలిపారు. ఈ విషయా న్ని పోలీసులకు చెబితే చంపుతామని బెదిరించినట్టు తెలిపారు. ఇదిలా ఉండగా తెలగాని గణేష్ బాలన్నగూడెం నుండి వలస వెళ్లి దోమెడ గ్రామ పంచాయితీ పరిధిలోని తిమ్మాపూరంలో గౌడ వృత్తిని కొనసాగిస్తుండగా అక్కడినుండి తీసుకుని వచ్చి కొట్టారని తెలిపారు. భర్తను కొడుతుండగా చూసిన భార్య పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళుతున్న క్రమంలో ద్విచక్రవాహనాలపై వచ్చిన గ్రామస్తులు మహిళ అని కూడా చూడకుండా దాడిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. మంగపేట ఎస్‌ఐ అరకూటి మహేందర్ సంఘటనా స్థలానికి వెళ్ళి బాధితులను పోలీస్ స్టేషన్‌కు తరలించి దర్యాప్తు చేస్తున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్టు తెలిపారు.

మంత్రి దేవినేనితో ప్రాణహాని..పోలీసులను ఆశ్రయించిన దంపతులు

లోకాయుక్తలో భూ కేసు వేసిన బాధితులు
విజయవాడలో వారిపై దాడి.. రక్షణ కోసం హైదరాబాద్‌లో నివాసం



మన తెలంగాణ/హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఆయన అనుచరుల నుంచి తనకు, తన భర్తకు ప్రాణ హాని ఉందని, రక్షణ కావాలని ప్రవిజ అనే మహిళ హైదరాబాద్ పోలీసులను ఆశ్రయించింది. విజయవాడలో నివాసముంటున్న తమకు ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరమైన అమరావతిలో కొంత భూమి ఉందని, వివాదానికి సంబంధించి లోకాయుక్తలో విచారణ జరుగుతూ ఉందని, ఈ భూమిపై కన్నేసిన మంత్రి దేవినేని ఉమా తమపై కేసు వేసి వేధిస్తున్నారని వాపోయారు. విజయవాడలో పలుమార్లు తనపైనా, తన భర్తపైనా దాడులు జరిగాయని, విజయవాడ పోలీసులకు ఫిర్యాదు చేసినా నిందితులకే వత్తాసు పలికారని, మరో మార్గం లేక నేరుగా కోర్టును ఆశ్రయించి ఫిర్యాదు చేశామని ఆమె తెలిపారు. అయినా తమపై వేధింపులు ఆగలేదని, ఇక అక్కడ ఉంటే తమ ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుందని భావించి ఇటీవలే యూసుఫ్‌గూడకు మకాం మార్చామని ఆమె వివరించారు. ఇక్కడ కూడా మంత్రి దేవినేని అనుచరులు వచ్చి ఇంటి చుట్టూ తిరుగుతున్నారని, విధిలేని పరిస్థితుల్లో బంజారాహిల్స్ ఇన్‌స్పెక్టర్‌ను ఆశ్రయించాల్సి వచ్చిందని తెలిపారు. తమ ఇంటికి అపరిచిత వ్యక్తులు వస్తున్నారని, అక్కడి పోలీసులు కూడా మంత్రికే అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆమె తన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే కోర్టులో కేసు నడుస్తున్న సమయంలో తాము రక్షణ కల్పించలేమని, హైదరాబాద్‌లో ఇబ్బంది ఉంటే 100 నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని బంజారాహిల్స్ పోలీసులు ఆమెకు సూచించారు. బాధితుల పిటిషన్‌పై విచారణ చేపడుతున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ట్రాక్టర్ బోల్తా : ముగ్గురు మృతి

- ఆరుగురికి గాయాలు
- డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ప్రమాదం



మన తెలంగాణ/పాన్‌గల్: వనపర్తి జిల్లా పాన్‌గల్ బాలపీర్ల దర్గాలో మొక్కులు చెల్లించుకునేందుకు వచ్చి తిరిగి వెళ్తుండగా కోదండం బావి దగ్గర ప్రమాదవశాత్తు ట్రాక్టర్ బోల్తాపడి ముగ్గురు మృతి చెందారు. మరో ఆరుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా బొందలపల్లి గ్రామానికి చెందిన దాదాపు 70 మంది భక్తులు బాలపీర్ల దర్గాకు తమ మొక్కులు తీర్చుకునేందుకు 5 ట్రాక్టర్లలో వచ్చారు. దర్గాలో మొక్కు తీర్చుకొని భోజనం చేసిన తర్వాత స్వగ్రామానికి వెనుదిరిగారు. తిరుగు ప్రయాణంలో దర్గాకు కేవలం కిలోమీటర్ దూరంలో డ్రైవర్ అజాగ్రత్తతో ట్రాక్టర్ బోల్తా ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో డ్రైవింగ్ చేస్తున్న తిరుపతయ్య (45), మౌనిక (16) అక్కడికక్కడే మృతి చెందగా, మృతుడు తిరుపతయ్య భార్య తిరుపతమ్మ (39) తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో మృతి చెందింది. వీరితో పాటు చనిపోయిన యువతి తండ్రి బాలస్వామి, సత్యమ్మ, బంగారమ్మ, బాలస్వామి, శివలకు గాయాలు కాగా వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సిఐ వెంకటేశ్వర్లు హుటాహుటిన సంఘటనా ప్రదేశానికి చేరుకున్నారు. ప్రమాద వివరాలను ప్రత్యక్ష సాక్షుల ద్వారా ఆయన అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్‌ఐ వెంకటేష్‌తో కలిసి శవ పంచనామా నిర్వహించి మృత దేహాలను వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.తిరుపతయ్య సోదరుడు వెంకటయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

విద్యుత్‌పై చర్చకు సిద్ధం


సిఎల్‌పి ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



మన తెలంగాణ/హైదరాబాద్ : విద్యుత్ వ్యవహారంలో ప్రభుత్వం నుండి ఎవరు ముందుకు వచ్చినా చర్చించేందుకు తాను సిద్ధంగా ఉన్నానని, తన ఆరోపణలు తప్పు అని తేలితే ఎంఎల్‌ఏ పదవికి రాజీనామా చేస్తానని సిఎల్‌పి ఉపనేత కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సవాలు విసిరారు. సిఎం కెసిఆర్ ఎవరిని చర్చకు పంపిస్తారో చెప్పాలని, చర్చ అసెంబ్లీలోనైనా లేదా క్యాంపు ఆఫీసులోనైనా ఎక్కడ ఏర్పాటు చేసినా సమ్మతమేనన్నారు. అసెంబ్లీ మీడియా హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. భద్రాద్రి విద్యుత్ ప్లాంట్ నిర్మాణంలో రూ.32 వేల కోట్ల పనిని నామినేషన్ పద్ధతిలో కేటాయించారని, దీనిపై కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి పీయూష్ గోయల్ కూడా అనుమానం వ్యక్తం చేశారని తెలిపారు . ఇంత పెద్ద ఎత్తున పనులను ప్రైవేటు సంస్థలకు కాకుండా ప్రభుత్వ సంస్థలకు అప్పగించాలని సూచించారు. కేవలం కమిషన్‌ల కోసమే యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ ప్రాజెక్టులను నిర్మిస్తున్నారని, ఛత్తీస్‌ఘఢ్ ఒప్పందం వల్ల రాష్ట్రంపై రూ.4వేల కోట్ల భారం పడుతోందన్నారు. సోలార్ పవర్ ప్రాజెక్టుల్లో కూడా అవినీతి ఉన్నదన్నారు. నిజాయితీ కలిగిన సీనియర్ ఐఎఎస్ అధికారులు బి.ఆర్.మీనా, సురేశ్ చందాలకు అక్రమాల విషయంలో ప్రభుత్వ పెద్దల మాట వినందుకు అప్రధాన్య పోస్టుల్లోకి బదిలీ చేశారు. టిఆర్‌ఎస్ ఏ స్కీమ్ పెట్టినా దాని వెనుక స్కామ్ ఉన్నదని, కాళేశ్వరం ప్రాజెక్టులో కాంగ్రెస్ పెట్టిన మోటార్లు చూపిస్తూ తామే చేస్తున్నట్లుగా చెప్పుకుంటున్నారని ఆరోపించారు.

పాలకపక్షం తోక ముడిచింది : రేవంత్‌రెడ్డి

నేడు పాత్రికేయుల సమావేశంలో టిఆర్‌ఎస్ అవినీతిని బయటపెడతాం




మన తెలంగాణ/హైదరాబాద్ : విద్యుత్ రంగంలో జరిగిన అవినీతిపై అవాస్తవాలు మాట్లాడుతున్నామని దమ్ముంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరిన పాలకపక్షం తాము కూడా బహిరంగ చర్చకు సై అనేసరికి తోకముడిచి పారిపోయిందని కాంగ్రెస్ నాయకులు ఎ.రేవంత్‌రెడ్డి అన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం మధ్యాహ్నం ఒంటి గంటకు విలేకరుల సమావేశాన్ని నిర్వహిస్తామని, విద్యుత్ వ్యవహారంలో అధికార పార్టీవారి అవినీతి ఆధారాలను బయటపెడతామని తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన పత్రికా ప్రకటనను విడుదల చేశారు. దమ్ముంటే రేవంత్ రెడ్డి బహిరంగ చర్చకు రావాలని సవాల్ చేసిన టిఆర్ ఎస్ నేతలు బాల్క సమన్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, భాను ప్రకాష్ మరుసటి రోజే తనతో చర్చించేది లేదని మాట మార్చేసారని అన్నారు. వారి బండారం బయటపడుతుందని భయపడి పారిపోయారని, విద్యుత్ రంగంలో అన్నింటా అవినీతికి పాల్పడుతున్న పాలకపక్షం పలాయనవాదం ఎత్తుకున్నా, వారు చేసిన అవినీతి, అక్రమాలను బయట పెట్టేవరకూ వదిలేది లేదని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. చర్చకు రావాలన్న సవాలుని స్వీకరించి, తాను, ఎంఎల్‌ఏ సంపత్ కుమార్, టిపిసిసి అధికార ప్రతినిధి దాసోజు శ్రవణ్ కలిసి 12వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు చర్చకు వస్తామని చెప్పాక అధికార పక్షం తోకముడిచిందన్నారు.

జానకి హంతకుడు అరెస్టు

మన తెలంగాణ/ హైదరాబాద్/ మూసాపేట/ కూకట్‌పల్లి: ప్రేమోన్మాది చేతిలో అతిదారుణంగా హత్యకు గురైన జానకి కేసును కూకట్‌పల్లి పోలీసులు 24 గంటల్లో ఛేదించారు. హత్య కు పాల్పడినట్లుగా భావిస్తున్న నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. హత్యకేసుకు సంబంధించిన వివరాలను కూకట్‌పల్లి ఏసీపీ ఎన్.భుజంగరావు వెల్లడించారు. అనంతప్ప అలియాస్ అనంత్ (22) ప్రగతినగర్‌లో నివాసం ఉంటున్నాడు.బోను జానకి (24) మూసాపేటలో ఉంటోంది. నిందితుడు అనంత్ 8 నెలలుగా తనను ప్రేమించమని జానకి వెంటపడ్డాడు. ఆమె నిరాకరించింది. దీంతో జానకి ఇంటికి వచ్చి చాకుతో కడుపులో రెండు చోట్ల , వెనుకభాగంలో మరో చోట కత్తితో పొడిచి పరారయ్యాడు. కూకట్‌పల్లి పోలీసులు కేసును వేగవంతంగా దర్యాప్తు చేసి నిందితుడు అనంత్‌ను అరెస్ట్ చేశారు.

ఉగాది అనంతరం నిర్ణయం : నాగం



మన తెలంగాణ/నాగర్‌కర్నూల్ : ఉగాది పండుగ అనంతరం తన రాజకీయ భవిష్యత్‌పై నిర్ణయం ప్రకటిస్తానని బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు నాగం జనార్ధన్‌రెడ్డి స్పష్టం చేశారు. తాను ఆరు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందానని తాను తీసుకోబోయే నిర్ణయమే తన చివరి మజిలీగా ఉంటుందని పేర్కొంటున్నారు. నియోజకవర్గ ప్రజలు, కార్యకర్తలే తన భవిష్యత్‌ను నిర్ణయిస్తారని ఆయన తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

ఆధార్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకే దుష్ప్రచారం : నందన్ నీలేకని



బెంగళూరు : ఆధార్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నారని భారత విశిష్ఠ గుర్తింపు ప్రాధికార సంస్థ (ఉడాయ్) మాజీ ఛైర్మన్ నందన్ నీలేకని అన్నారు. ఆధార్ గోప్యతకు సంబంధించి వచ్చిన కథనాల నేపథ్యంలో ట్రిబ్యూన్ పత్రికపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడంపై నీలేకని స్పందించారు. ఆధార్ గురించి ఆ పత్రిక రాసింది, వంద శాతం కల్పిత ప్రచారమని కొట్టి పారేశారు. ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ అవార్డు ప్రదానోత్సవానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆధార్‌పై ప్రతికూల భావాలతో ఉంటే ప్రతికూల స్పందనే వస్తుందని, దీనిపై ప్రజలు నిర్మాణాత్మక దృష్టితో ఉండాలని నీలేకని పేర్కొన్నారు. ఒకసారి మీరు ప్రతికూల దృక్పథంతో ఉంటే, నిర్మాణాత్మక దృష్టి అనేది ఉండదు, దీంతో మీకు ప్రతికూల ప్రభావాలే ఎదురవుతాయి' అని ఆయన పేర్కొన్నారు. కాగా, ఆధార్ గోప్యత కోసం ఉడాయ్ ప్రవేశపెట్టిన వాస్తవిక గుర్తింపు (వర్చువల్ ఐడి) విధానాన్ని నీలేకని ఆహ్వానించారు. దీని ద్వారా ఎవరికి వారే ఉడాయ్ వెబ్‌సైట్ ద్వారా వర్చువల్ ఐడిని సృష్టించుకోవచ్చని సూచించారు. ఆధార్ నెంబరు వెల్లడించాల్సిన అవసరం లేకుండా ఉడాయ్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని ఆయన ప్రశంసించారు. ఆధార్ కొనసాగుతుందని, దీన్ని అంతా స్వీకరించాలని అన్నారు. ఎందుకంటే, 119 కోట్ల మంది ప్రజలు దీన్ని కలిగివున్నార న్నారు.

168 మంది పోలీసుల బదిలీ

మన తెలంగాణ/హైదరాబాద్: పరస్పర అంగీకారంతో రాష్ట్ర పోలీసు శాఖలో ఎస్ఐ స్థాయి నుంచి కానిస్టేబుల్ స్థాయి వరకు బదిలీలు జరిగాయి. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు 84 మంది పోలీసులను బదిలీ చేస్తూ అక్కడి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయగా, తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు 84 మందిని బదిలీ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

స్కూళ్లలో 'సూర్యనమస్కారం'

భోపాల్: స్వామి వివేకానంద జయంత్యుత్సవాల సందర్భంగా ఈనెల 12 నుంచి రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థల్లో సూర్య నమస్కారం, ప్రణాయంలను నిర్వహించాలని మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించింది. అయితే, ఈ సూర్య నమస్కారంలో పాల్గొనడమన్నది కేవలం ఐచ్ఛికమేనని, తప్పనిసరిగా కాదని కూడా సూచించింది. 'రేపు (శుక్రవారం) నుంచి అన్ని విద్యా సంస్థల్లో ఉదయం 9 గంటలకు సూర్యనమస్కారం, ప్రణాయంలు నిర్వహించబడతాయి' అని ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది. కాగా, రాష్ట్ర స్థాయి నమస్కారం కార్యక్రమం లాల్ పరేడ్ గ్రౌండ్‌లో ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, ఇతర మంత్రుల సమక్షంలో జరుగనుంది. రాష్ట్రంలోని పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఇందులో పాల్గొంటారు. ఇలాంటి తరహా కార్యక్రమాలపై వివాదాలు చెలరేగిన నేపథ్యంలో ఈ కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా మాత్రమే పాల్గొనవచ్చునని స్పష్టం చేసింది.

జల్లికట్టుకు 'ఆధార్'



చెన్నై: ఆంబోతులను లొంగదీసుకునే 'జల్లికట్టు' ఆటను నిర్వహించేందుకు నమోదు చేసుకునేవారు తమ ఆధార్ కార్డులను ఇవ్వాలని మధురై కలెక్టర్ గురువారం కోరారు. తమిళనాడులో పొంగల్(సంక్రాంతి) పండుగ సందర్భంగా జనవరి 14 నుంచి 16 వరకు ఈ జల్లికట్టు క్రీడను నిర్వహిస్తుంటారు. అవనియపురం, అలంగనల్లూర్, పాలమేడు ఊళ్లలో జల్లికట్టును నిర్వహించేవారు, అందులో పాల్గొనే ఎడ్ల యజమానులు, ఆంబోతులను లొంగతీసుకోడానికి ఆ క్రీడలో పాల్గొనేవారు తమ ఆధార్ కార్డులను సమర్పించాలని ప్రభుత్వం కోరినట్లు సమాచారం. అయితే ఇందుకు తమకు తగినంత సమయాన్ని ముందుగానే ఇవ్వలేదని గ్రామస్తులు అభ్యంతరాలు లేవనెత్తుతున్నారు.

నాగాలో షెడ్యూల్ ప్రకారమే ఎన్నికలు

న్యూఢిల్లీ : నాగాలాండ్ అసెంబ్లీ ఎన్నికలు షెడ్యూల్ మేరకు జరుగుతాయని హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. చాలా కాలంగా రగులుతున్న నాగాలాండ్ తిరుగుబాటు సమస్యకు పరిష్కారం లభించాలంటే ఈ ఎన్నికలను వాయిదా వేయాలని రాష్ట్రంలోని అనేక పౌర సంస్థలు డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఆయన ఈ ప్రకటన చేయడం గమనార్హం. ఈ విషయాన్ని తనను కలిసిన ముఖ్యమంత్రి టిఆర్ జెలియంగ్‌కు కూడా ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా జరిగిన భేటీలో హోంమంత్రికి ముఖ్యమంత్రి నాగాలాండ్ సమస్య పరిష్కారానికి పలు సూచనలు చేశారు. వివిధ నాగా గ్రూపులతో మధ్యవర్తుల ద్వారా చర్చలు కొనసాగుతాయని హోంమంత్రి వెల్లడించారు. కాగా, ఎన్నికలను వాయిదా వేయాలని వివిధ నాగా గ్రూపులు చేస్తున్న డిమాండ్‌ను తాను సమర్థిస్తున్నట్టు ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ రాష్ట్ర మంత్రి ఇంకాంగ్ ఇంచెన్ తెలిపారు.

తప్పిన పెను విమాన ప్రమాదం

న్యూఢిల్లీ : మంగళూరు విమానాశ్రయంలో పెద్ద ప్రమాదం తప్పింది. రన్‌వేపై ఓ ఖాళీ ట్రాక్టర్ పార్కింగ్ చేసివుండడాన్ని ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఎటిసి) అధికారులు గుర్తించి ప్రమాదాన్ని నివారించారు. ముంబై వెళ్లాల్సిన జెట్ ఎయిర్‌వేస్ విమానం టేకాఫ్ తీసుకునే కొన్ని క్షణాల ముందు ట్రాక్టర్‌ను గుర్తించిన అధికారులు వెంటనే అప్రమత్తమై విమానం టేకాఫ్ ఆదేశాలను రద్దు చేశారు. రన్‌వేపై గడ్డిని కత్తిరించేందుకు వినియోగించే ఈ ట్రాక్టర్‌ను రన్‌వే చివరి వైపున పార్కింగ్ చేసి వుంచారు. ఇందులో ఎవరూ లేరు. ఈ విషయాన్ని జెట్ ఎయిర్‌వేస్ విమానం బయలు దేరడానికి కొద్ది క్షణాల ముందు ఎటిసి అధికారులు గుర్తించారని, దీంతో వెంటనే విమానం టేకాఫ్‌ను రద్దు చేశారని ఎఎన్ఐ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది.

ముంబయి పబ్ యజమాని అరెస్టు

ముంబయి : మహారాష్ట్ర రాజధాని ముంబయిలోని 'వన్ ఎబౌవ్' పబ్‌లో జరిగిన భారీ అగ్నిప్రమాదం ఘటనకు సంబంధించిన కేసులో ఎట్టకేలకు పబ్ యజమాని అభిజీత్ మంకర్‌ను గురువారం పోలీసులు అరెస్టు చేశారు. గత ఏడాది డిసెంబర్ 29న కమల మిల్స్ కాంపౌండ్‌లోని 'వన్ ఎబౌవ్' పబ్‌లో మంటలు చెలరేగి 14 మంది సజీవ దహనమైన విషయం విదితమే. ప్రమాదం జరిగినప్పటి నుంచి పబ్ యజమానితో పాటు సహ యజమానులు కిర్పేష్ సంఘ్వీ, జిగర్ సంఘ్వీలు పరారీలో ఉన్నారు. ఈ నేపథ్యంలో కేసు దర్యాప్తులో భాగంగా వీరి కోసం గాలింపు చర్యలు చేపట్టామని, గురువారం తెల్లవారు జామున మరిన్ లైన్స్‌లో పబ్ యజమాని అభిజీత్ మంకర్‌ను తమ బృందం అరెస్టు చేసిందని ఎన్ఎం జోషి మార్గ్ పోలీస్ స్టేషన్ సీనియర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ పఠాన్ పేర్కొన్నారు.

భార్యను ఉగ్రవాదులకు అమ్మే యత్నం : ఇద్దరు అరెస్టు

తిరువనంతపురం : ఓ యువతిని మత మార్పిడికి బలవంతం చేయడంతో పాటు, ఆమెను సెక్స్ బానిసగా ఇస్లామిక్ ఉగ్రవాదులకు అమ్మేందుకు యత్నించారన్న ఆరోపణలతో కేరళ పోలీసులు కోచి సమీపంలోని ఉత్తర పరవూర్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులను గురువారం అరెస్టు చేశారు. అసలు సూత్రధారి అయిన ఆమె భర్త కోసం పోలీసులు ఇంటర్‌పోల్ సాయంతో గాలిస్తున్నారు. ఫవాజ్, మహ్మద్ సియాద్‌లుగా వీరిద్దరినీ గుర్తించామని, ఇద్దరిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశామని ఎర్నాకుళం పోలీసు సూపరింటెండెంట్ తెలిపారు. ఉత్తర కేరళకు చెందిన 24 ఏళ్ల ఆ యువతి తన భర్త మహ్మద్ రియాజ్ (26) తనను సిరియాలో ఉగ్రవాద కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఇస్లామిక్ స్టేట్ (ఐఎస్) ఉగ్రవాద సంస్థకు విక్రయించేందుకు యత్నించాడని ఆరోపించింది. సౌదీ అరేబియాకు తనను తీసుకెళ్లే ముందు పరవూర్‌లోని ఓ ప్రార్థనా మందిరానికి తీసుకెళ్లిన తనను మత మార్పిడి చేసుకోవాలని బలవంతం చేశాడని, తన భర్త ఆదేశాలతో మరో ఇద్దరు తనను హింసించారని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో ఆమె పేర్కొంది. సౌదీ అరేబియాలో తనను ఓ గదిలో బంధించారని, అయితే తాను ఓ మొబైల్ ఫోన్ ద్వారా తల్లిదండ్రుల సమాచారాన్ని అందించానని, ఎన్ఆర్ఐల సహాయంతో తప్పించుకుని వచ్చానని చెప్పారు.


అప్పుడు అల్లం.. ఇప్పుడు బెల్లం

సిఎంగా ఉన్నప్పుడు ఎఫ్‌డిఐలకు మోడీ వ్యతిరేకం, ప్రధాని అయ్యాక అనుకూలం



న్యూఢిల్లీ: ఒకప్పుడు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను(ఎఫ్‌డిఐ) తీవ్రంగా వ్యతిరేకించిన ప్రధాని నరేంద్ర మోడీ ఇప్పుడు విదేశీ పెట్టుబడులను దూకుడుగా ఆహ్వానిస్తున్నారు. ప్రధానిగా బాధ్యతలు తీసుకున్నాక ఆయన వైఖరి మారిపోయింది. సింగిల్ బ్రాండ్ రిటైల్‌లో 100 శాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు మోడీ ప్రభుత్వం ఆమోదించింది. బుధవారం ఈ మేరకు క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. దీంతో బహుళ జాతి రిటైలర్లయిన యాపిల్, ఐకియా, నైక్ వంటి సంస్థలకు తలుపులు బార్లా తెరిచినట్లయింది. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో మోడీ ప్రభుత్వం ఆలస్యంగా అనుకూల నిర్ణయం తీసుకుంది. అది కూడా విదేశీ పెట్టుబడుల ప్రవాహం రోజురోజుకు క్షీణిస్తున్న తరుణంలో. 2015లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 11 శాతం మేరకు పెరిగాయి. దాంతో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో చైనాను అధిగమించిపోయామని మోడీ ప్రభుత్వం దేశ ప్రజలను తప్పుదారి పట్టించింది. కానీ ఇప్పుడు భారత్‌లా దిగుమతులలో టాప్ కాకుండా, ఎగుమతులలో చైనా టాప్‌గా నిలుస్తోందని ఇప్పుడు కొత్త పాట అందుకుంది. 2012లో యుపిఎ ప్రభుత్వం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు అనుమతించాలని నిర్ణయం తీసుకున్నప్పుడు బిజెపి తీవ్రంగా వ్యతిరేకించింది. నాడు గుజరాత్‌కు ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోడీ అయితే మరింత తీవ్రంగా వ్యతిరేకించారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. మోడీ యు టర్న్ తీసుకున్నారు. బుధవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ప్రభుత్వ విమాన సంస్థ ఎయిర్ ఇండియా ఆస్తులను విదేశీ విమాన సంస్థలు సొంతం చేసుకునేందుకు కూడా ఆమోదం తెలిపారు. అంతేకాక రియల్ ఎస్టేట్ బ్రోకింగ్ బిజినెస్, పవర్ ఎక్స్ఛేంజీల్లో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల నియమాలను సరళతరం చేశారు. 2016 నుంచే విదేశీ పెట్టుబడులు కుంచించుకుపోతున్నందున ఈ ప్రయత్నాలేమీ ఫలితాలివ్వబోవని తెలుస్తోంది. ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 11 శాతం మేరకు తగ్గిపోయాయి. జనవరి–మార్చి త్రైమాసికంలో 3 శాతం వృద్ధిని చేసిన విషయం ఇక్కడ గమనార్హం. గత ఏడాదితో పోల్చినప్పుడు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు తగ్గిపోయాయని ఆర్గనైజేషన్ ఫర్ ఎకనామిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్(ఒఇసిడి) డేటా పేర్కొంది. ఓ ప్రక్క చైనా విదేశీ మారక నిల్వలతో పోల్చినప్పుడు భారత్ విదేశీ మారక నిల్వలు చాలా తక్కువని సమాచారం. ఇదిలా ఉండగా 2015–16లో భారత్ జిడిపి 8 శాతం ఉండగా 2017–18లో 6.5 శాతానికి తగ్గిపోయింది. పెద్ద నోట్ల రద్దు(డీమానిటైజేషన్), వస్తు,సేవల పన్ను (జిఎస్‌టి) అమలు వంటివి భారత్ ఆర్థిక వ్యవస్థను నెమ్మదింపజేసాయని తెలుస్తోంది. దీనికి తోడు ప్రస్తుతం అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగి భారత ద్రవ్యోల్బణ భయాలకు ఆజ్యంపోస్తున్నట్లు కనిపిస్తోంది. ఒకవేళ భారత్ ఆర్థిక మాక్రో ఫండమెంటల్స్ మరింత దిగజారితే రూపాయి విలువ పతనం అయ్యే అవకాశం ఉంది. దాంతో ఆర్‌బిఐ కూడా తీవ్రవైఖరిని అనుసరించి వడ్డీ రేట్లను పెంచేయగలదు. దాంతో భారత్ ఆర్థిక వ్యవస్థ కోలుకోడానికి చాలా తక్కువ ఆస్కారం ఉంటుంది.

నేడే చరిత్రాత్మక ప్రయోగం



చెన్నై: పిఎస్ఎల్‌వి–సి40/కార్టొశాట్ 2 సిరీస్ శాటిలైట్ మిషన్‌ను నింగిలోకి పంపే 28 గంటల కౌంట్ డౌన్‌ను భారత రోదసి పరిశోధన సంస్థ(ఇస్రో) గురువారం ఉదయం 5.29 గంటలకు ఆరంభించింది. మిషన్ రెడీనెస్ రివ్యూ (ఎంఆర్ఆర్) కమిటీ, లాంచ్ ఆథరైజేషన్ బోర్డ్(ఎల్ఎబి) బుధవారం క్లియరెన్స్ ఇచ్చాక ఈ కౌంట్ డౌన్ చేపట్టారు. ఇప్పటికే 250కి పైగా ఉపగ్రహాలను నింగిలోకి పంపిన పోలార్ శాటిలైట్ లాంచ్ వెహికిల్(పిఎస్ఎల్‌వి) శుక్రవారం ఉదయం 9.28 గంటలకు ఇస్రో 100వ ఉపగ్రహంతోపాటు 30 ఇతర ఉపగ్రహాలను సింగిల్ మిషన్‌లో నింగిలోకి తీసుకెళ్లబోతున్నది. ఇస్రో 42వ ఫ్లయిట్‌గా పిఎస్ఎల్‌వి–సి40 నింగిలోకి దూసుకెళ్లబోతున్నది. ప్రస్తుతం శాస్త్రజ్ఞులు ఫ్లయిట్ వివిధ స్థాయిల్లో చేపట్టాల్సిన ప్రొపెలెంట్ ఫిల్లింగ్ కార్యకలాపాల్లో నిమగ్నమై ఉన్నారు. పిఎస్ఎల్‌వి మరోసారి మల్టిపుల్ బర్న్ టెక్నాలజీని ఉపయోగిస్తున్నది. ఇందులో 31 ఉపగ్రహాలను వివిధ కక్ష్యల్లోకి ప్రవేశపెట్టేందుకు నాలుగో దశ ఇంజిన్‌ను నాలుగుసార్లు ఆపేసి, ఇగ్నైట్ చేస్తారు. ఇస్రో గత మిషన్స్‌ల్లో కూడా ఈ మల్టిపుల్ బర్న్ టెక్నాలజీని ఉపయోగించింది. 44.4 మీటర్ల పొడవున్న పిఎస్ఎల్‌వి–సి40 రాకెట్ నెల్లూరు జిల్లాలోని శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష పరిశోధన కేంద్రం నుంచి శుక్రవారం దూసుకెళ్లబోతున్నది. షార్‌లోని బ్రహ్మ ప్రకాశ్ హాల్‌లో బుధవారం మధ్యాహ్నం నుంచి రాకెట్ సన్నద్ధత సమావేశం(ఎంఆర్ఆర్) జరిగింది. ఇందులో రాకెట్ ప్రయోగానికి సంబంధించిన అనేక విషయాలను చర్చించారు.

పిఎస్ఎల్‌వి–సి40 మన దేశానికి చెందిన కార్టోశాట్–2ఇ ఉపగ్రహంతోపాటు ఒక నానో, మైక్రో ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెడుతుంది. అదే సమయంలో కెనడా, ఫిన్లాండ్, ఫ్రాన్స్, కొరియా, ఇంగ్లాండ్, అమెరికాలకు చెందిన ఉపగ్రహాలను కూడా ప్రవేశపెడుతుంది. పిఎస్ఎల్‌వి–సి 40 రాకెట్ మోసుకెళుతున్న 31 ఉపగ్రహాల మొత్తం బరువు దాదాపు 1323 కిలోలుంటుంది. ఇస్రో, దాని వాణిజ్య విభాగం 'ఎంట్రిక్స్ కార్పొరేషన్ లిమిటెడ్' వాణిజ్య ఒప్పందాల్లో భాగంగా 28 అంతర్జాతీయ కస్టమర్ల ఉపగ్రహాలను నింగిలోకి ప్రవేశపెడుతున్నారు. పిఎస్ఎల్‌వి–సి40 మోసుకెళుతున్న మొత్తం ఉపగ్రహాల్లో 30 ఉపగ్రహాలను 555 కిమీ. ధృవ సూర్య సమస్థితి కక్ష్యలో ప్రవేశపెడుతుంది.



రాజధానిలో సంక్రాంతి పర్వదినం సందడి ఊపందుకుంది. హైదరాబాద్‌లోని రామాంతపూర్‌లో ముగ్గుల పోటీలో పెద్ద ఎత్తున పాల్గొన్న మహిళలు

పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన గవర్నర్



మన తెలంగాణ/హైదరాబాద్ : ఇటీవల దేశ వ్యాప్తంగా ఉన్న మోడల్ పోలీస్‌స్టేషన్‌ల కోసం నిర్వహించిన పోటీలలో దేశంలోనే అత్యుత్తమ రెండవ పోలీస్‌స్టేషన్‌గా ఎంపికైన పంజాగుట్ట స్టేషన్‌ను గురువారం గవర్నర్ నరసింహన్, తెలంగాణ డిజిపి మహేందర్‌రెడ్డి సందర్శించారు. మోడల్ పోలీస్‌స్టేషన్ పనితీరును గురించి ఇన్‌స్పెక్టర్ రవీందర్ వారికి వివరించారు. పోలీస్‌స్టేషన్‌లో పౌరులకు అందజేస్తున్న సేవలను, స్టేషన్‌లో ఉన్న అధునాతన మౌలిక వసతులను ఆసక్తిగా పరిశీలించారు. సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన విశ్రాంత గదులు, ఫిర్యాదులు స్వీకరించేందుకు ఫిర్యాదుదారులకు ఏర్పాటు చేసిన కౌంటర్, కమాండ్ కంట్రోల్ సిస్టంను డిజిపి గరవ్నర్‌కు వివరించారు. పోలీస్‌స్టేషన్‌లో పార్కింగ్‌కు అనుకూలంగా వసతి ఏర్పాటు, ఫిర్యాదుదారుల అభ్యంతరాలను పరిగణలోకి తీసుకునేందుకు పనిచేస్తున్న హెల్ప్‌లైన్ సిస్టంతో పాటు కార్పొరేట్ తరహా సౌకర్యాల కల్పన పట్ల గవర్నర్ పోలీస్‌స్టేషన్ నిర్వహణ తీరును గవర్నర్ ఎంతో ప్రశంసించారు. ఫైళ్ళ నిర్వహణ తీరుతో పాటు ఉద్యోగులకు వత్తిడిని తగ్గించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదితో పాటు మహిళా పోలీసుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గదితో పాటు పిర్యాదు దారులకు ప్రత్యేకంగా కౌన్సిలింగ్ ఇచ్చేందుకు ఏర్పాటు చేసిన గదిని కూడా ఈ సందర్భంగా గవర్నర్ సందర్శించారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని పోలీస్ వ్యవస్థను మెరుగు పర్చేందుకు తెలంగాణ ప్రభుత్వం చూపుతున్న కృషి వల్లే దేశంలోని రెండవ ఉత్తమ మోడల్ పోలీస్‌స్టేషన్ అవార్డును కైవసం చేసుకోగల్గిందని అన్నారు. సమష్టి కృషి ఫలితంగానే ఈ అవార్డును పొందడం జరిగిందన్నారు. డిజిపి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ గవర్నర్ పంజాగుట్ట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. దేశంలోనే పంజాగుట్ట పోలీస్ స్టేషన్ రెండవ ఉత్తమ పోలీస్‌స్టేషన్‌గా అవార్డును అందుకోవడం తెలంగాణ పోలీస్‌స్టేషన్‌కే కాకుండా నగర పోలీసులకు గర్వకారణమైన విషయమని అన్నారు. తెలంగాణ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పోలీసు వ్యవస్థలో సమూల మార్పులు చోటు చేసుకున్నాయని తెలిపారు. కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్ నాథ్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోవడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రావు, పశ్చిమ మండల డిసిపి వెంకటేశ్వరరావు, అడిషనల్ డిసిపి వెంకటేశ్వర్లు, పంజాగుట్ట ఏసీపి విజయ్‌కుమార్, డిఐ లక్ష్మీనారాయణరెడ్డి, సబ్ ఇన్‌స్పెక్టర్‌లతో పాటు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్, డిజిపిలు ఇన్‌స్పెక్టర్ రవీందర్‌తో పాటు సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

సిక్కుల కేసుల విచారణకు సిట్

న్యూఢిల్లీ: 1984 నాటి సిక్కుల ఊచకోత కేసుల పునర్విచారణకు కమిటీ ఏర్పాటైంది. 186 కేసులను తిరిగి విచారించాలని బుధవారంనాడు సుప్రీం కోర్టు బుధవారంనాడు నిర్ణయించిన సంగతి తెలిసిందే. అందుకు ముగ్గురు సభ్యులతో కూడిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్) ఏర్పాటు చేయనున్నట్టు కూడా వెల్లడించింది. గురువారంనాడు సిట్ వివరాలను ప్రకటించింది. జస్టిస్ ఎస్ఎన్ ధింగ్రా నేతృత్వంలో ఈ కమిటీ ఏర్పాటైంది. సభ్యులుగా విశ్రాంత ఐఎఎస్ రాజ్‌దీప్ సింగ్, ఐపిఎస్ అధికారి అవిషేక్ దుల్లార్ ఉన్నారు.

ఉమ్మడి హైకోర్టు సిజెగా రాధాకృష్ణన్



మన తెలంగాణ/ న్యూఢిల్లీ : ఎపి, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తి నియామకానికి సుప్రీంకోర్టు కొలీజియం ఆమోదం తెలిపింది. కేరళ రాష్ట్రానికి చెందిన తొట్టతిల్ బి.రాధాకృష్ణన్‌ను కొత్త సిజెగా ఖరారు చేసింది. రాధాకృష్ణన్ చత్తీస్‌ఘడ్ హైకోర్టులో ప్రధాన న్యాయమూర్తిగా చేస్తున్నారు. ప్రస్తుతం ఎపి, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి హైకోర్టుకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా రమేష్ రంగనాథన్‌ను వేరే రాష్ట్ర హై కోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా నియమిస్తారనే ఊహాగానాలు ఉన్నా యి. సుప్రీంకోర్టు న్యాయమూర్తుల కొలీజియం ఆమోదం తర్వాత కొత్త జడ్జీల నియామకంపై తీసుకున్న ఇతర పోస్టుల భర్తీకి సంబంధించిన ఫైలు రాష్ట్ర పతి వద్దకు చేరుతుంది. రాష్ట్రపతి ఆమోదం తర్వాత కొత్త సీజే నియామక ఉత్తర్వులు వెలువడతాయి.

దళితులకు అరగుండు.. ఊరేగింపు



బాలియా (ఉత్తరప్రదేశ్) : గోవులను దొంగిలించారన్న ఆరోపణలతో ఇద్దరు దళితులకు అరగుండు గీయించి, ఊరేగించిన ఘట న రస్రా పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇది సోమవారం జరుగగా బాధితుల్లో ఒకరు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇద్దరిని అరెస్టు చేశారు. త మ మిత్రుడు సోనుతో తనకు హిందూ యువ వాహిని కార్యకర్తలు కొందరు గుండులు గీయించి, ఊరేగించారని ఉమారాం పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు లో పేర్కొన్నాడు. ఈ సందర్భంగా తమ మెడల్లో 'మేము గోవుల దొంగలం' అని రాసివున్న ప్ల కార్డులను వేశారని తెలిపాడు. పోలీసులు మొత్తం 16 మం దిపై కేసులు నమోదు చేశారు.ఈ కేసుపై వేగంగా దర్యాప్తు నిర్వహించాలని డిప్యూ టీ ఎస్‌పి అవ్‌ధేష్ చౌదరిని ఆదేశించినట్టు ఎస్‌పి అనిల్ కుమార్ తెలిపారు.



తమిళనాడులో అమానవీయం

బస్సులో కార్మికుడి హఠాన్మరణం, నడిరోడ్డుపై దించివేత

చెన్నై : ప్రయాణికుడు బస్సులో మృతి చెందడంతో ఆ బస్సు డ్రైవర్, కండక్టర్‌లు నడిరోడ్డుపై మృతదేహాన్ని వదిలేసి వెళ్లిపోయారు. ఈ ఘటన తమిళనాడులోని కృష్ణగిరిలో గురువారం జరిగింది. బెంగళూరులో పని చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు ఇద్దరు తమ సొంత గ్రామమైన తిరువన్నామలైకు వెళ్లేందుకు రాష్ట్ర రవాణా సంస్థకు చెందిన బస్సు ఎక్కారు. కొంత దూరం వెళ్లగానే ఓ కార్మికుడు ఆకస్మికంగా మృతి చెందాడు. విషయాన్ని గమనించిన కండక్టర్ మృతదేహంతో పాటు మరో కార్మికుడిని రోడ్డుపైనే బలవంతంగా దించి వేసి వెళ్లిపోయాడు. 'ఏదైనా అంబులెన్స్ వస్తుందేమోనని నేనిక్కడ ఎదురు చూస్తున్నాను, వస్తే మృతదేహాన్ని తీసుకెళ్తాను. మరో బస్సు మమ్మల్ని ఎక్కించుకునేందుకు అనుమతిస్తుందని నేననుకోవడం లేదు' అని మృతదేహం పక్కనే ఉన్న తోటి కార్మికుడు చెప్పాడు.

మన తెలంగాణ
9
హైదరాబాద్
శుక్రవారం
12, జనవరి 2018
www.manatelangana.news

ప్రైస్ వాటర్‌హౌస్‌పై సెబీ రెండేళ్ల నిషేధం



ముంబై: సత్యం కంప్యూటర్ సర్వీస్ కుంభకోణంలో దోషిగా తేలడంతో ఆడిటర్‌గా వ్యవహరించిన ప్రైస్ వాటర్‌హౌస్(పిడబ్ల్యూ)పై మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ రెండేళ్లపాటు నిషేధం విధించింది. ఆదేశాల ప్రకారం, దేశంలోని లిస్టెడ్ కంపెనీల నుంచి ఈ ఆడిట్ సంస్థ రెండేళ్లు ఎలాంటి ఆడిట్ చేపట్టరాదు. 2017–18లో ఇప్పటికే ఒప్పందం కుదుర్చుకున్న సంస్థల ఆడిటింగ్‌ను మాత్రం పూర్తి చేయవచ్చు. తొమ్మిదేళ్ల క్రితం జరిగిన రూ.7,136 కోట్లు విలువైన సత్యం కుంభకోణంలో ఈ సంస్థ దోషిగా తేలింది. దీంతో సెబీ ఈ ఈమేరకు చర్యలు చేపట్టి.. 108పేజీల ఉత్తర్వులను జారీ చేసింది. అకౌంటింగ్ విలువలకు విరుద్ధంగా వ్యవహరించడంతో చర్యలు తీసుకున్నట్లు సెబీ పేర్కొంది. ఈ కంపెనీనికి చెందిన ఇద్దరు సీనియర్ భాగస్తులైన ఎస్.గోపాల కృష్ణన్, శ్రీనివాస్ తాళ్లూరిలు 2000–2008 మధ్యలో సత్యంకు తప్పుడు ఆడిట్ రిపోర్టులను ఇచ్చారని, దీనికోసం వారు ఆ సంస్థ నుంచి రూ.13కోట్ల మేరకు లబ్ధి పొందినట్లు తేలింది. సెబీ ఆదేశాలపై ప్రైస్‌వాటర్ హౌస్ తమను తీవ్ర నిరాశ చెందింది. తమకు తెలియకుండా పదేళ్ల క్రితం జరిగిన మోసంతో శిక్ష విధించారని, ప్రైస్ వాటర్ హౌస్ సంస్థలు ఉద్దేశపూర్వకంగా ఏ తప్పు చేయలేదని పేర్కొంది. పైగా ఈ ఆదేశాలు ముంబై హైకోర్టు తీర్పునకు అనుకూలంగా లేవని స్పష్టం చేసింది.

టిసిఎస్ లాభం 6,531 కోట్లు

- త్రైమాసికం ఆధారంగా 1.3 శాతం వృద్ధి
- అంచనాలను అందుకున్న ఐటి దిగ్గజం



న్యూఢిల్లీ : మూడో త్రైమాసిక ఫలితాల్లో(అక్టోబర్–డిసెంబర్) దేశీయ అతిపెద్ద ఐటీ సంస్థ టిసిఎస్(టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్) నికర లాభం స్వల్పంగా 1.3 శాతం వృద్ధిని సాధించింది. డిసెంబర్ ముగింపు నాటి క్యూ3లో నికర లాభం రూ.6,531 కోట్లు నమోదు అయింది. అంతకుముందు క్యూ2(జులై–సెప్టెంబర్)లో లాభం రూ.6,446 కోట్లతో పోలిస్తే స్వల్పంగా వృద్ధిని నమోదు చేసింది. విశ్లేషకుల అంచనాల ప్రకారం డిసెంబర్ త్రైమాసికంలో టిసిఎస్ రూ.6532.70 కోట్ల నికర లాభాలను ఆర్జిస్తుందని అంచనా.. అయితే నిపుణుల అంచనాలకు అనుగుణంగానే ఫలితాలు ఉన్నాయి.



రూ.7 మధ్యంతర డివిడెండ్

త్రైమాసికం–త్రైమాసికం ఆధారంగా చూస్తే ఐటి దిగ్గజం మొత్తం ఆదాయం రూ.31,774 కోట్లతో 1.32 శాతం పెరిగింది. కంపెనీ షేరుకు 7 రూపాయల చొప్పున మధ్యంతర డివిడెండ్ ప్రకటించింది. 2016 జనవరి 31 నాటికి ఈక్విటీ వాటాదారులకు మూడో మధ్యంతర డివిడెండ్‌ను చెల్లించనుంది.

మెరుగ్గా రాణించాం: టిసిఎస్ సిఇఒ

ఒప్పందాలు, వేగవంతమైన క్లయింట్ మెట్రిక్స్, పరిశ్ర అంతటా విశాలమైన డిమాండ్‌తో డిసెంబర్ త్రైమాసికంలో పటిష్ఠమైన పనితీరును ప్రదర్శించామని టిసిఎస్ సిఇఒ, ఎండి రాజేష్ గోపీనాథ్ అన్నారు. ఫైనాన్స్, కాస్ట్‌లకు ముందు కంపెనీ లాభాలు 2 శాతం పెరిగి రూ.8651 కోట్లుగా ఉన్నట్టు కంపెనీ పేర్కొంది. 50 మిలియన్ ప్లస్ డాలర్ల వరకు ముగ్గురు క్లయింట్లను, 20 మిలియన్ ప్లస్ డాలర్ల వరకు ఏడుగురిని, 10 మిలియన్ ప్లస్ డాలర్ల వరకు తొమ్మిది మందిని, 5 మిలియన్ ప్లస్ డాలర్ల వరకు 15 మంది క్లయింట్లను చేర్చుకున్నట్టు టిసిఎస్ వెల్లడించింది. క్యూ3లో తాము తొలిసారి 50 మిలియన్ ప్లస్ డాలర్ల డీల్‌పై సంతకం చేశామని, డిజిటల్ టెక్నాలజీస్‌లో తాము ఎంతో కీలకమైన మైలురాయిని అధిగమించామని టిసిఎస్ సిఇఒ గోపినాథన్ తెలిపారు. కన్సాలిడేటెడ్ బేసిస్‌లో మొత్తం ఉద్యోగుల సంఖ్య క్యూ3లో 39,0880కి పెరిగింది.
స్థూలంగా కంపెనీలోకి తీసుకున్న ఉద్యోగులు 12,534 మంది ఉండగా, నికరంగా 1,667 మంది ఉన్నారు. ఫలితాల వెల్లడికి ముందు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో టిసిఎస్ స్టాక్ విలువ అర శాతం పడిపోయి రూ.2,792.50 వద్ద స్థిరపడింది.

సిటిజెన్స్ హాస్పిటల్‌లో టిఎవిఆర్ శస్త్ర చికిత్స విజయవంతం



మన తెలంగాణ / హైదరాబాద్ : 82 ఏళ్ల వ్యక్తికి గుండె నాళం (హార్ట్ వాల్వ్) మార్పిడిని శేరిలింగంపల్లి నల్లగండ్లలోని సిటిజన్ స్పెషాలిటి హాస్పిటల్ వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. డా. ఎ. శ్రీనివాస్ కుమార్, కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్, కార్డియాక్ సర్వీసెస్ చీఫ్ డా. గోకుల్ రెడ్డి, కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ , క్యాప్‌ల్యాబ్ల డైరెక్టర్ డా. వి. హరిరాం, సీనియర్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డా. ఇ. సంజీవ్ కుమార్, కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్ డా. సుధీర్ కోగంటి, డా. జె. రామకృష్ణ, డా. విక్రమ్ ఎరోరా, సీనియర్ కన్సల్టెంట్ సిటి సర్జన్‌ల ఆధ్వర్యంలోని శస్త్ర చికిత్స నిపుణుల బృందం ఈ శస్త్ర చికిత్సను చేసింది. రోగి కేవలం మూడు రోజులలోనే క్షేమంగా ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ అయ్యారని ఈ శస్త్ర చికిత్సకు నేతృత్వం వహించిన డా. ఏ. శ్రీనివాస్ కుమార్ తెలిపారు. ఇటీవలే నేషనల్ ఇంటర్వెన్షనల్ కౌన్సిల్ ఆఫ్ కార్డియాలకల్ సొసైటి ఆఫ్ ఇండియా ఛైర్మన్‌గా ఏక గ్రీవంగా ఎన్నిక కావడం విశేషం. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని డా. ఏ. శ్రీనివాస్ కుమార్ గురువారం హైదరాబాద్‌లో మీడియా సమావేశంలో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. సిటిజెన్స్ హాస్పిటల్‌లో నూతనంగా హార్ట్ ఫెయిల్యూర్ క్లినిక్‌ని కూడా ప్రారంభిస్తున్నట్లు ఆయన చెప్పారు.

ఈక్విటీ మార్కెట్లు మరో రికార్డు




ముంబై: స్టాక్‌మార్కెట్లు ఒడిదుడుకులకు లోనైనా చివరకు లాభాలతో ముగిశాయి. గురువారం సెన్సెక్స్ 70.42 పాయింట్ల లాభంతో 34,443 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 19 పాయింట్ల లాభంతో 10,651 పాయింట్ల వద్ద ముగిసింది. ఓ దశలో నిఫ్టీ సూచీ 10,664కి చేరుకుంది. కంపెనీల క్యూ3 ఫలితాల ప్రకటన, ట్రేడింగ్ ప్రారంభంలో సూచీలను ప్రభావం చేసే అంశాలేవి లేకపోవడంతో సూచీలు అక్కడక్కడే నిలకడగా ముందుకు సాగాయి. రంగాల వారీగా చూస్తే రియాల్టీ, బ్యాంకెక్స్, ఐటీ సూచీలు 2 శాతం వరకు లాభపడ్డాయి. బిఎస్ఇ రియల్టీ ఇండెక్స్ ఏడేళ్ల గరిష్టాన్ని తాకగా, పిఎస్‌యు బ్యాంక్స్, ఐటీ, ఫార్మా రంగ షేర్ల ర్యాలీతో మార్కెట్లు లాభాల్లోకి మళ్లాయి. బిఎస్ఇ స్మాల్‌క్యాప్ ఇండెక్స్ జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. ఇన్ఫోసిస్, ఇండియన్ బుల్ హౌసింగ్ ఫైనాన్స్, భారతీ ఎయిర్‌టెల్, కోటక్ మహీంద్రా, టెక్ మహీంద్రా షేర్లు 2 నుంచి 1శాతం లాభపడ్డాయి. విప్రో, ఇండస్ఇండ్ బ్యాంక్, అంబుజా సిమెంట్స్, సిప్లా, బజాజ్ ఫైనాన్స్ షేర్లు 2నుంచి 1శాతం నష్టపోయాయి.

స్టాక్ మార్కెట్

ఈరోజు మార్కెట్	ముగింపు	మార్పు	%
సెన్సెక్స్	34503.49	70.42	0.20%
నిఫ్టీ	10651.20	19.00	0.18%

బులియన్






బంగారం ధర

నగరం	ధర (రూ / 10 గ్రాములు)		
	22క్యారట్	24క్యారట్	మార్పు(%)
చెన్నై	28330	30299.47	0.68%
ముంబై	29130	31155.08	0.24%
ఢిల్లీ	28550	30534.76	0%
కోల్‌కతా	29060	31080.21	0%
కేరళ	27450	29358.29	0.37%
బెంగళూరు	27800	29732.62	0.14%
హైదరాబాద్	28330	30299.47	0.43%
గల్ఫ్	1402.97	1500.50	0.7%

వెండి ధర (రూ./ కిలో)

నగరం	బుధవారం	మంగళవారం	మార్పు (%)
చెన్నై	41900.00	42000.00	0.24
ముంబై	41900.00	42000.00	0.24
ఢిల్లీ	41900.00	42000.00	0.24
కోల్‌కతా	41900.00	42000.00	0.24
హైదరాబాద్	41900.00	42000.00	0.24



కోడిగుడ్లు (100కు) నెక్ రేటు

హైదరాబాద్	402	విశాఖపట్నం	402
వరంగల్	404	చిత్తూరు	398
విజయవాడ	404	చెన్నై	405
గోదావరి	404	బెంగళూరు	405

ఇండస్ఇండ్ బ్యాంక్ లాభం 25 శాతం వృద్ధి



న్యూఢిల్లీ : ప్రైవేటురంగ సంస్థ ఇండస్ఇండ్ బ్యాంక్ గురువారం మూడో త్రైమాసిక ఫలితాలను వెల్లడించింది. ఈ ఫలితాల్లో నికర లాభం 25 శాతం వృద్ధిని సాధించింది. 2017 డిసెంబర్ 31 ముగింపునాటి క్యూ3 ఫలితాల్లో నికర లాభం రూ.936.25 కోట్లు నమోదైంది. 2016లో ఇదే త్రైమాసికంలో బ్యాంక్ లాభం రూ.750.64 కోట్లతో పోలిస్తే ఈసారి మంచి వృద్ధిని నమోదు చేసింది. మొత్తం ఆదాయం 16.05 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఆదాయం రూ.4,716.13 కోట్ల నుంచి రూ.5,473.54 కోట్లకు పెరిగిందని బిఎస్ఇ ఫైలింగ్‌లో ఇండస్ఇండ్ బ్యాంక్ వెల్లడించింది. బ్యాంక్ స్థూల ఎన్‌పిఎ(నిరర్థక ఆస్తులు) 1.16 శాతం పెరగ్గా, అంతకుముందు 0.94 శాతంగానే ఉన్నాయి. నికర ఎన్‌పిఎ 0.39 శాతం నుంచి 0.46 శాతం పెరిగాయి. బ్యాంక్ ఎండి, సిఇఒ రోమేష్ సొబ్తి మాట్లాడుతూ, ఈ త్రైమాసికంలోనూ మళ్లీ నిలకడగా బ్యాంక్ లాభాలను కొనసాగించిందని అన్నారు. ప్రణాళికా పరంగా అన్ని అంశాల్లో పురోగతి సాధిస్తున్నామని, తాము స్థిర నాణ్యత రుణాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫలితాల నేపథ్యంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో ఇండస్ఇండ్ బ్యాంక్ షేరు విలువ 2 శాతం పడిపోయి రూ.1,700.70 వద్ద స్థిరపడింది.

రూ.3500 కోట్ల బినామీ ఆస్తుల జప్తు

ఆదాయం పన్ను శాఖ వెల్లడి



న్యూఢిల్లీ: ఆదాయం పన్ను శాఖ బినామీ ఆస్తుల భరతం పడుతోంది. ఫ్లాట్లు, షాపులు, నగలు, వాహనాలతో సహా 900 బినామీ ఆస్తులను జప్తు చేశామని, వీటి విలువ రూ.3500 కోట్లు ఉంటుందని ఐటి ప్రకటించింది. 2016 నవంబర్ నుంచి అమల్లోకి వచ్చిన బినామీ ఆస్తుల లావాదేవీల నిషేధం చట్టం కింద ఐటి చర్యలు వేగవంతం చేసింది. ఈ చట్టం కింద చర, స్థిర అనే అంశాల ఆధారంగా బినామీ ఆస్తులను తాత్కాలికంగా జప్తు, తదుపరి చర్యలు చేపట్టడం ఉంటుంది. ఈ చట్టం ప్రకారం లబ్ధిపొందిన యజమానిని విచారించేందుకు అనుమతి కూడా వుంటుంది. బినామీ లావాదేవీలకు పాల్పడిన వారు ఏడేళ్ల కఠిన ఖారాగార శిక్ష, ఆస్తుల మార్కెట్ విలువ ప్రకారం 25 శాతం వరకు జరిమానా విధిస్తారు. బినామీ ఆస్తులపై సత్వరమే చర్యలు చేపట్టేందుకు గాను 2017 మే నెలలో దేశ వ్యాప్తంగా దర్యాప్తులో భాగంగా 24 బిపియు(బినామీ ప్రొహిబిషన్ యునిట్స్)లను ఐటి శాఖ ఏర్పాటు చేసింది. దీనిలో భాగంగానే బినామీ చట్టం కింద 900 ఆస్తుల కేసులను డీల్ చేసి, వాటి జప్తు ప్రక్రియ చేపట్టామని ఆదాయం పన్ను శాఖ తెలిపింది. వీటిలో భూములు, ఫ్లాట్లు, షాపులు, నగలు, వాహనాలు, బ్యాంక్ ఖాతాల్లోని డిపాజిట్లు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు వంటివి ఉన్నాయి. మొత్తం జప్తు చేసిన ఆస్తుల విలువ రూ.3500 కోట్లు, దీనిలో స్థిరాస్తుల విలువ రూ.2900 కోట్లు ఉంటుందని ఐటి వెల్లడించింది. బినామీ అంటే పేరు లేకుండా అని అర్థం వస్తుంది. చట్టబద్ధమైన యజమాని లేకుండా ఆస్తుల లేదా కల్పిత యజమాని పేరిట ఆస్తులనే బినామీగా పేర్కొంటారు. బినామీదారు, ప్రయోజనాలు పొందే వ్యక్తి (వాస్తవంగా ఆ ఆస్తులను కూడబెట్టుకున్నవారు)తో పాటులావాదేవీలలో సంబంధం ఉన్న వారికి ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధించే అవకాశం ఉంది. అందువల్ల బినామీ లావాదేవీలకు దూరంగా ఉండాలని ఐటి శాఖ హెచ్చరించింది. నల్లధనంపై చేస్తున్న పోరాటానికి ప్రజలు సహాయం చేయాలని ఆదాయం పన్ను శాఖ ప్రకటనలో పేర్కొంది.

నవంబర్‌లో 118 కోట్లకు తగ్గిన టెలికామ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య

మరోవైపు 15 కోట్లకు పెరిగిన జియో కస్టమర్లు



న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా టెలికామ్ సబ్‌స్క్రైబర్ల సంఖ్య నవంబర్‌లో 1.58 కోట్లు తగ్గి 118.5 కోట్లు అయింది. అంటే 1.32 శాతం మేరకు కస్టమర్ల బేస్‌లో క్షీణత నమోదైంది. అయితే రిలయన్స్ జియో మాత్రం 15 కోట్ల కస్టమర్ల మార్క్‌ను చేరింది. కస్టమర్లను పెంచుకోవడంలో అన్ని సంస్థల కంటే జియో ముందుందని ట్రాయ్ వెల్లడించింది. ట్రాయ్(టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా) నివేదిక ప్రకారం, టెలికాం మార్కెట్‌లో 13 శాతం షేర్‌ని నమోదు చేసుకోవడంతో పాటు జియోకు 61 లక్షల మంది కస్టమర్లు అదనంగా వచ్చి చేరారు. అలాగే భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్, ఐడియా సెల్యులర్‌కు వరుసగా 43.4 లక్షలు, 27 లక్షల్లు, 31.9 లక్షల మంది కొత్త కస్టమర్లు వచ్చారు. టెలికాం రంగంలో సంచలనం సృష్టించిన జియో నెల నెలా తన మార్కెట్ షేర్‌ను పెంచుకుంటూ పోతోంది. ఆగస్టులో 11.19శాతం మార్కెట్ షేర్ ఉండగా.. సెప్టెంబరులో 11.72శాతం, అక్టోబరులో 12.39శాతం, నవంబరులో 13.08శాతం పెరుగుదలను నమోదు చేసుకుంది. భారతీ ఎయిర్‌టెల్‌కు 289.53 మిలియన్ల మంది కస్టమర్లు ఉండగా.. వొడాఫోన్, ఐడియాకు వరుసగా 211.02 మిలియన్లు, 194.06 మిలియన్ల మంది కస్టమర్లు ఉన్నారు. నవంబరు చివరి నాటికి రిలయన్స్ జియోకు 152 మిలియన్ల మంది కస్టమర్లు ఉన్నారు. రిలయన్స్ కమ్యూనికేషన్స్(ఆర్‌కామ్) 2జి సేవలను నిలిపివేస్తున్నట్లు ప్రకటించడంతో కస్టమర్లు తగ్గారు. 25.75 మిలియన్ల మంది కస్టమర్లను కోల్పోయింది. కాగా ఇంటర్నేషనల్ టర్మినేషన్ ఛార్జీలను కూడా సగం తగ్గించబోతున్నట్టు ట్రాయ్ తెలిసింది. ప్రస్తుతం నిమిషానికి 53 పైసలుగా ఉన్న ఈ ఛార్జీలను 25 నుంచి 30 పైసలకు తగ్గించబోతున్నారని ఓ సీనియర్ అధికారి తెలిపారు. ఇంటర్నేషనల్ కాల్ టర్మినేషన్ ఛార్జీలను ఓ టెలికాం ఆపరేటర్, కాల్ టర్మినేట్ చేసే సర్వీసు ప్రొవైడర్‌కు చెల్లిస్తారు. మొబైల్స్, ల్యాండ్‌లైన్ కాల్స్ అన్నింటికీ ఈ ఛార్జీలను చెల్లిస్తారు.

ఎయిర్‌టెల్‌కు ఊరట



న్యూఢిల్లీ : టెలికాం దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్‌కు యుఐడిఎఐ(యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా) ఊరటనిచ్చింది. టెలికాం సబ్‌స్క్రైబర్లకు ఆధార్ ఆధారిత ఇకెవైసి ధృవీకరణ మార్చి 31 వరకు కొనసాగించేందుకు అనుమతిచ్చింది. అయితే భారతీ బ్యాంకింగ్ సంస్థ ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంకుపై విధించిన ఇకెవైసి లైసెన్స్ రద్దు ఆర్డర్‌ను మాత్రం యుఐడిఎఐ ఉపసంహరించుకోలేదని సంబంధిత వర్గాలు చెప్పాయి. 2018 మార్చి 31 వరకు ఆధార్ ఆధారిత ఇకెవైసి ధృవీకరణకు యుఐడిఎఐ అనుమతి ఇచ్చిందని భారతీ ఎయిర్‌టెల్ అధికార ప్రతినిధి చెప్పారు. అథారిటీ నిర్దేశించిన మార్గదర్శకాలను తాము పాటించనున్నామని, పేమెంట్స్ బ్యాంకింగ్ సంస్థపై యుఐడిఎఐ జారీచేసిన ఆదేశాలపై స్పందించడానికి మాత్రం సంసథ ప్రతినిధి నిరాకరించారు. ఎయిర్‌టెల్ తమ కస్టమర్లకు తెలియకుండా పేమెంట్ బ్యాంకు అకౌంట్లు తెరిచి, ప్రభుత్వం నుంచి వచ్చే గ్యాస్ సబ్సిడీలకు లింక్ చేసినట్టు యుఐడిఎఐ విచారణలో వెల్లడైంది. ఎయిర్‌టెల్‌బ్యాంకు అకౌంట్లలోకి గ్యాస్ సబ్సిడీ వెల్లుతున్నట్టు తెలిసింది. దీంతో కస్టమర్ల ఆధార్ ఆధారిత ఇ కెవైసి ధృవీకరణ చేపట్టకుండా భారతీ ఎయిర్‌టెల్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకుపై యుఐడిఎఐ గతేడాది డిసెంబర్‌లో నిషేధం విధించింది. ఈ విషయంలో ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకుకు రూ.2.5 కోట్ల జరిమానా విధించి, వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టకుండా నిషేధం విధించింది. అనంతరం భారతీ ఎయిర్‌టెల్‌కు జనవరి 10 వరకు అనుమతి ఇచ్చినప్పటికీ, ప్రస్తుతం ఈ అనుమతిని 2018 మార్చి 31 వరకు ఇవ్వనున్నట్టు పేర్కొంది.

టాప్ గెయినర్స్ (+)

కంపెనీ పేరు	గరిష్ఠం	కనిష్ఠం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	లాభం %
ఇన్ఫోసిస్	1,083.40	1,055.25	1,075.80	1,052.25	23.55	2.24
ఇండియాబుల్స్	1,241.00	1,201.40	1,228.65	1,204.20	24.45	2.03
టెక్ మహీంద్ర	555.85	542.70	551.70	542.10	9.60	1.77
భారతి ఎయిర్‌టెల్	516.70	503.20	514.75	506.40	8.35	1.65
కోటక్ మహీంద్ర	1,021.00	1,001.05	1,017.65	1,002.25	15.40	1.54
టాటాపవర్	100.25	97.80	99.55	98.25	1.30	1.32
ఐచర్ మోటార్స్	28,525.00	27,820.50	28,444.70	28,097.50	347.20	1.24
ఎస్ బ్యాంకు	344.25	335.30	343.15	339.80	3.35	0.99
ఏసియన్ బ్యాంకు	1,189.95	1,170.00	1,188.95	1,177.40	11.55	0.98
హెచ్‌యుఎల్	1,382.90	1,357.00	1,378.65	1,365.80	12.85	0.94

టాప్ లూజర్స్ (-)

కంపెనీ పేరు	గరిష్ఠం	కనిష్ఠం	ముగింపు ధర	క్రితం ముగింపు	మార్పు	నష్టం %
ఇండస్ఇండ్ బ్యాంకు	1,752.00	1,685.00	1,700.30	1,734.10	33.80	1.95
విప్రో	326.05	319.00	321.10	326.70	5.60	1.71
అంబుజా సిమెంట్స్	278.90	271.00	271.75	276.10	4.35	1.58
బజాజ్ ఫైనాన్స్	1,798.00	1,773.05	1,780.35	1,802.20	21.85	1.21
సిప్లా	619.00	609.10	612.35	619.75	7.40	1.19
పవర్ గ్రిడ్ కార్ప్	200.30	197.30	197.85	199.85	2.00	1.00
హెచ్‌పిసిఎల్	423.50	417.70	420.95	424.55	3.60	0.85
హీరో మోటోకార్ప్	3,743.20	3,700.20	3,705.65	3,736.90	31.25	0.84
భారతి ఇన్‌ఫ్రాటెల్	371.75	363.90	367.75	370.80	3.05	0.82
ఐసిఐసిఐ బ్యాంకు	312.50	308.55	309.50	312.00	2.50	0.80

మన తెలంగాణ
10
హైదరాబాద్
శుక్రవారం
12 జనవరి 2018
wraw.manatelangana.news

వేసవిలో రానున్న 'ఈ నగరానికి ఏమైంది'



తన మొదటి సినిమా 'పెళ్లి చూపులు'తో బాక్సాఫీస్ హిట్‌ను అందుకున్న దర్శకుడు తరుణ్ భాస్కర్. ఆతర్వాత తన రెండవ సినిమాను రిలీజ్ చేయడానికి చాలా సమయం తీసుకుంటున్నాడు. ప్రముఖ నిర్మాత సురేష్‌బాబు రూపొందిస్తున్న చిత్రానికి తరుణ్‌భాస్కర్ దర్శకత్వం వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ వేగాన్ని పెంచుకుంది. ఈ చిత్రాన్ని కూడా తరుణ్ డిఫరెంట్‌గా తెరకెక్కించనున్నాడట. దీనికి ఒక వెరైటీ టైటిల్‌ను కూడా సెట్ చేసినట్లు తెలిసింది. 'ఈ నగరానికి ఏమైంది' అనే టైటిల్‌ను ఖరారుచేశాడట. ఈ చిత్రంలో హీరోయిన్‌గా అనీషా ఆంబ్రోస్ కనిపించనుండగా 'వెళ్లిపోమాకే' ఫేమ్ విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటిస్తున్నాడు. ఈ సినిమా ప్రారంభానికి ముందు దర్శకుడు నటీనటుల కోసం వర్క్‌షాప్ కూడా నిర్వహించాడు. ఇక వీలైనంత తొందరగా షూటింగ్‌ను పూర్తిచేసి వేసవిలో ఈ చిత్రాన్ని విడుదల చేసేందుకు తరుణ్ భాస్కర్ ప్లాన్ చేసినట్లు సమాచారం.

షూటింగ్‌ల సందడి



మహేశ్‌బాబు



నాగార్జున



నాగచైతన్య

ఒక సినిమాను తెరకెక్కించాలంటే సీన్‌కు సరిపడే లొకేషన్స్ ఎంత అవసరమో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. సినిమాలో ఒక సీన్ ప్రేక్షకులను ఆకట్టుకుంది అంటే లొకేషన్స్ పాత్ర కూడా చాలానే ఉంటుంది. అయితే ఇటీవల మన తెలుగు తారలు లొకేషన్స్ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. కొందరు దర్శకులు సెట్స్‌తో సరిపెడుతుంటే మరికొందరు ఏకంగా నిజమైన ప్రదేశాలలో భారీ ఖర్చుతో సినిమాను తెరకెక్కిస్తున్నారు. యాక్షన్ పరమైన సన్నివేశాలను చిత్రీకరించాలంటే నిజమైన ప్రదేశాలలో అయితేనే బెటర్ అని మన దర్శకులు అందుకు తగ్గ లొకేషన్స్‌ను సెట్ చేసుకుంటున్నారు. ఇకపోతే ప్రస్తుతం చాలా వరకు షూటింగ్‌లు హైదరాబాద్‌లోనే జరుగుతున్నాయి. కొన్ని నిజమైన ప్రదేశాలలో ఎలాంటి మార్పులు చేయకుండా దర్శకులు షూటింగ్ చేస్తున్నారు. మహేష్‌బాబు 'భరత్ అనే నేను' సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే ఎక్కువగా జరుగుతోంది. ఈ సినిమా రాజకీయ నేపథ్యంలో తెరకెక్కుతోంది. అయితే రియాలిటీ ఎక్కువగా కనిపించాలని దర్శకుడు కొంచెం కొత్తగా ట్రై చేస్తున్నాడట. ఇక నాగార్జునరామ్‌గోపాల్ వర్మ సినిమా కూడా హైదరాబాద్‌లోనే నడుస్తోంది. గచ్చీబౌలిలోని కొన్ని ప్రదేశాల్లో దర్శకుడు వర్మ యాక్షన్ పరమైన సన్నివేశాలను తనదైన శైలిలో తెరకెక్కిస్తున్నాడు. ఇక నాగార్జున తనయుడు నాగచైతన్య కూడా హైదరాబాద్‌లోనే 'సవ్యసాచి' షూటింగ్‌ను కొనసాగిస్తున్నాడు. ఉప్పల్‌లో ఈ సినిమా షూటింగ్ జరుగుతోంది. చందు మొండేటి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నాడు. ఇవేకాకుండా మరికొన్ని చిత్రాల షూటింగ్‌లు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్నాయి.

ఆయన దగ్గర చాలా విషయాలు నేర్చుకున్నా

నందమూరి బాలకృష్ణ హీరోగా కె.ఎస్.రవికుమార్ దర్శకత్వంలో సి.కళ్యాణ్ నిర్మించిన చిత్రం 'జై సింహా'. ఈ చిత్రంలో నయనతార, నటాషా దోషి, హరిప్రియ హీరోయిన్లుగా నటించారు. ఈ సినిమా శుక్రవారం విడుదలకానుంది. ఈ సందర్భంగా నటాషా దోషితో ఇంటర్వ్యూ విశేషాలు..



☞ తెలుగులో మొదటిది...

మలయాళంలో రెండు చిత్రాల్లో నటించాను. అక్కడ నా మొదటి సినిమా 'మంత్రికన్'. హీరో జయరాంతో కలిసి నటించాను. మా అమ్మ మలయాళీ కాబట్టి నాకు మలయాళం బాగా వస్తుంది. ఇక నా తొలి తెలుగు చిత్రం 'జై సింహా'.

☞ యువరాణిలా చూసుకుంటారు...

ఈ సినిమాలో నా పాత్ర పేరు ధన్య. మురళీమోహన్‌కు కూతురిగా నటించాను. ఆయన నన్ను యువరాణిలా చూసుకుంటారు. మా నాన్న యుఎస్ నుండి స్వస్థలం కుంభకోణం వచ్చాక ఏం జరిగింది అనేది ఈ చిత్రంలో ఆసక్తికరంగా ఉంటుంది.

☞ అదృష్టంగా భావిస్తున్నా...

దర్శకుడు కె.ఎస్.రవికుమార్, నిర్మాత సి.కళ్యాణ్ ఈ చిత్రంలోని పాత్ర కోసం నన్ను సంప్రదించారు. చాలా మంది అమ్మాయిలను చూశాక వాళ్లు నన్ను ఎంపికచేశారు. ఈ పాత్ర చేయడం అదృష్టంగా భావిస్తున్నాను.

☞ సులభంగా చేశాను...

సినిమాలోని అమ్మకుట్టి... పాటలో నా డ్యాన్స్ ప్రేక్షకులను అలరిస్తుంది. నేను బేసిక్‌గా డ్యాన్సర్ కావడంతో ఎంతో సులభంగా ఈ పాటలో డ్యాన్స్ చేశాను. స్క్రీన్‌పై నా నటన అందరికీ నచ్చుతుందన్న నమ్మకముంది.

☞ ఆయన గొప్ప నటుడు...

బాలకృష్ణ తెలుగు సినిమాలు చూడలేదు కానీ ఆయన సినిమాలు హిందీలో డబ్ అయ్యాకు వాటిని చూశాను. ఆయన గొప్ప నటుడు. బాలకృష్ణతో కలిసి నటించడం మరచిపోలేని అనుభూతినిచ్చింది. ఆయన దగ్గర చాలా విషయాలు నేర్చుకున్నాను.

☞ ఆతృతగా ఎదురుచూస్తున్నా...

దర్శకుడు రవికుమార్ ఈ స్క్రిప్ట్ చెప్పినప్పుడు చాలా నచ్చింది. ఆయన చెప్పిన విధానం, కథలో ట్విస్ట్ నన్ను ఈ సినిమాలో నటించేలా చేశాయి. 'జై సింహా' విడుదల కోసం ఎంతో ఆతృతగా ఎదురుచూస్తున్నాను.

తమిళ సినిమా వైపే మొగ్గు

సౌత్‌తో పాటు బాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా రాణించిన తార శ్రీదేవి. అప్పట్లో దక్షిణాదిన, బాలీవుడ్‌లో ఎందరో టాప్ హీరోలతో హిట్ సినిమాలు చేసి భారతదేశ చిత్ర పరిశ్రమలో అందాల తారగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకుంది. ప్రస్తుతం ఆమె కూతురు జాహ్నవి హీరోయిన్‌గా సినీ రంగ ప్రవేశం చేస్తోంది. అయితే ఆమె తెరంగేట్రం తెలుగు సినిమా ద్వారా ఉంటుందేమోనని ముందుగా అనుకున్నారు. కానీ శ్రీదేవి మాత్రం హిందీ సినిమాకే మొగ్గు చూపింది. మరాఠీ హిట్ మూవీ 'సైరత్' రీమేక్ అయిన 'ధడక్'లో జాహ్నవి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ చివరి దశలో ఉంది. అది విడుదలకాక ముందే సౌత్‌లో కూడా తన కూతురి చేత ఓ సినిమా చేయించాలనేది శ్రీదేవి ఆలోచన. తమిళ్ సినిమాతో సౌత్‌కు పరిచయం చేయించాలనే ప్లాన్‌లో ఉందట. దీంతో తెలుగు ప్రేక్షకులు, అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జాహ్నవి పుట్టి పెరిగింది ముంబయ్‌లో కాబట్టి ఆమెను హిందీ సినిమాతో వెండి తెరకు పరిచయం చేయడం పట్ల ఎటువంటి అభ్యంతరం లేదని కానీ తనకు లైఫ్ ఇచ్చిన తెలుగు పరిశ్రమను మర్చిపోయి తమిళ సినిమాలో కూతురిని నటింపచేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నిస్తున్నారు. కోరి వచ్చిన 'బాహుబలి' అవకాశాన్ని వద్దనుకుంది అనే దాని గురించి శ్రీదేవి మీద గతంలో పెద్ద చర్చే జరిగింది. ఆ సమయంలో తమిళ్‌లో విజయ్ సినిమా 'పులి'లో నటించి పరాజయాన్ని అందుకుంది. ఇన్ని జరిగినా తెలుగు సినిమాపై శ్రీదేవి చిన్నచూపే చూస్తోందని అంటున్నారు తెలుగు ప్రేక్షకులు, అభిమానులు.



శ్రీదేవి, జాహ్నవి

నటనతోనూ ఆకట్టుకుంటుందట



హెబ్బా పటేల్

'కుమారి 21ఎఫ్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులను ఎంతగానో అలరించిన తార హెబ్బాపటేల్. గ్లామర్ హీరోయిన్‌కు ఉండాల్సిన లక్షణాలు అన్నీ ఉన్న ఆమెకు ఆతర్వాత వరుసగా అవకాశాలు వచ్చాయి. కానీ తొలి సినిమా స్థాయిలో ఇతర సినిమాలు పెద్దగా సక్సెస్‌ను సాధించలేకపోయాయి. దాంతో ఆమె ఈమధ్య కాస్త వెనుకబడింది. ఇటీవల హెబ్బా హీరోయిన్‌గా చేసిన 'ఏంజెల్' చిత్రం కమర్షియల్‌గా సక్సెస్ కాలేకపోయింది. దీంతో సినిమాల ఎంపికలో హెబ్బా కాస్త ఆచితూచి అడుగులు వేయడం మొదలుపెట్టింది. తాజాగా ఆమె 'మిణుగురు' సినిమాతో అవార్డు దక్కించుకున్న అయోధ్యకుమార్ దర్శకత్వంలో ఓ లవ్‌స్టోరీ చేయడానికి ఒప్పుకుంది. ఈ మూవీ తనకు కచ్చితంగా మంచి హిట్‌ను అందిస్తుందన్న నమ్మకంతో ఉంది. తాను ఎప్పుడు ఇలాంటి రోల్ చేయలేదని అంటోంది. కచ్చితంగా తన పాత్ర ప్రేక్షకులను ఆశ్చర్యపరిచేలా ఉంటుందని చెప్పింది. గతంలో చాలా సినిమాల్లో బాల నటుడిగా చేసిన తేజ సజ్జ ఈ మూవీలో హీరోగా తెలుగు తెరకు పరిచయమవుతున్నాడు. రొమాంటిక్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ మూవీ షూటింగ్ త్వరలోనే ప్రారంభంకానుంది. ఇంతవరకు తన గ్లామర్‌తోనే మెప్పిస్తూ వచ్చినా హెబ్బాపటేల్ ఈసారి నటనతో కూడా ఆకట్టుకుంటానంటోంది.

'క్రిష్ 4'కు సన్నాహాలు



హృతిక్ రోషన్

బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్‌కు క్రిష్ సిరీస్ సినిమాలు ఎంత పెద్ద విజయాన్ని అందించాయో తెలిసిందే. ఈ చిత్రాలు అన్నీ రికార్డు కలెక్షన్స్‌తో బాక్సాఫీస్ వద్ద సత్తా చాటాయి. అయితే ఈ సిరీస్‌లో మరో సినిమా కూడా రాబోతోంది. 'క్రిష్ 4' చిత్రం 2020లో రానుందని హృతిక్ రోషన్ తండ్రి అయిన దర్శకుడు రాకేష్ రోషన్ తెలిపాడు. ఈ చిత్రాన్ని సమ్‌థింగ్ స్పెషల్‌గా తెరకెక్కిస్తారట. హృతిక్ కెరీర్‌లో ఇది బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలుస్తుందని రాకేష్ రోషన్ చెప్పాడు. ప్రస్తుతం 'క్రిష్ 4' చిత్రం స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. త్వరలో షూటింగ్ ప్రారంభించడానికి దర్శకుడు రాకేష్ రోషన్ సన్నాహాలు చేస్తున్నాడని తెలిసింది. హృతిక్ పుట్టిన రోజు సందర్భంగా ఈ సినిమా గురించి ప్రకటించడం అతని అభిమానులకు ఎంతో సంతోషాన్నిచ్చింది. మరి తనయుడిని రాకేష్ రోషన్ 'క్రిష్ 4' చిత్రంతో ఏ స్థాయికి తీసుకెళ్తాడో చూడాలి. ప్రస్తుతం హృతిక్ ఈ చిత్రం కోసం కొత్త లుక్‌ను ట్రై చేస్తున్నాడట.

సొంతింటి కలను నెరవేర్చుకుంది



లావణ్య త్రిపాఠి

'అందాల రాక్షసి' చిత్రంతో హీరోయిన్‌గా పరిచయమైన లావణ్య త్రిపాఠి హైదరాబాద్‌లో తన సొంతింటి కలను నెరవేర్చుకుంది. ఎంతో కాలంగా ఉన్న తన కోరికను తీర్చుకున్న ఈ భామ ప్రస్తుతం ఎంతో సంతోషంగా ఉంది. హైదరాబాద్‌లో ఉన్నప్పుడల్లా ఏదైనా ఫైవ్‌స్టార్ హోటల్‌లో ఉండటం అలవాటు చేసుకున్న లావణ్య తన భవిష్యత్తు అంతా టాలీవుడ్‌లోనే అని నిర్ణయించుకొని ఇక్కడే సెటిలైంది. అన్ని వసతులు ఉన్న ఒక చక్కని ఇంటి కోసం గత కొన్ని నెలలుగా వెతుకుతున్న లావణ్య చివరికి అన్ని సౌకర్యాలతో కూడిన ఫ్లాట్‌ను ఎంచుకుంది. సంక్రాంతికి గృహ ప్రవేశం చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్న లావణ్య ఇండస్ట్రీలో తనకు బాగా దగ్గరైన వాళ్లు, సన్నిహితులను కొందరిని మాత్రమే ఆహ్వానించనుందట. ఇక గత సంవత్సరం లావణ్యకు మిశ్రమ ఫలితాలు దక్కాయి. 'ఉన్నది ఒకటే జిందగీ' సక్సెస్ ఆమెకు ఊరటనిచ్చింది. ప్రస్తుతం వి.వి.వినాయక్ దర్శకత్వంలో సాయిధరమ్ తేజ్‌కు జోడీగా చేస్తున్న చిత్రంపై లావణ్య త్రిపాఠి ఎన్నో ఆశలు పెట్టుకుంది. ఇక తమిళ్‌లో '100% లవ్' రీమేక్‌లో మొదట హీరోయిన్‌గా ఓకే అయి ఆతర్వాత ఆమె తప్పుకుంది. ఆ సినిమాను శాలిని పాండే చేస్తోంది. ఇలా అనుకోకుండా ఒకటి, రెండు అవకాశాలు చేజారడంతో నిరాశచెందిన లావణ్య కొత్త ఇల్లు తనకు అన్ని విధాలా కలిసివచ్చి చేస్తున్న సినిమాలు సక్సెస్‌నిచ్చి కొత్త అవకాశాలను తెచ్చిపెడుతుందని ఆశిస్తోంది.

మన తెలంగాణ
11 హైదరాబాద్ శుక్రవారం 12, జనవరి 2018
www.manatelangana.news



14న భారత్‌కు నెతన్యాహు రాక

జెరూసలేం: ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు వచ్చే వారం భారత్‌లో పర్యటించనున్నారు. ఆయన పర్యటన సందర్భంగా భారత్, ఇజ్రాయెల్ ద్వైపాక్షిక సంబంధాలు మరింత బలపడే అవకాశాలున్నాయి. జెరూసలేంను ఇజ్రాయెల్ రాజధానిగా గుర్తిస్తూ అమెరికా తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఐక్యరాజ్య సమితి సాధారణ సభలో జరిగిన ఓటింగ్‌లో భారత్,ఇజ్రాయెల్‌కు ప్రతికూలంగా ఓటేసినప్పటికీ ఆ దేశం నిరుత్సా హపడలేదు సరికదా నెతన్యాహు భారత పర్యటన సందర్భంగా ఇరుదేశాల మధ్య సంబంధాలు మరింత బల పడగలన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.'నిజం చెప్పాలంటే భారత్,ఇజ్రాయెల్‌కు అనుకూలంగా ఓటేస్తుందనుకున్నాను.కానీ విభిన్నంగా ఓటేసింది. అయినప్పటికీ భారత్, ఇజ్రాయెల్ మధ్య ఉన్న సంబంధాల్లో ఎలాంటి మార్పు ఉండబోదు. పైగా రెండు దేశాల నడుమ సంబంధాలు మరింత వికసిస్తాయి' అని నెతన్యాహు అన్నారు. ప్రభుత్వ పత్రికా కార్యాలయం గురువారం విదేశీ పత్రికా సంస్థలకు ఇచ్చిన సంవత్సరాంత విందులో నెతన్యాహు ప్రసంగించారు. 'భారత ప్రధాని నరేంద్ర మోడీ జులైలో ఇజ్రాయెల్‌లో పర్యటించారు. ఇజ్రాయెల్‌లో పర్యటించిన తొలి భారత ప్రధాని కూడా ఆయనే. మోడీ పర్యటన ఓ మైలురాయి అని అందరూ భావించకతప్పదు. ఇక నేను భారత్ పర్యటించడం మరో మైలు రాయి కానున్నది' అన్నారు.

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు సాయం

మన తెలంగాణ/హైదరాబాద్: కావ్యహిత పథకం కింద బ్రాహ్మణ సామాజిక వర్గానికి చెందిన రచయితలు, కవులు తమ రచనలను ముద్రించుకోడానికి వీలుగా గరిష్టంగా రూ.50,000ఆర్థిక సహాయాన్ని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్తు ప్రకటించింది. ఈ పథకం కింద దరఖాస్తు చేయదలచిన వారు నివాస, కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలతో కూడిన తమ దరఖాస్తుతో పాటు రచనల రెండు ప్రతులను సంస్థ మెయిల్ ఐడికి, బొగ్గులకుంటలోని సంక్షేమ పరిషత్తు కార్యాలయానికి ఫిబ్రవరి 10 వ తేదీలోగా పంపించాలనిఅడ్మినిస్ట్రేటర్ కె.చంద్రమోహన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులను ఎంపిక కమిటీ పరిశీలించి, నియయ, నిబంధనలకు అనుగుణంగా ఉన్నవాటిని,ఆర్థిక సహాయం కోసం సిఫారసు చేస్తారు. ఆధ్యాత్మిక, చారిత్రక, పౌరాణిక, సామాజిక అంశాలకు సంబంధించిన కవిత్వం, విమర్శ, వ్యాసం, వ్యాఖ్యానం, కథ,నవల, పరిశీలనాత్మక వ్యాసాలు, సిద్ధాంత వ్యాసాలను ఈ పథకం కింద పరిగణనలోకి తీసుకుంటారు.

శ్రీ చైతన్య విద్యార్థికి బహుమతి




మన తెలంగాణ/హైదరాబాద్: కె.ఎల్. డీమ్డ్ విశ్వవిద్యాలయం –2017 సంవత్సరంలో నిర్వహించిన ఇంజనీరింగ్ ప్రవేశపరీక్షలో జాతీయ స్థాయిలో 16వ ర్యాంక్ సాధించిన శ్రీ చైతన్య జూనియర్ కళాశాల (భాస్కరభవన్ క్యాంపస్)కు చెందిన కొడాలి కృష్ణజకు విశ్వవిద్యాలయం రూ.50వేల నగదు బహుమతిని ప్రకటించింది. ఈ బహుమతిని విశ్వవిద్యాలయం తరపున తెలంగాణ ప్రాంతీయ మేనేజర్ మదన్ చెక్కు రూపంలో అందజేశారు. మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతోనే ప్రవేశపరీక్షలో జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన మొదటి 20 విద్యార్థులకు మొత్తంగా రూ.25 లక్షల నగదు బహుమతులను అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కె.ఎల్.డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ మేనేజర్లు రాజు, అశోక్ పాల్గొన్నారు.

ఒలింపియాడ్‌లో శ్రీ చైతన్య ఆధిపత్యం


మన తెలంగాణ/హైదరాబాద్: డాక్టర్ ఎ.ఎస్.రావు ఒలింపియాడ్‌లో శ్రీ చైతన్య విద్యార్థులు ఆలిండియా నెంబర్ 1 ర్యాంకుతో పాటు టాప్ 10లో 15 ర్యాంకులు, టాప్ 20లో 28 ర్యాంకులను సాధించారు. 9వ తరగతి విద్యార్థుల్లో 36 మంది విద్యార్థులకు ర్యాంకులు ప్రకటించగా, వారిలో 22 మంది, 10వ తరగతిలో 40 మంది విద్యార్థులలో 29 మంది శ్రీ చైతన్య విద్యార్థులే ఉన్నారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించడంలో తమ అధిపత్యాన్ని చాటిందని శ్రీ చైతన్య విద్యా సంస్థల ఛైర్మన్ డా. బి.ఎస్. రావు, అకడమిక్ డైరక్టర్ సీమ తెలిపారు. అకడమిక్ ప్రోగ్రామ్స్, అంకితభావంతో పని చేసే అధ్యాపకుల వల్లనే ఇంతటి ఘన విజయాలను తాము సాధిస్తున్నామని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కామెరూన్ వైట్‌కు చోటు



మెల్‌బోర్న్: మూడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆల్‌రౌండర్ కామెరూన్ వైట్ ఆస్ట్రేలియా జట్టులో తిరిగి చోటు సంపాదించాడు. ఇంగ్లాండ్‌తో జరిగే ఐదు వన్డేల సిరీస్‌కు అతన్ని ఎంపిక చేశారు. వైట్ చివరి సారిగా జనవరి 2015లో ఆస్ట్రేలియా జట్టుకు ప్రాతినిథ్యం వహించాడు. గాయం,పేలవమైన ఫాం తదితర కారణాలతో అతను అప్పటి నుంచి జాతీయ జట్టుకు దూరంగానే ఉన్నాడు. అయితే ఇంగ్లాండ్ సిరీస్ కోసం అతనికి అనూహ్యంగా సెలెక్టర్ల నుంచి పిలుపు వచ్చింది. 34 ఏళ్ల వైట్ ఇప్పటివరకు 88 వన్డేల్లో ఆసీస్‌కు ప్రాతినిథ్యం వహించాడు. బ్యాట్‌తో, బంతితో సత్తా చాటి అగ్రశ్రేణి ఆల్ రౌండర్లలో ఒకడిగా పేరు తెచ్చుకున్నాడు. ఇటీవల కాలంలో దేశవాళి క్రికెట్‌లో నిలకడగా రాణిస్తున్నాడు. దీంతో సెలెక్టర్లు అతనికి జాతీయ జట్టులోకి తీసుకున్నారు. ప్రస్తుతం వైట్ మంచి ఫాంలో ఉన్నాడని, అతన్ని జాతీయ జట్టుకు తీసుకోవడంలో తమ కు ఎటువంటి అభ్యంతరం లేదని చీఫ్ సెలెక్టర్ ట్రావెర్ హన్స్ పేర్కొన్నా రు. కొంతకాలంగా వైట్ డొమెస్టిక్ సీజన్‌లో మెరుపులు మెరిపిస్తున్నాడు. దీంతో జాతీయ జట్టులో ఆడేందుకు అతను అర్హుడేనని భావించి ఎంపిక చేశామని హన్స్ వివరించారు. గాయం వల్ల క్రిస్ లీన్ జట్టుకు దూరం కావడంతో అతనికి బదులు వైట్‌ను తీసుకున్నారు.

రహానెను తప్పించడం పొరపాటే...



సెంచూరియన్: తొలి టెస్టులో అజింక్య రహానెను తప్పించి భారత జట్టు భారీ మూల్యమే చెల్లించుకుందని దక్షిణాఫ్రికా దిగ్గజం అలన్ డొనాల్డ్ అభిప్రాయపడ్డాడు. ఈ మ్యాచ్‌లో రహానె బరిలోకి దిగి ఉంటే ఫలితం కచ్చితంగా భారత్‌కు అనుకూలంగా ఉండేదన్నాడు. పుజారాతో కలిసి అతను నెలకొల్పే భాగస్వామ్యాలు భారత్ సాధించిన విజయాల్లో కీలక పాత్ర పోషించిన విషయాన్ని డొనాల్డ్ గుర్తు చేశాడు. అతన్ని ఎందుకు పక్కన బెట్టారో తనకైతే ఇప్పటికీ అంతు బట్టడం లేదన్నాడు. బౌన్సీ పిచ్‌లపై సమర్థంగా రాణించే బ్యాట్స్‌మెన్‌లలో రహానెకు తాను అగ్రస్థానం ఇస్తానని డొనాల్డ్ అన్నాడు. అటువంటి బ్యాట్స్‌మన్‌ను తుది జట్టుకు ఎంపిక చేయక పోవడం పెద్ద పొరపాటేనని పేర్కొన్నాడు. ఇక, రానున్న మ్యాచుల్లో కోలుకోవడం భారత్‌కు అంత సులువు కాదని డొనాల్డ్ అభిప్రాయపడ్డాడు.

అమెరికా పీఛేముడ్

మళ్ళీ 'పారిస్' ఒప్పందం వైపు చూపు





వాషింగ్టన్: పారిస్ వాతావరణ ఒప్పందానికి అమెరికా తిరిగి వస్తుందా? అధ్యక్షుడు ట్రంప్ గురువారం చేసిన వ్యాఖ్యల్లో ఈ మేరకు సంకేతం ఉంది. గత జూన్‌లో ఆ ఒప్పందం నుంచి ట్రంప్ యంత్రాంగం ఉపసంహరించుకుంది. అయితే తాజా ప్రకటనలో తిరిగి ఆ ఒప్పందాన్ని శిరసా వహించే సూచన చూచాయిగా ట్రంప్ అందించారు. పర్యావరణ అంశాలకు తన పాలనా యంత్రాం గం ప్రాముఖ్యం ఇస్తుందని చెప్పారు. అయితే మాకు వ్యాపారంలో పోటీతత్వం కాపాడడం కూడా ముఖ్యమని చెప్పారు. 'శుభ్రమైన నీరు, గాలి కావాలి' అని పేర్కొన్నారు. అయితే పారిస్ ఒప్పందం నుంచి వైదొలగుతూ తీసుకున్న నిర్ణయాన్ని ఆయన సమర్థించారు. అయితే పర్యావరణ ప్రాధాన్యతల వల్ల అమెరికా వ్యాపారం దెబ్బతింటోందని చెప్పారు. నార్వే ప్రధాని ఎర్నా సోల్ బెర్గ్‌తో ఉమ్మడి విలేకరుల గోష్టిలో ఆయన ఈ సంకేతం అందించారు.

సకాలంలో కిమ్‌తో చర్చలు : ట్రంప్

ఉత్తర కొరియాతో చర్చలకు సిద్ధంగా ఉన్నామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గురువారం మళ్లీ స్పష్టం చేశారు. అయితే సరియైన కాలంలో అవి జరుగుతాయన్నారు. దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జే ఇన్‌తో టెలిఫోన్ సంభాషణలో ఆయన ఈ విషయం చెప్పారు. ఉత్తర కొరియాతో ఇటీవల తాము జరిపిన చర్చల వివరాలను ట్రంప్‌కు జే అందించారు. సరియైన కాలంలో, సరియైన పరిస్థితిలో ఉత్తర కొరియాతో అమెరికా చర్చలు సాగుతాయని ట్రంప్ వివరించారు. దక్షిణ కొరియా నేతతో తన సంభాషణ చక్కగా సాగినట్లు విలేకరులకు ట్రంప్ వివరించారు.

13 నుండి చెన్నారెడ్డి శతజయంతి ఉత్సవాలు



మన తెలంగాణ / హైదరాబాద్ : తమిళనాడు, రాజస్థాన్ మాజీ గవర్నర్, ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి శతజయంతి ఉత్సవాలను ఈ నెల 13 నుండి ప్రారంభమై ఏడాది పొడవున సాగనున్నట్లు ఉత్సవాల కమిటీ చైర్మన్, మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య వెల్లడించారు. హైదరాబాద్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం జరిగే చెన్నారెడ్డి 99వ జయంతికి పుదుచ్చేరి ముఖ్యమంత్రి నారాయణ స్వామి హాజరవుతారని తెలిపా రు. అలాగే మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ కూడా త్వరలో నిర్ణయించే ఒక కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. ఏడాది పొడవున దేశంలోని వివిధ ప్రాంతాల్లో కూడా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. చెన్నారెడ్డి ప్రజాదరణ కలిగిన ప్రజా నాయకులని, ఆయన ఒక ప్రాంతానికి, జిల్లాకో,నియోజకవర్గానికో పరిమితమైన నాయకులు కారని చెప్పారు. భారతదేశం వివిధ హోదాల్లో ఆయన విశేష నాయకత్వాన్ని చవి చూసిందన్నారు. అనేక పదవులను సమర్థవంతంగా నిర్వర్తించారని,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు రెండు సార్లు ముఖ్యమంత్రిగా ఉన్నారని, 31ఏళ్ళ చిరు ప్రా యం లోనే మంత్రి అయ్యారని గుర్తు చేశారు. అలాంటి మహా నేత శతజయంతిని సముచితంగా నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వం నిర్వహిస్తే సంతోషం : మర్రి చెన్నారెడ్డి శతజయంతి ప్రభుత్వం ఏడాది పొడవున అధికారికంగా నిర్వహిస్తే సంతోషమని,లేదంటే కమిటీ ఎలాగో నిర్వహిస్తుందని రోశయ్య ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులుమాజీ మంత్రి మర్రిశశిధర్‌రెడ్డి,మర్రి రవీంద్రనాథ్‌రెడ్డి, కాంగ్రెస్ మేధావుల సెల్ కన్వీనర్ మదన్ మోహన్,మాజీ ఎంఎల్‌సికమలాకర్‌రావు, పిసిసి ప్రధాన కార్యదర్శి జి.నిరంజన్‌లు పాల్గొన్నారు.

'మొత్తం మానవత్వం చచ్చిపోయింది'

● చిన్నారి హత్యాచారం ఘటనపై పాకిస్థాన్ టివి యాంకర్ ఆవేదన ● కూతురితో కలిసి న్యూస్ రీడింగ్



ఇస్లామాబాద్: కసుర్‌లో 8 ఏళ్ల చిన్నారి హత్యాచారంపై పాకిస్థాన్‌లో నిరసనలు వెల్లువెత్తుతున్నాయి. సమా టివి న్యూస్ యాంకర్ అయితే ఏకంగా తన కూతురుతో కలసి బుధవారం న్యూస్ బులెటిన్‌ను ప్రసారం చేసింది. ఒళ్లో తన చిన్నారిని పెట్టుకుని కిరణ్ నాజ్ న్యూస్ బులెటిన్‌ను ప్రసారం చేసింది.'నేను ఈరోజు కిరణ్ నాజ్‌ను కాదు. ఓ తల్లిని. అందుకే నేను నా కూతురితో ఇక్కడ కూర్చున్నాను' అనిమొదలెట్టింది. పాకిస్థాన్‌లో పెరిగిపోతున్న అత్యాచారాలు, హత్యలను నాజ్ ఖండించింది. 'చిన్నారుల శవపేటికలు చాలా బరువైనవని అంటారు. ఆ చిన్నారి శవపేటిక భారం మొత్తం పాకిస్థాన్‌పై పడింది' అని ఆమె మార్మికంగా చెప్పా రు. పంజాబ్‌లో 8 ఏళ్లపై జరిగిన హత్యాచారం హింసాత్మక నిరసనలకు దారి తీసింది. బుధవారం పోలీసులు జరిపిన కాల్పుల్లో ఇద్దరు చనిపోయారు కూడా. భారత సరిహద్దుకు కాసింత దూరంలోనే కసుర్ పట్టణం ఉంది. అక్కడే ఈ ఘటన చోటుచేసుకుంది. జనవరి 4న ట్యూషన్ సెంటర్ నుంచి ఆ చిన్నారి అదృశ్యం అయింది. ఆ చిన్నారి తల్లిదండ్రులు పవిత్ర యాత్ర చేయడానికి సౌదీ అరేబియా వెళ్లినప్పుడు ఈ ఘటన చోటుచేసుకుంది. గుర్తు తెలియని వ్యక్తులతో ఉన్న ఆ చిన్నారి సిసిటివి ఫుటేజిని ఆమె కుటుంబ సభ్యులు సామాజిక మాధ్యమంలో పెట్టారు. ఆ చిన్నారిని గొంతు నులుమి చంపే ముందు ఆమె అనేకసార్లు అత్యాచారం జరిగిందని సమాచారం. 'ఆ అమ్మాయికి న్యాయ జరగాలి, చనిపోయింది ఓ చిన్నారి కాదు..చనిపోయింది మొత్తం మానవత్వం' అని నాజ్ తన వార్తా బులెటిన్‌ను ముగించారు. సౌదీ అరేబియా నుంచి తిరిగొచ్చిన ఆ చిన్నారి తండ్రి న్యాయం జరిగేంత వరకు తన కూతురి పార్థివ శరీరాన్ని ఖననం చేయనని అన్నారు.

టీమిండియా ముమ్మర సాధన



సెంచూరియన్: దక్షిణాఫ్రికాతో జరిగే రెండో టెస్టు కోసం టీమిండియా ఆటగాళ్లు ముమ్మర సాధనలో నిమగ్నమయ్యారు. తొలి టెస్టులో ఘోర పరాజయం నేపథ్యంలో భారత జట్టుపై విమర్శల వర్షం కురుస్తోంది. 208 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని సైతం ఛేదించలేక చతికిల పడడాన్ని అభిమానులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఇదిలావుండగా శనివారం నుంచి ప్రారంభమయ్యే రెండో టెస్టులో గెలిచి సఫారీలపై కసి తీర్చుకోవాలని టీమిండియా భావిస్తోంది. ఇందులో భాగంగానే గురువారం జట్టు సభ్యులు సెంచూరియన్ గ్రౌండ్‌లో కఠోర సాధన చేశారు. కెప్టెన్ విరాట్ కోహ్లి కూడా సాధనలో పాలు పంచుకున్నాడు. కాగా, తొలి టెస్టుకు దూరంగా ఉన్న రవీంద్ర జడేజా కూడా సాధనలో నిమగ్నమయ్యాడు. ఓపెనర్ లోకేష్ రాహుల్, స్టార్ ఆటగాడు అజింక్య రహానె, ఇషాంత్ శర్మ, జడేజా తదితరులు చాలా సేపు ప్రాక్టీస్ చేశారు. ఈ మ్యాచ్‌లో కోహ్లి కీలక మార్పులు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. తొలి టెస్టులో ఆడని రహానె, రాహుల్‌లకు జట్టులో చోటు దక్కే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి. ఇక, రవీంద్ర జడేజాను కూడా ఆడించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదే జరిగితే ఎవరు తుది జట్టులో స్థానం కోల్పోతారో అంతు బట్టకుండా మారింది. రోహిత్‌ను తొలగించి రహానెను ఆడించాలనే ఒత్తిడి కోహ్లిపై నెలకొంది. అయితే కోహ్లి మాత్రం రోహిత్‌కు మరో అవకాశం ఇవ్వాలనే లక్ష్యంతో కనిపిస్తున్నాడు.



ఒత్తిడిలో కోహ్లి ....

తొలి టెస్టులో జట్టు ఘోర పరాజయం పాలైన నేపథ్యంలో టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లిపై తీవ్ర ఒత్తిడి నెలకొంది. జట్టును ముందుండి నడిపించడంలో కోహ్లి విఫలమయ్యాడు. దీంతో అతనిపై అభిమానులతో పాటు బిసిసిఐ అధికారులు కూడా గుర్రుగా ఉన్నారు. మితిమిరిన ఆత్మవిశ్వాసం, నిర్లక్ష్యం వల్లే గెలవాల్సిన తొలి మ్యాచ్‌లో భారత్ ఘోర పరాజయం పాలైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అంతేగాక జట్టు ఎంపికలో కోహ్లి వ్యవహరించిన తీరును కూడా చాలా మంది తప్పుపడుతున్నారు. బౌన్సీ పిచ్‌లపై



మెరుగైన రికార్డు కలిగిన అజింక్య రహానెను తప్పించడంపై అందరు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రహానె, రాహుల్ బరిలో ఉంటే ఫలితం కచ్చితంగా భారత్‌కు అనుకూలంగా ఉండేదనే విమర్శలు ఉన్నాయి. కోహ్లి, ప్రధాన కోచ్ రవిశాస్త్రి అనుసరిస్తున్న విధానలపై ఇప్పటికే విమర్శలు మొదలయ్యాయి. ఇలాగే ఉంటే జట్టు ప్రయోజనాలు దెబ్బతినడం ఖాయమని మాజీ క్రికెటర్లు గంగూలీ, గవాస్కర్, మంజ్రేకర్, సెహ్వాగ్ తదితరులు హెచ్చరిస్తున్నారు. కాగా, ఒకే ఒక్క ఓటమితో ప్రస్తుతం కోహ్లి ఆత్మరక్షణలో పడిపోయాడు. ఇక, జట్టును ముందుండి నడిపించడం అతనికి సవాలుగా మారింది. అయితే సవాళ్లను ప్రతిష్టాత్మకంగా తీసుకునే కోహ్లి మళ్లీ భారత్‌ను గెలుపు బాటలో నడిపిస్తాడని అభిమానులు ధీమాతో ఉన్నారు.



నాదల్‌కు టాప్ సీడ్

బరిలో జొకొవిచ్, వావ్రింకా

మెల్‌బోర్న్: సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియా ఓపెన్‌లో స్పెయిన్ రఫెల్ నాదల్‌కు టాప్ సీడ్ లభించింది. స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెదరర్‌కు రెండో సీడ్ దక్కింది. ఆరు సార్లు ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్స్ సాధించిన సెర్బియా యోధుడు నొవాక్ జొకొవిచ్‌కు 14వ సీడింగ్ కేటాయించారు. మహిళల విభాగంలో సిమోనా హెలెప్‌కు టాప్ సీడ్, కరోలినా వోజ్నియాకికి రెండో సీడ్ దక్కింది. వింబుల్డన్ విజేత, స్పెయిన్ స్టార్ గార్బయిన్ ముగురుజాకు మూడో సీడ్ దక్కింది. వీనస్ విలియమ్స్‌కు ఐదో సీడ్ లభించింది. కాగా, పురుషుల విభాగంలో అనుకున్నట్టే ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ క్రీడాకారుడు, కిందటి రన్నరప్ నాదల్‌కు టాప్ సీడింగ్ దక్కింది. స్విట్జర్లాండ్ స్టార్ ఫెదరర్‌కు రెండో సీడ్ లభించింది. కిందటి ఏడాది రోజర్ ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్‌ను సాధించిన విషయం తెలిసిందే. ఇదిలావుండగా గాయం కారణంగా బ్రిటన్ ఆశాకిరణం ఆండీ ముర్రే, జపాన్ స్టార్ నిషికొరి ఆస్ట్రేలియా ఓపెన్ బరిలోకి దిగడం లేదు. అదే విధంగా ఫిట్‌నెస్ లేమితో సతమతమవుతున్న 23 సార్ల గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ విజేత సెరెనా విలియమ్స్ కూడా ఆస్ట్రేలియా ఓపెన్‌కు దూరంగా ఉంటుంది. ఇదిలావుండగా చాలా కాలం తర్వాత జొకొవిచ్ మళ్లీ బరిలోకి దిగనున్నాడు. ఇప్పటికే ఆరు ఆస్ట్రేలియా ఓపెన్ టైటిల్స్ సాధించి సత్తా చాటాడు. తాజాగా తన ఖాతాలో ఏడో టైటిల్ జమ చేసుకోవాలని భావిస్తున్నాడు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో జొకొవిచ్ టైటిల్ సాధించడం అంత సులువు కాదని విశ్లేషకులు అంటున్నారు. ఫెదరర్, నాదల్ నుంచి జొకొవిచ్‌కు గట్టి పోటీ నెలకొంది. ఇప్పటి వరకు జొకొవిచ్ 12 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ సాధించాడు. గాయం కారణంగా కిందటి ఏడాది చాలా టోర్నీలకు దూరంగా ఉండాల్సి వచ్చింది. ఫ్రాన్స్ ఆటగాడు వావ్రింకా కూడా చాలా రోజుల తర్వాత మళ్లీ బరిలోకి దిగుతున్నాడు. అతనిపై కూడా అందరి దృష్టి నెలకొంది. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ అయిన ఆస్ట్రేలియా ఓపెన్‌కు జనవరి 15న తెరలేవనుంది.




అతి తక్కువ తరుగు కానీ, అత్యధిక నాణ్యత మరియు విలువ.

పెద్ద జ్యూవెలరీ అనగా పెద్ద ధర కాదు. మలబార్ గోల్డ్ & డైమండ్స్ వద్ద మీరు ఇష్టపడే ఆభరణాలను 3% తరుగు నుంచి కొనుక్కోవచ్చు. అదీ విలువ లేదా నాణ్యతలలో ఏ మాత్రము రాజీ పడకుండా మీరు ప్రపంచంలో అత్యుత్తమ జ్యూవెలర్ దగ్గర అతి నవీనమైన డిజైన్లలో బ్రైడల్ వేర్, పార్టీవేర్, డైలీవేర్ మరియు ప్రతీ సందర్భానికి తగిన ఆభరణాలను వస్తృత శ్రేణి కలెక్షన్ నుంచి ఎంచుకోగలిగినప్పుడు మరొక చోటికి వెళ్ళవలసిన అవసరం ఏమిటి ?

MALABAR
GOLD & DIAMONDS
CELEBRATE THE BEAUTY OF LIFE

బంగారం కొనుగోలు అనేది ఒక సంతోషకరమైన అనుభూతి. సరైన బిల్లు మనసుకి ఒక ప్రశాంతతని కలుజేస్తుంది.

మీరు పెట్టుబడిగా లేదా మీ ప్రియమైన వారికి బహుమతిగా బంగారం కొనుగోలు చేసినప్పుడు, సరైన బిల్లును అడిగి తీసుకోవాలి. అది మీ హక్కు.



- మీరు మీ ఆభరణాల మార్పిడి లేదా పున:విక్రయం చేసినప్పుడు ఒరిజినల్ బిల్లు తప్పనిసరి.
- మీ యాజమాన్యాన్ని నిరూపించడానికి మరియు మీరు కొనుగోలు చేసిన ఆభరణాలపై ఉత్పన్నమయ్యే ఏదైనా ఫిర్యాదులు లేదా వివాదాల సందర్భములో చట్టబద్ధమైన రక్షణను పొదడానికి బిల్లు ఒక ప్రామాణిక పత్రం.
- బంగారం స్వచ్ఛత మరియు బరువు, రాళ్ళ బరువు, రాళ్ళ ఛార్జ్ మొదలైన వివరాలను తెలుపుతూ మలబార్ గోల్డ్ & డైమండ్స్ ఎల్లప్పుడూ వారి వినియోగదారులకు ఒరిజినల్ బిల్లును జారీ చేస్తుంది మరియు వినియోగదారుల కొనుగోలుపై జీవితకాలం ఉచిత నిర్వహణ, తిరిగి కొనుగోలు హామీ, ఉచిత భీమా సదుపాయం వంటి ప్రత్యేక సేవలను అందిస్తుంది.
- అంతేకాక, బాధ్యతాయుతమైన పౌరుడిగా, పన్ను ఎగవేత, అక్రమ వ్యాపార పద్ధతులు మరియు బంగారం అక్రమ రవాణాల ద్వారా మన దేశ అభివృద్ధికి హాని కలిగించే విషయాలకు ముగింపు పలుకుతూ నగలు కొనుగోలు చేసేటప్పుడు సరైన బిల్లును కోరుతూ మన దేశ ఆర్థిక వ్యవస్థకి మరియు అభివృద్ధికి తోడ్పడదాం.

సెంట్రల్ ఎక్సైజ్ ట్యాక్స్, సెంట్రల్ సేల్స్ ట్యాక్స్, వాల్యూ యాడెడ్ ట్యాక్స్, సర్వీస్ ట్యాక్స్ ఇప్పుడు జి.యస్.టి చేత భర్తీ చేయబడ్డాయి, జి.యస్.టి ద్వారా మాకు లభించే పన్ను ప్రయోజనాలను మీకు **ప్రత్యేకమైన డిస్కౌంట్ ఆఫర్ల** ద్వారా అందజేస్తున్నాము.

తరుగు చార్జీలు 3% నుండి | 100% బి.ఐ.ఎస్ 916 హాల్‌మార్క్ బంగారం | INTERNATIONAL GEMOLOGICAL INSTITUTE ధృవీకరించబడిన వజ్రాలు | GIA GEMOLOGICAL INSTITUTE OF AMERICA ధృవీకరించబడిన వజ్రాలు | తిరిగి కొనుగోలు హామీ | జీవితకాల ఉచిత నిర్వహణ | ఒక సంవత్సరం ఉచిత భీమ | పారదర్శకమైన & వివరణాత్మకమైన ధరట్యాగ్

నక్కలగుట్ట మెయిన్ రోడ్, హనుమకొండ, **వరంగల్**, ఫోన్ : **0870 2422916, 2433916**

BUY ONLINE AT: malabargoldanddiamonds.com | 195 షోరూమ్‌లు 9 దేశాలలో

Printed and published by K Sreenivas Reddy, Printed at M/s. JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, D-75 & C-52, Industrial Estate (APIE), Balanagar-500037, R.R.Dist., TELANGANA and Published from H.No.12-1-493/VA, Giriprasad Bhavan,Opp:Rajiv Swagruha Offices Complex, Bandlaguda Main Road, Nagole, R.R. Dist. and owned by M/s. Moveon Media Private Limited, **Editor: K. Sreenivas Reddy,** RNI Regn. No.TELTEL/2012/42234, Phone No/Fax:040-27655666, e-mail : editor@manatelangana.org.